సత్యమేవ జయతే

సాక్షి

‘పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది’

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం

వెల: ₹ 7.00

సంపుటి: 16

సంచిక: 307

ఆదివారం 28-1-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

వైరల్





అరవైలోనూ ఇరవై!

నృత్యానికి వయసు అడ్డు కాదని మరోసారి నిరూపించింది మాజీ బాలీవుడ్ హీరోయిన్ మీనాక్షి శేషాద్రి. 60 ఏళ్ల వయసులోనూ అద్భుతమైన క్లాసికల్ డ్యాన్స్ కొరియోగ్రఫీతో నెటిజనులను ఆకట్టుకుంది. 'ఎక్స్'లో పోస్ట్ చేసిన ఈ డ్యాన్స్ వీడియో వైరల్ అయింది. క్లిష్టమైన ఫుట్‌వర్క్, హావభావాల వ్యక్తీకరణతో నెటిజనులను ఆకట్టుకుంది. ఆమె కాలాతీత అందం, క్లాసికల్ డాన్స్ పట్ల నిబద్ధతకు అభిమానులు సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. 1980లలో హీరో, మేరీ జంగ్, దామినిలాంటి చిత్రాలలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్న మీనాక్షి బాలీవుడ్‌కు గుడ్‌బై చెప్పి భర్త, బిడ్డలతో అమెరికాలో స్థిరపడింది. అక్కడ ఒక డ్యాన్స్ స్కూల్ ప్రారంభించి భరతనాట్యం, కథక్, ఒడిస్సీ నృత్యాలను నేర్పించేది. ఆన్-స్క్రీన్ మీద కనిపించనప్పటికీ ఈ అందాల నటి సోషల్ మీడియాలో మాత్రం చురుగ్గా ఉంటోంది. 'అప్పుడు-ఇప్పుడూ' అనే కాప్షన్‌తో పాత, కొత్త ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ ఉంటుంది.

పెళ్లి ముహూర్తం ముంచుకొస్తోంది...
పెళ్లి కుమార్తె ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుపోయింది

అప్పుడు ఏమైందంటే...

'పెళ్లి జరగాలంటే?' అనే ప్రశ్నకు 'రెండు మనసులు కలవాలి' అనే సిన్మా డైలాగ్ చెబుతాం. బెంగళూరు విషయానికి వస్తే మాత్రం 'వధూవరులు టైమ్‌కు ఫంక్షన్ హాల్‌కు చేరుకోవాలి' అనే జవాబే వినిపిస్తుంది. బెంగళూరులో ట్రాఫిక్ జామ్ అనేది తరచుగా వార్తల్లో ఉండే అంశం. బెంగళూరులో ఒక వధువు ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుపోయింది. మరో వైపు పెళ్లి ముహూర్తం ముంచుకొస్తోంది. దీంతో బ్రైడల్ కారును విడిచి పరుగెత్తుతూ మెట్రో రైలు



ఎక్కింది వధువు. ముహూర్తం టైమ్‌కు ముందుగానే ఫంక్షన్ హాల్‌కు చేరుకుంది. వైరల్ అవుతున్న ఈ వీడియోలో వధువు మెట్రో ఆటోమేటిక్ ఎంట్రీ గేటును దాటి రైలు ఎక్కుతున్న దృశ్యాలు కనిపిస్తాయి. 'మెట్రోవాలే దుల్హనియా లేజాయేంగే' 'ప్రాక్టికల్ పర్సన్. విష్ హర్ గ్రేట్ ఫ్యూచర్' 'స్మార్ట్ థింకింగ్'... ఇలాంటి రకరకాల కామెంట్స్ నెటిజనుల నుంచి వెల్లువెత్తాయి.

అయ్యో అబ్బాయి!

'ప్రేమా మజాకా!' అని మరోసారి అనిపించే సంఘటన ఇది. పంజాబ్‌కు చెందిన ఆంగ్రేజ్ సింగ్, పరమ్‌జిత్ కౌర్ ప్రేమికులు. కౌర్ 'బాబా ఫరీద్ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్' నిర్వహించే మల్టీ-పర్పస్ హెల్త్ వర్కర్స్ ఎగ్జామ్స్‌కు ప్రిపేరవుతుంది. అయితే తన ప్రియురాలు కష్టపడడాన్ని ఆంగ్రేజ్ సింగ్ తట్టుకోలేక పోయాడు. 'నీ బదులు నేను ఎగ్జామ్ రాస్తాను. ఆ కష్టమేదో నేను పడతాను' అంటూ రంగంలోకి దిగాడు. ఎగ్జామ్స్ ప్రిపరేషన్‌కు కష్టపడ్డాడో లేదో తెలియదుగానీ మీసాలు, గెడ్డాలు



గీయించి, పెదాలకు లిపిస్టిక్ పూసి, సల్వార్ కమీజ్ వేసుకొని అచ్చం అమ్మాయిలాగే కనబడడానికి చాలానే కష్టపడ్డాడు. అయితే బయోమెట్రిక్ దగ్గర ఫింగర్‌ప్రింట్స్ ఫెయిల్ కావడంతో ఆంగ్రేజ్ సింగ్ పట్టుబడ్డాడు. దీంతో సోషల్ మీడియాలో ఆంగ్రేజ్‌సింగ్‌పై మీమ్సే మీమ్స్. అయ్యో పాపం అబ్బాయి!

అవునండీ... ఇది బిర్యానీ టీ

వేడి వేడిగా బిర్యానీ తింటే ఎంత మజా? ఆ తరువాత వేడి వేడిగా టీ తాగుతుంటే ఎంత మజా! ఆ మజాను ఈ మజాను మిక్స్ చేసి 'బిర్యానీ టీ' తయారుచేసింది 'మాస్టర్ చెఫ్ 4' విజేత నేహాదీపక్‌షా. టీ ఆకులు, దాల్చిన చెక్క, సోంపు, నల్లమిరియాలు, యాల కులు... మొదలైన వాటితో నేహా తయారు చేసిన ఈ 'బిర్యానీ టీ' చవులూరిస్తూ నెట్టింట వైరల్ అవుతుంది. వీడియో వైరల్ కావడం మాట ఎలా ఉన్నా నెటిజనులు మాత్రం రకరకాలుగా స్పందిస్తున్నారు. కొందరు 'ఆహా ఓహో!' అని పొగడ్తల దండకం అందుకుంటే, మరి కొందరు 'బిర్యానీ టీ అంటే ఏమిటో కాదు వేడి వేడి బిర్యానీని వేడి వేడి టీలో కలపడం' అని జోక్ చేస్తున్నారు. ఐస్ క్రీమ్ రోల్ మేకర్ కూలింగ్ పాన్‌ను ఉపయోగించి ఒక చెఫ్ తయారుచేసిన 'స్క్రీమ్‌టీ'కూడా ఈమధ్య నెట్‌లోకంలో హల్‌చల్ చేసింది.





మరలా ఆ ముగ్గురి దర్శనం

రామానంద సాగర్ 'రామాయణ్' సీరియల్ రామాయణ గాథను ఇంటింటికీ తెచ్చింది. 1987లో ప్రసారమైన ఈ సీరియల్ ఆ రోజుల్లో ప్రపంచంలోనే ఎక్కువ మంది చూసిన సీరియల్. రాముడిగా అరుణ్ గోవిల్, సీతగా దీపికా చిక్‌లియా, లక్ష్మణుడిగా సునీల్ లహరీ ప్రేక్షకుల గుండెల్లో చెరగని స్థానం పొందారు. వీరు ముగ్గురూ మళ్లీ కనిపిస్తే? అదే ఆలోచన వచ్చింది అభిషేక్ ఠాకూర్ అనే నిర్మాతకు. అయోధ్యలో రామ మందిర ప్రతిష్ఠాపన సందర్భంగా 'హమారే రామ్ ఆయేహై' అనే పాటను సోను నిగమ్ గొంతులో రికార్డు చేయించి, అయోధ్య రామమందిర ప్రాంగణంలో, సరయూ నది ఒడ్డున చిత్రీకరించి విడుదల చేశాడు. ఆ పాటలో అరుణ్ గోవిల్, దీపిక, సునీల్ లహరీ... అయోధ్య ప్రాంగణంలో తిరుగాడటం... సాక్షాత్తు ఆ సీతారామ లక్ష్మణులు తిరిగిన భావనను భక్తులకు కలిగించింది. 'హమారే రామ్ ఆయేహై' పాట ఇప్పటికే కోటి వ్యూస్ దాటిపోయింది. ఇంకా ఎన్ని కోట్ల వ్యూస్ వస్తాయో చెప్పలేము. అరుణ్ గోవిల్, దీపికలు ఇప్పటికీ ఎక్కడ కనిపించినా పాద నమస్కారాలు చేసే ప్రేక్షకులు ఉన్నారు. ఇప్పుడు రామమందిర ప్రతిష్ఠాపన తర్వాత వారి కీర్తి మరింతగా విరాజిల్లనుంది.

ఫాదర్ ఆఫ్ రింకుసింగ్



ఇండియన్ ఇంటర్నేషనల్ క్రికెటర్ రింకుసింగ్ తండ్రి ఖాన్‌చందర్‌సింగ్ ఇప్పటికీ అలిగఢ్ (ఉత్తర్‌ప్రదేశ్)లో ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలో పనిచేస్తున్నాడు. చందర్ సింగ్ ఎల్‌పీజి సిలిండర్‌లు డెలివరీ చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. చందర్ వృత్తినిబద్ధతకు నెటిజనులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

'మీరు రెస్ట్ తీసుకోండి అని నాన్నకు చాలాసార్లు చెప్పాను. అయితే పనిని ప్రేమించే నాన్న విశ్రాంతి తీసుకోవడానికి నిరాకరించారు. పని చేస్తేనే నేను చురుగ్గా ఉంటాను అని చెబుతుంటారు' అంటున్నాడు రింకుసింగ్.

'కాస్త పేరు. కాస్త డబ్బు రాగానే చాలామంది గతాన్ని మరిచిపోయి గర్వంతో ప్రవర్తిస్తుంటారు. అలాంటి వారికి ఈ చిన్న వీడియో క్లిప్ కనువిప్పు కలిగిస్తుంది'

'కొడుకును ఇంటర్నేషనల్ క్రికెటర్‌గా తయారుచేయడానికి ఈ తండ్రి ఎంతో కష్టపడి ఉంటాడు. అప్పుడూ, ఇప్పుడూ తన సొంత కష్టాన్నే నమ్ముకున్నాడు. గ్రేట్ ఫాదర్!'...కామెంట్ సెక్షన్‌లో ఇలాంటివి చాలా కనిపించాయి.

పాత ఫర్నిచర్ మినియేచర్



కాలంతో పాటు ఫర్నిచర్‌లో కూడా మార్పు వస్తోంది. పాత ఫర్నిచర్ ఇప్పుడు అపురూపంగా అనిపిస్తుంది. అలనాటి ఫర్నిచర్‌ను కళ్లముందుంచేలా వశిష్ట్ రజని తయారుచేసిన పాత ఫర్నిచర్ మినియేచర్‌లు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నాయి. చికాగాలోని ఆర్ట్ మ్యూజిక్‌యంకు వెళ్లి వచ్చిన తరువాత వశిష్ట్‌కు పాత ఫర్నిచర్ మినియేచర్‌లు తయారుచేయాలనే ఆలోచన వచ్చింది. 30 సంవత్సరాల వశిష్ట్ చికాగోలో ఇండస్ట్రియల్ డిజైనర్‌గా పనిచేస్తున్నాడు.

హెల్త్

హెర్నియా అంటే ఒక అవయవంలోకి మరో అవయవం దూరిపోవడం. జీర్ణ వ్యవస్థలోని అవయవాలన్నీ ఛాతీ కింద ఉంటాయి. డయాఫ్రమ్ అనే పొర ద్వారా ఛాతీలోని అవయవాలూ, కడుపులోని జీర్ణ అవయవాలు వేరవుతాయి. ఏదైనా కారణాలతో కడుపు (విసరల్)లోనిజీర్ణవ్యవస్థలోని అవయవాలు ఛాతీలోకి దూసుకుపోవడంవల్ల వచ్చే వైద్యసమస్యను 'హయటస్ హెర్నియా' అంటారు.

హయటస్ హెర్నియా అంటే..?



హెర్నియా అంటే ఒక అవయవ భాగాల్లోకి మరో అవయవ భాగాలు దూరిపోవడం. సాధారణంగా కడుపులోని పేగులు వృషణాల సంచిలోకి వెళ్లడాన్ని మాత్రమే హెర్నియాగా సాధారణ ప్రజలు అనుకుంటుంటారు. 'ఇంగ్వినల్ హెర్నియా'గా పిలిచే... ఇది ఒక రకం మాత్రమే. అది మాత్రమే కాకుండా చాలా రకాల హెర్నియాలు ఉంటాయి. ఉదాహరణకు కడుపులోని పేగులు తొడ భాగంలోకి వెళ్లే 'ఫీమోరల్ హెర్నియా'; పొట్ట లోపలివి కడుపులోని పైభాగాల్లోకి వెళ్లే 'ఎపీగ్యాస్ట్రిక్ హెర్నియా'; కడుపు మీద ఏదైనా సర్జరీ జరిగినప్పుడు... కడుపులోని భాగాలు సర్జరీతో ఏర్పడ్డ ఈ గాటులోకి దూసుకెళ్లే 'ఇన్‌సీషనల్ హెర్నియా'; కడుపులోని భాగాలు బొడ్డులోకి వెళ్లే 'అంబలికల్ హెర్నియా' అంటూ చాలా రకాలుంటాయి.

హయటస్ హెర్నియా అంటే...

ఛాతీలో ఊపిరితిత్తులు, గుండె వంటి కీలక అవయవాలు ఉంటాయి. కడుపులో జీర్ణవ్యవస్థకు సంబంధించిన పేగులు ఉంటాయి. ఈ రెండింటినీ డయాఫ్రమ్ అనే పొర వేరు చేస్తుంది. ఈ పొరలోంచే ఈసోఫేగస్ అనే అన్నకోశం కడుపులోకి వస్తుంది. కాలక్రమంలో అన్ని అవయవాల్లాగే డయఫ్రమ్ కూడా బలహీనపడవచ్చు. అప్పుడు డయాఫ్రమ్‌లోంచో లేదా ఈసోఫేగస్ కడుపులోకి వచ్చే చోటనున్న కనెక్షన్ బలహీనపడటం వల్లనో.. పేగుల వంటి భాగాలు ఛాతీలోకి దూసుకెళ్లవచ్చు. ఇలా జరగడాన్ని 'హయటస్ హెర్నియా' అంటారు.

హయటస్ హెర్నియాలోని రకాలు...

హయటస్ హెర్నియాలోనూ రెండు రకాలుంటాయి. మొదటిది 'స్లైడింగ్ హయటల్ హెర్నియా', రెండోది 'పారా ఈసోఫేజియల్ హయటల్ హెర్నియా'. చాలా మందిలో 'స్లైడింగ్ హెర్నియా' కనిపిస్తుంది. కొందరిలో పారా ఈసోఫేజియల్ హయటల్ హెర్నియాలో ఉండే మరో మూడు రకాల్లో ఏదైనా రావచ్చు. ఆ రకాల గురించి సంక్షిప్తంగా...

టైప్ - 1: ఇది స్లైడింగ్ హెర్నియా. దాదాపు 95% హయటల్ హెర్నియాలన్నీ ఇదే రకానికి చెందుతాయి. ఇందులో పైనుంచి డయాఫ్రమ్ పొర ద్వారా విసరల్ (కడుపులోకి వచ్చే) భాగంలోకి వచ్చే అన్నకోశం (ఈసోఫేగస్) అదే దారిలో కాస్త పైకివెళ్లడమూ... దానంతట అదే మళ్లీ కిందికి వస్తూ ఉండటం జరుగుతుంది.

టైప్ - 2: (ఇక టైప్-2 నుంచి 4 వరకు అన్నీ పారా ఈసోఫేజియల్ హయటల్ హెర్నియాకు సంబంధించినవి). ఇందులో ఈసోఫేగస్ పక్కభాగం నుంచి కడుపులోని అవయవభాగాలు పైవైపునకు నెట్టబడతాయి. దాంతో ఈసోఫేగస్ పక్కనే ఉబ్బు ఏర్పడుతుంది. దీన్ని 'రోలింగ్ హయటల్ హెర్నియా' అని కూడా అంటారు.

టైప్ - 3: ఇందులో కొంత టైప్-1, మరికొంత టైప్-2... ఈ రెండు రకాలు కలగలసి ఉంటాయి. ఇందులో 'ఈసోఫేజియల్ జంక్షన్' వద్ద స్వయానా ఈసోఫేగసే పైవైపునకు నెట్టివేతకు గురవుతుంది.

టైప్ -4: చాలా అరుదు, సంక్లిష్టమైనదీ, కొంత ప్రమాదకరమైనది. ఇందులో కడుపులోని భాగాలు ఒకటికి మించి పైవైపునకు నెట్టివేతకు గురయ్యే అవకాశం ఉంది.

లక్షణాలు... స్లైడింగ్ హయటల్ హెర్నియాలో కొన్నిసార్లు అసలు ఏరకమైన లక్షణాలూ కనిపించకపోవచ్చు. అయితే మరికొందరిలో ఈ కింది లక్షణాలు కనిపించవచ్చు.
- **ఛాతీలో మంట :** ముఖ్యంగా ఏదైనా తిన్నవెంటనే ఈ మంట రావచ్చు.
- **గుండెలో నొప్పి :** గుండెలో నొప్పిగా అనిపించినప్పటికీ ఇది పూర్తిగా గుండెకు సంబంధించని నాన్-కార్డియాక్ పెయిన్‌గా చెప్పవచ్చు. కొంతమంది దీన్ని గుండెపోటుగా పొరబడినప్పటికీ దీనికీ గుండెపోటుకూ ఎలాంటి సంబంధమూ లేదు. ఈ నొప్పి ప్రాణానికి ఎంతమాత్రమూ ప్రమాదాన్ని తెచ్చిపెట్టదు.
- **అజీర్ణం :** తిన్నవెంటనే కడుపు నిండుగా అనిపిస్తూ కడుపులో నొప్పి రావడం.
- **యాసిడ్ పైకి చిమ్మడం :** కడుపులోని గ్యాస్ లేదా అక్కడి జీర్ణ రసాలు గొంతులోకి వస్తుంటాయి.
- **మింగడంలో ఇబ్బంది :** మింగడంలో ఇబ్బందితో పాటు కొన్నిసార్లు గొంతులో ఏదైనా అడ్డుగా ఉండవచ్చు.
- **గొంతు బొంగురుపోవడం :** కడుపులోని యాసిడ్ గొంతులోకి రావడం వల్ల గొంతు బొంగురుపోవడం, గొంతులో మంటగా ఉండటం జరగవచ్చు. ఇక్కడ ఒక అపోహ నుంచి దూరంగా ఉండాల్సిన అవసరం ఉంది. యాసిడ్ గొంతులోకి వచ్చిందటే అది హయటస్ హెర్నియా అని పొరబడకూడదు. హయటస్ హెర్నియా ఉన్నప్పటికీ ప్రతివారిలోనూ గొంతులోకి యాసిడ్ రావడం, దాంతో మంట రావడం జరగకపోవచ్చు.
- కొందరిలో వికారం, వాంతులు కావడం, ఊపిరి సరిగా అందకపోవడం, కడుపు పైభాగంలో/ఛాతీకింద నొక్కుతున్నట్లు అనిపించడం జరగవచ్చు. ఒంగినప్పుడు ఆ భాగంలో పదునైనదానితో గుచ్చినప్పుడు లేదా గిచ్చినప్పుడు కలిగే బాధ లాంటిది కనిపించవచ్చు.



డాక్టర్ జి.పార్థసారథి
సీనియర్ సర్జికల్
గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్

హయటస్ హెర్నియాకు కారణాలు...

- చాలాకాలం పాటు గట్టిగా దగ్గు వస్తుండటం లేదా గట్టిగా చీదడం
- సుదీర్ఘకాలం పాటు మలబద్ధకం వల్ల చాలాకాలం పాటు ముక్కుతూ మల విసర్జన చేస్తుండటం
- దీర్ఘకాలిక ఊబకాయం
- చాలాకాలం పాటు వాంతులు
- కఠినమైన వ్యాయామాల్లో భాగంగాఅకస్మాత్తుగా ఏదైనా బరువు ఎత్తడం.
- మహిళల్లో గర్భధారణ, పిల్లల్ని కనేటప్పటి ముక్కడాలు వంటివి.

హయటస్ హెర్నియా ప్రమాదకరమా?

సాధారణంగానైతే ఇది ప్రమాదకరం కాదు. కానీ కొన్నిసార్లు యాసిడ్ ప్రభావం వల్ల ఇసోఫేగస్‌లో ఇన్ఫెక్షన్, ఈసోఫేజియల్ స్ట్రిక్చర్, బారెట్స్ ఈసోఫేగస్ వంటి సమస్యలకు దారితీయవచ్చు.

నిర్ధారణ... ఛాతీ ఎక్స్-రే, ఈసోఫేగ్రామ్, అప్పర్ ఎండోస్కోపీ, ఈసోఫేజియల్ మానోమెట్రీ వంటి పరీక్షలతో నిర్ధారణ చేస్తారు.

చికిత్స... హయటస్ హెర్నియాలో వెంటనే చికిత్స ఉండకపోవచ్చు. ఎందుకంటే చాలా సందర్భాల్లో ఎలాంటి లక్షణాలూ చూపకుండానే తనంతట తానే తగ్గిపోవచ్చు. అయితే యాసిడ్ పైకి చిమ్మకుండా ఉండేందుకు కడుపులోని యాసిడ్ ప్రభావాన్ని తగ్గించేందుకు కొన్ని మందులు వాడుతుంటారు. ఈ సమస్య తగ్గించడానికి యాంటాసిడ్, ప్రోటాన్ పంప్ ఇన్హిబిటర్స్ వంటి మందులు వాడతారు. దాంతోపాటు కడుపులో నొప్పి వచ్చినప్పుడు డాక్టర్లు నొప్పినివారణ మందులూ ఇస్తుంటారు. కొందరిలో చాలా అరుదుగా కొన్నిసార్లు హెర్నియా రిపేర్ సర్జరీ వంటి శస్త్రచికిత్స అవసరం పడుతుంది. ఇక కొందరిలో కడుపుకూ, ఈసోఫేగస్ జంక్షన్‌కు మధ్య బిగుతును పెంచడానికి 'ఫండాప్లికేషన్' అనే శస్త్రచికిత్స అవసరం పడవచ్చు.

• విజ్‌డమ్ టూత్

జ్ఞానదంతాలు... సమస్యలు!

జ్ఞానం వచ్చాక జ్ఞాన దంతాలు వస్తాయి. సాధారణంగా 17 నుంచి 25 ఏళ్ల వయసులో బాగా పెద్దయ్యాక ఇవి వస్తాయి కాబట్టే వీటిని 'జ్ఞానదంతాలు' అంటారు. మిగతావి చిన్నప్పుడే తమ తమ స్థానాలకు పరిమితమవ్వడంతో పెద్దగా సమస్యలుండవు. కానీ ఆలస్యంగా రావడం వల్ల జ్ఞానదంతాలకు పలువరసలో తగినంత స్థలం లేకపోవడంతో కొన్ని రకాల ఇబ్బందులు తెచ్చిపెట్టే అవకాశాలుంటాయి. వాటిపై అవగాహన కోసం ఈ కథనం.



మన దవడ భాగంలో చివరన ఆహారాన్ని నమలడానికి పెద్ద దంతాలు మూడు వస్తాయి. ఆ వరసలో చివరగా వచ్చేవే జ్ఞానదంతాలు. ఆటంకాలేవీ లేకుండా వస్తే వెనక దంతాలు నమలడానికి ఎలా ఉపయోగపడతాయో, జ్ఞానదంతాలూ అదే పని చేస్తాయి.

జ్ఞానదంతాలతో వచ్చే కొన్ని సమస్యలివి...
- చిగురును చీల్చుకురావడంతో నొప్పి, వాపు, ఆ భాగం ఎర్రబారడం.
- కొన్నిసార్లు చిగుర్ల నుంచి చీము స్రవించడం.
- మెడ వద్ద ఉండే లింఫ్ గ్రంథుల వాపు, కొన్నిసార్లు జ్వరం
- చిగుర్లలో నొప్పి, వాపు, మంట వంటి కారణాలతో ఆహారం మింగడంలో ఇబ్బందులు.

ఎందుకీ సమస్యలు... చిగుర్ల మీద జ్ఞానదంతం మొలవడానికి తగినంత స్థలం ఉండి, అది సాఫీగా పైకి వచ్చి, మిగతా దంతాల వరసలో కుదురుగా ఉంటే (అలైన్‌మెంట్‌లో ఉంటే) జ్ఞానదంతాలతో ఇబ్బంది ఉండదు. అయితే అప్పటికే మిగతా దంతాలన్నీ రావడంతో జ్ఞానదంతానికి తగినంత స్థలం ఉండకపోతే... అది సరిగా మొలవడానికి ఆస్కారం ఉండకపోవచ్చు. దాంతో అవి కాస్త అటు ఇటుగా మొలవచ్చు. ఇలా సమస్య కలిగిస్తూ రావడాన్ని 'ఇంపాక్షన్' అంటారు.

చక్కగా రాకపోతే... జ్ఞానదంతం సక్రమంగా రాకుండా, దిశమార్చుకుని వచ్చినప్పుడు కొన్ని సమస్యలు కనిపిస్తాయి. అవి...
- పలువరస చక్కగా లేకపోవడం వల్ల పళ్లు తోముకోవడం, నోరు శుభ్రం చేసుకోవడం చక్కగా జరగక పన్ను పుచ్చిపోవడం, పంటిలో రంధ్రం, చిగురుకు నొప్పి రావడం, పుండు పడటం వంటివి జరగవచ్చు.
- జ్ఞానదంతం నిలువుగా రాకుండా మిగతా వాటిని నొక్కుకుంటూ వస్తే... అప్పుడు మిగతా దంతాలూ అడ్డదిడ్డంగా మారవచ్చు. దీన్నే క్రౌడింగ్ అంటారు.
- జ్ఞానదంతం చిగురును ఒరుసుకుంటూ, కోసుకుంటూ వచ్చినప్పుడు ఒక్కోసారి చిగుర్ల వ్యాధికి దారితీసే అవకాశముంది.

జ్ఞానదంతాన్ని తొలగించాల్సినదెప్పుడంటే... సాధారణంగా సమస్యాత్మకమైన జ్ఞానదంతాలను తొలగిస్తుంటారుగానీ... ప్రతిసారీ ఇలా తొలగించాల్సిన అవసరం ఉండకపోవచ్చు. అయితే ...
- జ్ఞానదంతం పూర్తిగా దవడ నుంచి బయటకు రాకుండా, కొద్దిగా మాత్రమే బయటకు వచ్చినప్పుడూ; నమలడానికీ, నోటి ఆరోగ్యానికీ ఇబ్బందిగా మారినప్పుడు; అడ్డదిడ్డంగా పెరుగుతూ బయటికి వస్తూ మిగతా పలువరసను దెబ్బతీస్తున్నప్పుడు; అడ్డదిడ్డంగా పెరిగే క్రమంలో పక్కనున్న పంటి వేరు (రూట్)ను దెబ్బతీస్తున్నప్పుడు; అడ్డదిడ్డంగా పెరుగుతూ 'ఇన్‌ఫీరియర్ ఆల్వియోలార్ నర్వ్' అనే నరాన్ని దెబ్బతీస్తున్నప్పుడు, ఆ నరంపై ఒత్తిడి వల్ల ఒక్కోసారి పెరాలసిస్‌కు దారితీసే అవకాశమున్నప్పుడు; అది చక్కగా రాకపోవడం వల్ల చిగుర్లపై చీము పేరుకుపోయి చిగుర్ల కణజాలానికీ, దవడ ఎముకకూ నష్టం చేస్తున్నప్పుడు చిన్న శస్త్రచికిత్స సాయంతో దంత వైద్యులు జ్ఞానదంతాన్ని తొలగిస్తుంటారు.


ఇలాంటి సందర్భాల్లో మినహా... అది సక్రమంగా వస్తూ, దవడ చిగుర్లలో ఇరుక్కుపోతే, చిగురు పైభాగాన్ని కాస్త తొలగించి, దానికి తగిన దారి కల్పించి, మామూలుగా అది వచ్చేందుకు దోహదపడ్డప్పుడు జ్ఞానదంతాన్ని తొలగించాల్సిన అవసరం ఉండదు. కొన్నిసందర్భాల్లో జ్ఞానదంతం అంకురాన్ని (బడ్ ఆఫ్ విజ్‌డమ్ టూత్‌ను) ఉపయోగించి, దంతం రాని చోట వచ్చేలా చేసేందుకు ఆస్కారం ఉంది. కాబట్టి ప్రతిసారీ జ్ఞానదంతాల్ని తొలగించాల్సిందే అనేభావన సరికాదు.



డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి,
సీనియర్ డెంటల్ సర్జన్

మెడి టిప్

జుట్టు చివర్లు చిట్లుతుంటే?



ఈ రోజుల్లో యువతులు, వర్కింగ్ ఉమన్ మాత్రమే కాకుండా గృహిణులూ ఎండలో బైక్‌పైన కాలుష్యంలో తిరగక తప్పని పరిస్థితి. హెల్మెట్ వాడినప్పటికీ జుట్టు చాలావరకు బయటే ఉంటుంది. దాంతో దుమ్ముకూ, ధూళికీ, ఎండకూ, కాలుష్యానికి ఎక్స్‌పోజ్ అయ్యే వెంట్రుకల చివరలు చిట్లడం మామూలే. కొన్ని జాగ్రత్తలతో జుట్టు చిట్లే అనర్థాలను తప్పించుకోవచ్చు. అవి...
- తలస్నానం వారానికి రెండు రోజులు బెటర్. అయితే మాడు మీద మరీ ఎక్కువగా దురద వస్తుంటే మాత్రం వారంలో నాలుగుసార్లు తలస్నానం చేయవచ్చు. ఇందుకు మైల్డ్ షాంపూలు మాత్రమే వాడాలి
- టూవీలర్ నడిపే సమయాల్లో వెంట్రుకలన్నీ కప్పి ఉంచేలా స్కార్ఫ్ చుట్టుకోవడం మేలు
- డాక్టర్ సలహా లేకుండా ఎలాంటి మెడికేటెడ్ షాంపూలూగానీ, బ్యూటీ ఉత్పాదనలుగానీ వాడకపోవడమే మంచిది
- తలస్నానం తర్వాత జుట్టు పూర్తిగా ఆరకముందే ఆలివ్ ఆయిల్, ఆల్మండ్ ఆయిల్, జోజోబా ఆయిల్... వంటి ఇన్‌గ్రేడియెంట్స్ ఉండే హెయిర్ సీరమ్ వాడటం ద్వారా జుట్టుకు జరిగే నష్టాన్ని చాలావరకు నివారించవచ్చు
- ఈ జాగ్రత్తలు పాటించాక కూడా జుట్టు చివర్లు చిట్లడం ఆగకపోతే ఒకసారి డెర్మటాలజిస్ట్/ట్రైకాలజిస్ట్‌లను సంప్రదించడం మంచిది.


'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00 సంపుటి: 16 సంచిక: 307

SUNDAY Special ఆదివారం 28-1-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'గ్రాండ్'సలామ్ బోపన్న

ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల డబుల్స్‌లో భారత టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న టైటిల్ సాధించాడు. తద్వారా పురుషుల టెన్నిస్‌లో గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గిన అతి పెద్ద వయస్కుడిగా నిలిచాడు.

- వివరాలు 10లో



రచయిత్రికి రూ.692 కోట్లు చెల్లించండి

రచయిత్రి ఇ.జీన్ కరోల్‌కు పరువు నష్టం కలిగించినందుకు జరిమానాగా ఆమెకు దాదాపు రూ.692 కోట్లు చెల్లించాలని డొనాల్డ్ ట్రంప్‌ను అమెరికా కోర్టు ఆదేశించింది.

- వివరాలు 6లో





విశాఖపట్నం జిల్లా భీమిలి నియోజకవర్గం తగరపు వలస జంక్షన్ వద్ద శనివారం జరిగిన బహిరంగ సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం. సభలో సమర శంఖం పూరిస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

త్వరలోనే కుల గణన

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగియగానే ప్రక్రియ షురూ: సీఎం రేవంత్‌రెడ్డి

- కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం
- క్షేత్రస్థాయిలో ఒకేచోటికి ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల విద్యాసంస్థలు
- ఇందుకోసం నియోజకవర్గానికో ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్
- వేగంగా స్థలాల సేకరణ, భవనాల నిర్మాణం... గ్రీన్ చానల్ ద్వారా నేరుగా డైట్, కాస్మెటిక్ చార్జీల చెల్లింపు
- మరింత ఎక్కువ మందికి విదేశీ విద్య పథకం వర్తింపు...
- విదేశీ వర్సిటీల ర్యాంకింగ్స్ ఆధారంగా పథకం అమలు
- బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖలపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష
- ఫిబ్రవరి 9 లేదా 14 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో త్వరలోనే కుల గణన చేపడతామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీనిపై ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీకి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. కులగణనకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శనివారం సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమ శాఖలపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. బిహార్ ప్రభుత్వం ఆ రాష్ట్రంలో ఇప్పటికే కుల గణన నిర్వహించి ఫలితాలను ప్రకటించిందని.. కర్ణాటకలో కాంగ్రెస్ సర్కారు కుల గణన చేపట్టిందని, ఫలితాలను ప్రకటించాల్సి ఉందని సమావేశంలో సీఎం రేవంత్ వివరించారు. ఈ క్రమంలో రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు ముగిశాక కుల గణన ప్రక్రియను ప్రారంభించేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. కులాల వారీగా

మిగతా 2వ పేజీలో ▶

ఆడపిల్లల వివాహాలకు తులం బంగారం

కల్యాణమస్తు, షాదీ ముబారక్ లబ్ధిదారులకు నగదుతో పాటు తులం బంగారం అందించడం కోసం.. అంచనా బడ్జెట్‌ను రూపొందించాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో ఇప్పుడున్న బీసీ స్టడీ సర్కిళ్లను ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం యూనిట్‌గా ఏర్పాటు చేసే అంశంపై అధ్యయనం చేయాలని సూచించారు.

యుద్ధానికి సిద్ధం

అబద్ధానికి, నిజానికి.. మోసానికి, విశ్వసనీయతకు మధ్య సంగ్రామమిది

భీమిలి వేదికగా ఎన్నికల శంఖం పూరించిన సీఎం వైఎస్ జగన్

ఎన్నికల కురుక్షేత్రంలో అభిమన్యుడిని కాదని.. అర్జునుడినని వెల్లడి

- సంక్షేమాభివృద్ధి పథకాలే మన బాణాలు... ఒంటరిగా పోటీ చేసే ధైర్యం బాబుకు లేదు
- మోసాన్ని నమ్ముకోలేదు.. అభివృద్ధిని నమ్ముకొనే ఎన్నికలకు వెళుతున్నాం
- మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశాం
- రాష్ట్రంలో ఎక్కడ చూసినా స్పష్టంగా వైఎస్సార్‌సీపీ, జగన్ మార్క్
- 14 ఏళ్ల పాలనలో చంద్రబాబు మార్క్ ఎక్కడుందని నిలదీత
- నాణ్యమైన విద్య, వైద్యం, 1న పింఛన్, రైతులకు భరోసా.. ఇవన్నీ ఉండాలంటే మన ప్రభుత్వం రావాల్సిందే... ప్రతి ఇంటికీ వెళ్లి జరిగిన మంచిని వివరించాలని పిలుపు

3లో

'కౌలు'కు ఏపీ తరహా చట్టం

ధరణి కమిటీకి వ్యవసాయశాఖ సూచన

- ఏపీలోని పంటసాగు హక్కుల చట్టం–2019 తరహాలోనే తెలంగాణలోనూ కొత్త చట్టం తీసుకొస్తే కౌలు రైతులకు 'రైతు భరోసా' పథకం వర్తింపచేయవచ్చని ధరణి పోర్టల్ పునర్నిర్మాణ కమిటీకి వ్యవసాయశాఖ ప్రతిపాదించింది.

- వివరాలు 3లో

ఫిబ్రవరి నుంచి పంచాయతీల్లో

'ప్రత్యేక పాలన'

- ఫిబ్రవరి నుంచి పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కాగా సర్పంచ్‌ల పదవీకాలం ముగియడానికి ముందే ఎన్నికల ప్రక్రియ పూర్తిచేసి కొత్త సర్పంచ్‌లను ఎన్నుకునే అవకాశం ప్రస్తుతానికి లేదు. దీంతో జీపీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

- వివరాలు 11లో

కాళేశ్వరంపై కేంద్ర, రాష్ట్ర నిపుణులతో కమిటీ

నీటిపారుదల శాఖపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

- కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నాణ్యతపై కేంద్ర జలసంఘం, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, రాష్ట్రంలోని నీటిపారుదల రంగ నిపుణులతో కమిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నిర్ణయించారు.

- 2లో

మళ్లీ అసైన్డ్ చర్చ

20 ఏళ్లు దాటిన వారికి శాశ్వత హక్కులు కల్పించాలనే డిమాండ్ తెరపైకి

- ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన కాంగ్రెస్.. 18 లక్షల మంది పేదల ఎదురుచూపులు
- రాష్ట్రంలో 23 లక్షల ఎకరాలకుపైగా అసైన్డ్ భూములు
- ఏపీతో సహా దక్షిణాదిలోని పలు రాష్ట్రాల్లో ఇప్పటికే అసైన్డ్ భూములపై హక్కుల కల్పన
- ప్రత్యామ్నాయాలున్నా హక్కుల కల్పన అవకాశాలనే పరిశీలిస్తోన్న కాంగ్రెస్ సర్కార్
- రానున్న బడ్జెట్ సమావేశాల్లో బిల్లు పెడతారా? లేక పార్లమెంటు ఎన్నికల తర్వాతా..?



సాక్షి, హైదరాబాద్: అసైన్డ్ భూములకు హక్కుల కల్పన అంశం మరోమారు తెరపైకి వచ్చింది. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ హామీ ఇచ్చిన నేపథ్యంలో వీలైనంత త్వరగా అసైన్డ్ భూములపై లబ్ధిదారులకు శాశ్వత హక్కులు కల్పించాలనే డిమాండ్ ఊపందుకుంటోంది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు దక్షిణాది రాష్ట్రాల్లో అసైన్డ్ భూములను తిరిగి అమ్ముకునే హక్కులు కల్పించడంతో తమకు ఇలాంటి హక్కులు ఎప్పుడు వస్తాయోనని రాష్ట్రంలోని 18 లక్షల మందికి పైగా రైతు కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి. అయితే, ఇందుకోసం భూబదలాయింపు చట్టం (పీవోటీ–1977)కు సవరణ చేయాల్సి ఉండటంతో రానున్న బడ్జెట్ సమావేశాల్లో ఈ సవరణ బిల్లును ప్రవేశపెట్టాలనే డిమాండ్ పెరుగుతోంది. అయితే, ఈ సమావేశాల్లో ప్రభుత్వం బిల్లు పెట్టి హక్కులు కల్పిస్తుందా? లేదా భవిష్యత్తులో ఎలాంటి సమస్యలూ రాకుండా అన్ని రకాలుగా అధ్యయనం చేసేందుకు కమిటీ ఏర్పాటు చేసి పార్లమెంటు ఎన్నికల తర్వాత నిర్ణయం తీసుకుంటుందా అన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

ఏమిటీ అసైన్డ్ భూములు?

భూమి లేని నిరుపేదలకు ఆర్థిక భద్రత కల్పించడంతోపాటు భూమి అనుభవదారులుగా సామాజిక గుర్తింపు ఇవ్వాలనే ఉద్దేశంతో దశాబ్దాలుగా భూమి లేని పేదలకు పంపిణీ చేసే ప్రభుత్వ భూములనే అసైన్డ్ భూములంటారు. ఈ భూములు అన్యాక్రాంతం కాకూడదనే ఉద్దేశంతో 1977లో అసైన్‌మెంట్

మిగతా 5వ పేజీలో ▶

వీసీల నియామకానికి

దరఖాస్తుల ఆహ్వానం

వివిధ సెట్‌లకు కన్వీనర్ల నియామకం

- వివరాలు 12లో



ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థులు

- బీజేపీ గెలుపునకు కాంగ్రెస్ పరోక్ష సహకారం
- మైనారిటీలపై రేవంత్ ప్రతీకారం... మంత్రివర్గంలో మైనారిటీలకు చోటు లేకుండా చేశారు: కేటీఆర్
- ఆటోలో బీఆర్ఎస్ భవన్‌కు వచ్చిన కేటీఆర్

- వివరాలు 2లో

ఇలా రాజీనామా.. అలా ప్రమాణం!




నేడు ఎన్డీఏ కూటమిలోకి నితీశ్

క్లైమాక్స్‌కు చేరిన బిహార్ రాజకీయ సంక్షోభం

- ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలతో కూడిన మహాఘట్‌బంధన్ సంకీర్ణ సర్కారుకు జేడీ(యూ) సారథి, సీఎం నితీశ్‌కుమార్ గుడ్‌బై చెప్పడం, మళ్లీ బీజేపీతో దోస్తీ కట్టి ఎన్డీఏ కూటమిలో చేరడం ఖాయమైనట్టు కనిపిస్తోంది. ఆదివారం ఉదయం ఆయన రాజీనామా చేసి.. సాయంత్రం సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తారని సమాచారం.

- వివరాలు 6లో

ఇదండీ సంగతి



భవిష్యత్తులో ఇంకా ఇంకా పెద్ద మనసు చేసుకోవాలి సార్.. అన్నీ వదిలేయడానికి!!

అక్కడో రీతి... ఇక్కడో తీరు

ఉత్తర, దక్షిణాది విద్యార్థుల్లో భిన్న ధోరణులు



- దక్షిణాదిన నైపుణ్యం పెంపు అనివార్యం... ఉత్తరాదిన పాలనపై పట్టు అవసరం
- విద్యా ప్రణాళికల్లో సరికొత్త మార్పులు... యూజీసీ, ఉన్నత విద్యా మండలి అధ్యయనం

సాక్షి, హైదరాబాద్: విద్యావిధానంలో ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య భిన్నమైన ధోరణుల నేపథ్యంలో ఆ రెండు ప్రాంతాల మానవ వనరుల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించే దిశగా అడుగులు పడుతున్నాయి. ఇందుకు పాఠ్య ప్రణాళికలు అవసరమని ఉన్నత విద్యా మండలి, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ భావిస్తున్నాయి. ఈ మేరకు జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలతో భిన్న కోర్సులను రూపొందించేందుకు కసరత్తు చేపట్టాయి. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోని యూనివర్సిటీలతో కలిసి మానవ వనరుల అభివృద్ధికి కార్యాచరణను తీర్చిదిద్దేందుకు సన్నాహాలు చేస్తున్నాయి.

ఇక్కడ టెకీలు, సాఫ్ట్‌వేర్‌లు.. అక్కడ సివిల్స్ టార్గెట్ వయా డిగ్రీలు

దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిల్లో విద్యార్థులు ఒకే విధమైన కోర్సుల్లో చేరుతున్నారు. ముఖ్యంగా బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ (బీటెక్)ను, ఎంబీఏ, ఎంసీఏను ఎంచుకుంటున్నారు. ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, పంజాబ్ సహా ఉత్తరాది రాష్ట్రాల్లో విద్యార్థులు ఎక్కువగా సంప్రదాయ డిగ్రీ కోర్సుల్లో చేరుతున్నారు. ఆ తర్వాత వాళ్ళు పోటీ పరీక్షల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ కారణంగానే సివిల్స్ వంటి పోటీ పరీక్షలకు శిక్షణ కేంద్రాలు ఉత్తరాదిలోనే ఎక్కువ ఉంటున్నాయని తేలింది.

సగానికి పైగా ఇంజనీరింగ్ సీట్లు దక్షిణాదికే

దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులు బీటెక్ తర్వాత తక్షణ ఉపాధి అవకాశాలు కోరుకుంటున్నారు. సాఫ్ట్‌వేర్ లేదా ఇతర సాంకేతిక ఉపాధి

మిగతా 12వ పేజీలో ▶

ఫిబ్రవరి 1న ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఫిబ్రవరి ఒకటో తేదీన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సమక్షంలో గజ్వేల్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తారు. రాష్ట్ర శాసనసభకు గత ఏడాది నవంబర్‌లో ఎన్నికలు జరగ్గా డిసెంబర్ 3న ఫలితాలు వెలువడ్డాయి. డిసెంబర్ 9న అసెంబ్లీ ప్రొటెమ్ స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొత్తగా ఎన్నికైన వారిలో చాలా మంది ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే డిసెంబర్ 8న ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో బాత్‌రూంలో కేసీఆర్ జారి పడగా తుంటి ఎముకకు గాయమైంది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కేసీఆర్‌కు శస్త్ర చికిత్స జరిగింది. నాటి నుంచి కేసీఆర్ వైద్యుల సూచన మేరకు విశ్రాంతి తీసుకుంటూ కోలుకుంటున్నారు. త్వరలో రాష్ట్ర రాజకీయాల్లో తిరిగి క్రియాశీలం కాబోతున్న కేసీఆర్ ఫిబ్రవరి 1న గజ్వేల్ ఎమ్మెల్యేగా ప్రమాణం స్వీకారం చేస్తారు. ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం నేపథ్యంలో పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీకి తరలిరానుండటంతో అసెంబ్లీ వర్గాలు భద్రతా ఏర్పాట్లపై దృష్టి సారించాయి.

లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ ఇన్‌చార్జులు, సహ ఇన్‌చార్జులు

కర్ణాటక, తమిళనాడు సహ ఇన్‌చార్జిగా పొంగులేటి

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల కోసం 23 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు బీజేపీ ఇన్‌చార్జిలు, సహ ఇన్‌చార్జిలను నియమించింది. అండమాన్ నికోబార్‌కు ఇన్‌చార్జిగా సత్యకుమార్‌ను, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల సహ ఇన్‌చార్జిగా పొంగులేటి సుధాకర్ రెడ్డిలను బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నియమించారు. ఈ మేరకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జమ్మూ కశ్మీర్, లద్దాక్‌లకు ఇన్‌చార్జిగా తరుణ్ ఛుగ్, లక్షద్వీప్, తమిళనాడులకు ఇన్‌చార్జిగా అరవింద్ మీనన్, ఉత్తర్‌ప్రదేశ్ ఇన్‌చార్జిగా బైజయంత్ పాండా, బిహార్ ఇన్‌చార్జిగా వినోద్ తావ్డేలను నియమించారు.

ప్రజలే రేవంత్ నాలుక చీరేస్తారు

బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ వయసుకు కూడా గౌరవం ఇవ్వకుండా సీఎం రేవంత్‌రెడ్డి అసభ్యంగా మాట్లాడుతున్నాడని, ఆయన భాష ఇదే తరహాలో కొనసాగితే తెలంగాణ ప్రజలు నాలుక చీరేస్తారని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ హెచ్చరించారు. పార్టీ నేతలు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డితో కలిసి తెలంగాణ భవన్‌లో శనివారం దాసోజు విలేకరులతో మాట్లాడారు. శాశ్వతం కాని అధికారం కోసం రేవంత్‌రెడ్డి అహంకారాన్ని నరనరాన ఎక్కించుకున్నాడని విమర్శించారు. రేవంత్ వైఖరి గల్లీ లీడర్ కంటే అధ్వానంగా ఉందని ఎద్దేవా చేశారు. ఆయన తీరును రాహుల్ గాంధీ అయినా మార్చాలని సూచించారు. తెలంగాణను సాధించినందుకు, తెచ్చిన రాష్ట్రాన్ని అభివృద్ధి చేసినందుకు కేసీఆర్‌కు ఘోరీ కడతావా? అని ప్రశ్నించారు. ప్రధాని మోదీతో సీఎం భేటీ జరిగినప్పటి నుంచి కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు బయట పడుతున్నాయని చెప్పారు. మోదీతో రేవంత్‌కు ఉన్న బంధమేంటో కాంగ్రెస్ అధిష్టానం బయట పెట్టాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నోటిఫికేషన్, గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎన్నిక, ఆదానీతో ఒప్పందం, తెలంగాణకు ఐపీఎస్‌ల కేటాయింపు వంటి అంశాలు రేవంత్, మోదీ బంధాన్ని రుజువు చేస్తున్నాయని గుర్తు చేశారు. సీఎంకు చేతనైతే కృష్ణా నదీ యాజమాన్య బోర్డు విషయంలో కేంద్రం మెడలు వంచేందుకు కృషి చేయాలని దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు.

యువతలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువలు పెరగాలి

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.ప్రియదర్శిని

హైదరాబాద్: నేటితరం యువతలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువలను పెంపొందించడానికి హరేకృష్ణ మూమెంట్ పనిచేయడం అభినందనీయమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.ప్రియదర్శిని అన్నారు. శనివారం రవీంద్రభారతిలో హరేకృష్ణ మూమెంట్ సాంస్కృతికోత్సవం 'హెరిటేజ్ ఫెస్ట్' వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హెరిటేజ్ ఫెస్ట్ సాంస్కృతిక పోటీలు సనాతనమైన మన భారతీయ వారసత్వం, సాంస్కృతిక వైవిధ్యం, ఆధ్యాత్మిక విలువలను అందిస్తుందని తెలిపారు. హరేకృష్ణ మూమెంట్, అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రాంతీయ అధ్యక్షుడు సత్యగౌర చంద్ర దాస ప్రభుజీ మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో వివిధ వేదికలపై నిర్వహించిన వేడుకలలో 20 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. అనంతరం సుమేదస పేరిట నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కాళేశ్వరంపై కమిటీ!

కేంద్ర, రాష్ట్ర నిపుణులతో ఏర్పాటు చేయాలని ప్రభుత్వ నిర్ణయం

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై లోతుగా అధ్యయనం

- నీటిపారుదల శాఖపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- కమిటీ నివేదిక తర్వాతే పునరుద్ధరణ చర్యలు
- రూ.లక్షన్నర కోట్ల ప్రాజెక్టు మరమ్మతులకు రూ.10వేల కోట్లు పెట్టేందుకు వెనుకాడం
- ప్రజాప్రయోజనాల విషయంలో రాజీపడబోం
- కృష్ణా జలాలు, ప్రాజెక్టుల అప్పగింత వ్యవహారంపై త్వరలో అఖిలపక్ష సమావేశం
- గత సర్కారు హయాంలో జరిగిన సమావేశాలు, నిర్ణయాలపై సమగ్ర నివేదిక
- తక్కువ ఖర్చు, సమయంలో ఎక్కువ ఆయకట్టుకు నీళ్లు ఇచ్చే ప్రాజెక్టుల పూర్తికి ప్రాధాన్యమని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నాణ్యతపై కేంద్ర జలసంఘం, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, రాష్ట్రంలోని నీటిపారుదల రంగ నిపుణులతో కమిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. బ్యారేజీల పటిష్టత, కుంగిపోయిన పిల్లర్ల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలపై సమగ్ర అధ్యయనం చేయించాలని అధికారులను ఆదేశించారు. ఆ కమిటీ నివేదిక ఆధారంగానే ముందుకు వెళ్లాలని.. తొందరపాటుతో హడావుడి చేసి మరోసారి తప్పులకు తావివ్వవద్దని స్పష్టం చేశారు. సాంకేతికంగా అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకున్నాకే మరమ్మతులు, పునరుద్ధరణ చర్యలపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. శనివారం సచివాలయంలో నీటిపారుదల శాఖపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. కాళేశ్వరం నిర్మాణంపై వెంటనే కమిటీ ఏర్పాటు చేసి, రెండు మూడు రోజుల్లోనే సమావేశం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మేడిగడ్డ వద్ద కుంగిన పియర్లకు మరమ్మతులు చేస్తే సరిపోతుందా? లేక దెబ్బతిన్న పియర్లన్నింటినీ తొలగించి కొత్తగా కట్టాలా? కొన్నింటికి మరమ్మతులు చేసి, మిగతా వాటిని పునర్నిర్మించాలా? అనే అంశాలపై లోతుగా అధ్యయనం చేయించాలన్నారు. గతంలో అధికారంలో ఉన్నవారు చేసిన తప్పులతో తెలంగాణకు భారీ నష్టం వాటిల్లిందని చెప్పారు. సుమారు రూ.లక్షన్నర కోట్లతో చేపట్టిన ఈ భారీ ప్రాజెక్టుకు మరమ్మతుల కోసం అవసరమైతే మరో రూ.పదివేల కోట్లయినా ఖర్చు పెట్టేందుకు ఆలోచించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల విషయంలో రాజీ పడబోమన్నారు.



సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్

ఆరోపణలొస్తే మీరేం చేస్తున్నారు?

నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను కృష్ణాబోర్డుకు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించినట్టుగా వస్తున్న ఆరోపణలు, ప్రచారంపైనా భేటీలో చర్చించారు. బోర్డుకు ఏ ప్రాజెక్టునూ అప్పగించలేదని, ఎలాంటి ఒప్పందాలపై సంతకాలు చేయలేదని అధికారులు సీఎంకు వివరణ ఇచ్చారు. ఈ క్రమంలో సీఎం తీవ్రంగా స్పందించారు. ''కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 45 రోజులే అయింది. ఈ కొద్దిరోజుల్లోనే ఎప్పుడు కృష్ణాబోర్డుతో మీటింగ్‌లు జరిగాయి? ఎవరు హాజరయ్యారు? ఏమేం నిర్ణయాలు తీసుకున్నారు? మాకు తెలియకుండా అధికారులే ఏమైనా నిర్ణయాలు తీసుకున్నారా? శాఖాపరంగా ప్రభుత్వంపై ఆరోపణలు ఇష్టం వచ్చినట్టు ఆరోపణలు వస్తుంటే మీరేం చేస్తున్నారు?'' అని నీటిపారుదల శాఖ అధికారులను నిలదీశారు. రాయలసీమకు ఎన్ని నీళ్లు పోతున్నాయో, వాటాకు మించి నీటిని తోడుకుపోతుంటే పదేళ్లుగా అధికారంలో ఉన్న ప్రభుత్వం ఏం చేసిందో అఖిలపక్ష భేటీలో చర్చకుపెడదామన్నారు.

కృష్ణాజలాలపై త్వరలో అఖిలపక్షం

కృష్ణా నది జలాల్లో రాష్ట్ర వాటా, కృష్ణాబేసిన్‌లోని ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై త్వరలోనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు కృష్ణాజలాలకు సంబంధించి జరిగిన సమావేశాలు, కేఆర్ఎంబీ ఎజెండాలు, చర్చల వివరాలు, మినిట్స్, నిర్ణయాలు, ఒప్పందాలన్నింటిపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని నీటిపారుదల శాఖ అధికారులకు సూచించారు. వీటన్నింటిపై అఖిలపక్ష సమావేశంలో చర్చిద్దామన్నారు. కృష్ణా జలాల్లో ఉమ్మడి ఏపీకి ఉన్న 811 టీఎంసీల వాటాలో.. ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీల కేటాయింపులకు ఎందుకు ఒప్పుకున్నారు? అప్పుడేం చర్చలు జరిగాయి? ఏమేం నిర్ణయాలు జరిగాయన్న అంశాలపైనా అఖిలపక్ష భేటీలో చర్చించాలని.. వాటన్నింటినీ ప్రజల ముందు పెట్టాలని నిర్ణయించారు. తెలంగాణ ప్రజలకు మంచి జరిగే సలహాలు, సూచనలను తప్పకుండా స్వీకరిస్తామన్నారు.

మండలాల వారీగా ఆయకట్టు తేల్చండి

ప్రాజెక్టులవారీగా ఆయకట్టు వివరాలలో గందరగోళం ఉందని.. గ్రామాలు, మండలాల వారీగా ప్రాజెక్టుల ఆయకట్టు వివరాలను సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ప్రాజెక్టులను గుర్తించి త్వరగా నీరందించే చర్యలు చేపట్టాలన్నారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిపై ఆరా తీశారు. కల్వకుర్తి ప్రాజెక్టుకు భూసేకరణ ఎందుకు ముందుకు సాగడం లేదని ప్రశ్నించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను మొదటి ప్రాధాన్యతగా తీసుకొని పూర్తి చేయాలని సూచించారు. ప్రాధాన్యతల వారీగా పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. నారాయణపేట – కొడంగల్ లిఫ్టుతోపాటు మహబూబ్‌నగర్ జిల్లాలో కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయిల్‌సాగర్ వంటి తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా చిన్న, మధ్యతరహా ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఎమ్మెల్సీలుగా కోదండరాం, ఆమేర్ అలీఖాన్

గవర్నర్ తమిళిసై ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరామారెడ్డి (కోదండరాం), ఆమేర్ అలీఖాన్‌లను నియమిస్తూ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా గతంలో నియమితులైన డి.రాజేశ్వర్‌రావు, ఫారూక్ హుస్సేన్‌ల పదవీకాలం 2023 ఏప్రిల్ 27తో ముగిసిపోగా, అప్పటి నుంచి ఈ రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ రెండు స్థానాల్లో దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్ర సత్యనారాయణలను నియమించాలని ప్రతిపాదించగా, నిబంధనల ప్రకారం వీరికి అర్హతలు లేవని గవర్నర్ తమిళిసై అప్పట్లో తిరస్కరించారు. ఈ అభ్యర్థులిద్దరూ రాజకీయాలతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉన్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు. కాగా, కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కోదండరామారెడ్డి, ఆమేర్ అలీఖాన్‌ల పేర్లను ప్రతిపాదించగా, గవర్నర్ తమిళిసై సత్వరమే ఆమోదించారు. తెలంగాణ ఉద్యమంలో టీజేఏసీ చైర్మన్‌గా ప్రొఫెసర్ కోదండరాం కీలక పాత్ర పోషించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఆయన తెలంగాణ జన సమితి (టీజేఎస్) పేరుతో పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే. ఇక ఆమేర్ అలీఖాన్ ఉర్దూ దినపత్రిక సియాసత్‌కి న్యూస్ ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు.



సీఎం రేవంత్‌ను కలిసి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్సీలు కోదండరాం, ఆమేర్ అలీఖాన్

మొండి చేయి 'గ్యారంటీ'

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శ

- పార్లమెంట్ ఎన్నికల తర్వాత అమలు అనుమానమే
- చేవెళ్ల 'పార్లమెంట్'ఎన్నికల సన్నాహక సమావేశంలో కేడర్‌కు దిశానిర్దేశం

గచ్చిబౌలి (హైదరాబాద్): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయలేదని, పార్లమెంట్ ఎన్నికల అనంతరం మొండి చెయ్యి చూపడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్‌లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి బీజేపీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని బీజేపీ అభ్యర్థులకు దాదాపు మూడున్నర లక్షల ఓట్లు వచ్చాయని, పార్టీకి ఓట్ల శాతం గణనీయంగా పెరిగిందని వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే బూడిదలో పోసిన పన్నీరుగా మారుతుందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి విజన్, కార్యాచరణ లేదని, ఇచ్చిన హామీలు అమలు చేయలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలోనే ప్రతి నెలా ఒకటో తారీఖున ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉంటే ఇప్పుడు అదనంగా ఆరు గ్యారంటీలు చెప్పిన కాంగ్రెస్ వాటిని ఎలా అమలు చేస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ను అడుగడుగునా ఎదుర్కోవాలని, బీజేపీకి ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీయే అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పార్టీ కేడర్‌కు దిశా నిర్దేశం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ బూత్‌స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలలో తక్కువ ఓట్లు వచ్చిన బూత్‌లపై సమీక్ష చేసుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ మల్లారెడ్డి, ఇన్‌చార్జి ఏవీఎన్ రెడ్డి, నాయకులు వీరేందర్‌గౌడ్, సునీతారెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

త్వరలోనే కుల గణన

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర జనాభా వివరాలు తెలిస్తే.. రిజర్వేషన్లతోపాటు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమల్లో కచ్చితమైన నిర్ణయాలు తీసుకోవడానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

గ్రీన్‌చానల్ ద్వారా డైట్ చార్జీలు..

ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు ఇచ్చే డైట్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలు, వంట బిల్లులు పెండింగ్‌లో ఉండకుండా చూడాలని.. వీటికి గ్రీన్ చానల్ ద్వారా చెల్లింపులు చేయాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకాన్ని మరింత సమర్థంగా అమలు చేయాలని.. ఇప్పుడున్న దానికంటే ఎక్కువ మంది అర్హులైన విద్యార్థులకు మేలు జరిగేలా చూడాలని సూచించారు. ర్యాంకింగ్స్ ఆధారంగా టాప్ విదేశీ యూనివర్సిటీలను గుర్తించి ఫ్రేమ్‌వర్క్ తయారు చేయాలని.. వాటిలో చదివేందుకు వెళ్లే విద్యార్థులకు ఈ పథకం కింద మొదటి ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు.

ఒకేచోట ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలు..

రాష్ట్రంలో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న సంక్షేమ గురుకుల పాఠశాలలకు సంబంధించి పూర్తి వివరాలను అందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. వాటికి సొంత భవనాలను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. యుద్ధ ప్రాతిపదికన భవనాల నిర్మాణానికి సరిపడా స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించాలని సూచించారు. ఒక్కో పాఠశాల భవనం నిర్మాణానికి ఎంత ఖర్చవుతుందో అంచనా వేసి బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ గురుకుల విద్యా సంస్థలన్నీ వేర్వేరు చోట్ల కాకుండా.. నియోజకవర్గానికో ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు చేయాలని, దీనిపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. దీనితో పాఠశాలల నిర్వహణ, పర్యవేక్షణ, అజమాయిషీ మరింత మెరుగవుతుందని పేర్కొన్నారు. ఎక్కువ మంది విద్యార్థులు ఒకే ప్రాంగణంలో చదువుకోవటం ద్వారా వారిలో పోటీతత్వం, ప్రతిభా పాటవాలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. వెంటనే అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఎడ్యుకేషన్ హబ్‌ల నిర్మాణానికి స్థలాలను గుర్తించాలన్నారు. నియోజకవర్గ కేంద్రంలో వీలుకాకుంటే.. ప్రత్యామ్నాయంగా అదే సెగ్మెంట్లోని మరో పట్టణం లేదా మండల కేంద్రాన్ని ఎంచుకోవాలని సూచించారు. ఇప్పటికే 20 ఎకరాలకు పైగా విస్తీర్ణమున్న స్కూల్ ప్రాంగణాల్లో మిగతా భవనాలు నిర్మించి హబ్‌గా తీర్చిదిద్దే అవకాశాలను పరిశీలించాలన్నారు.

భవనాల కోసం విరాళాల సమీకరణ

ఎడ్యుకేషన్ హబ్‌ల నిర్మాణానికి కార్పొరేట్ సంస్థలు, కంపెనీల సహకారం తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) ఫండ్‌ను సమీకరించాలని.. ముందుకొచ్చే దాతల నుంచి విరాళాలు స్వీకరించి భవన నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో అవసరమైన మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు ఇచ్చే దుప్పట్లు, నోట్ బుక్స్, యూనిఫామ్స్, పుస్తకాల కోసం కూడా సీఎస్ఆర్ ద్వారా నిధులు సమీకరించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ సమావేశాలకు ఏర్పాట్లు

వచ్చే నెల 9 లేదా 14వ తేదీ నుంచి రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలను నిర్వహించే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుత ఆదాయ, వ్యయాలు, కొత్తగా అమలు చేయాల్సిన పథకాలు, అందుకు అయ్యే వ్యయం, నిధుల సమీకరణ తదితర అంశాలపై ఇప్పటికే కాంగ్రెస్ సర్కారు విస్తృత కసరత్తు చేపట్టింది. వివిధ శాఖల నుంచి ప్రతిపాదనలు స్వీకరిస్తోంది. త్వరలోనే తుది బడ్జెట్ ప్రతిపాదనలను రూపొందించనున్నారు. బడ్జెట్ సమావేశాలు పూర్తికాగానే ప్రభుత్వం కులగణనపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టనుంది.

బీసీ కులగణన నిర్ణయం భేష్: జాజుల



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో, బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో బీసీ కులగణన నిర్వహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆయన శనివారం సచివాలయంలోని మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ బీసీ కులగణనను వెంటనే ప్రారంభించాలంటే.. కేబినెట్ సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమైతే మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసి బీసీ కమిషన్ ద్వారా బీసీ కులగణన రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే బిహార్ రాష్ట్రంలో కులగణన పూర్తి చేశారని, ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రస్తుతం బీసీ కులగణన కొనసాగుతోందని తెలిపారు. మూడో రాష్ట్రంగా తెలంగాణలోనూ చేపట్టడం మంచి విషయమని చెప్పారు. కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం పెంచిన తర్వాతే.. గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని, ఉద్యోగ నోటిఫికేషన్లు కూడా విడుదల చేయాలని ఆయన కోరారు.

వచ్చేనెలలో బీజేపీ దేశవ్యాప్త దళిత సమ్మేళనాలు

సాక్షి, హైదరాబాద్: వచ్చేనెలలో బీజేపీ జాతీయ నాయకత్వం ఆధ్వర్యంలో నాగ్‌పూర్, ఆగ్రాలలో నిర్వహించనున్న జాతీయస్థాయి దళిత సమ్మేళనాలకు ప్రధాని మోదీ హాజరు కానున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో... దేశవ్యాప్తంగా కార్యకర్తలను సమీకరించి ఈ సమ్మేళనాలను భారీ సంఖ్యతో నిర్వహించాలని పార్టీ భావిస్తోంది. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సమ్మేళనాల కోసం కార్యకర్తల సమీకరణ నిమిత్తం... తెలంగాణతో సహా ఇతర దక్షిణాది రాష్ట్రాల సహ సమన్వయకర్తగా రాష్ట్రానికి చెందిన ఎస్.కుమార్ (ఎస్సీమోర్చా జాతీయ కార్యదర్శి)ను నియమించారు. ఈ సమావేశాలకు బీజేపీ ఎస్సీ మోర్చాల నాయకులు, కార్యకర్తలను అధికంగా హాజరయ్యేలా ఆయా రాష్ట్రాల వారీగా జాతీయ ఎస్సీ మోర్చాకు చెందిన పలువురు నేతలను సభ్యులుగా నియమించారు. ఎస్సీమోర్చాల జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, జిల్లా పదాధికారులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జాతీయ వర్కింగ్ సభ్యులు హాజరుకానున్నారు.

ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థులు

బీజేపీ గెలుపునకు కాంగ్రెస్ పరోక్ష సహకారం

- మైనారిటీలపై రేవంత్ ప్రతీకారం
- మంత్రివర్గంలో మైనారిటీలకు చోటు లేకుండా చేశారు
- షబ్బీర్ అలీని వాడుకుని సలహాదారు పదవితో సరిపెట్టారు
- రాష్ట్రంలో మత ఘర్షణలకు సీఎందే బాధ్యత
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

వెంగళరావునగర్, సాక్షి, హైదరాబాద్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ డమ్మీ అభ్యర్థులను బరిలోకి దించనున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు ఆరోపించారు. బీజేపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ పరోక్షంగా పని చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్‌కు ఓటు వేయడమంటే అది బీజేపీకి వేసినట్టేనన్నారు. యూసుఫ్‌గూడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగిన బీఆర్ఎస్ జూబ్లీహిల్స్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీలది విడదీయలేని ఫెవికాల్ బంధమని ధ్వజమెత్తారు. రాహుల్ భారత్ జోడో యాత్ర అని తిరుగుతుంటే కాంగ్రెస్ మిత్రపక్షాలు మాత్రం రాహుల్ ఛోడో అని వదిలి పోతున్నాయని, చివరకు ఆ కూటమిలో మిగిలేది రాహుల్ ఒక్కడేనని ఎద్దేవా చేశారు.

దేశంలోనే అట్టర్ ఫ్లాప్ మంత్రి కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్ ఎంపీగా ఉన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలని, కనీసంగా కూడా ఏమీ చేయని ఆయనకు ఈసారి ఓటు అడిగే నైతిక హక్కు లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. దేశంలోనే అట్టర్ ఫ్లాప్ కేంద్రమంత్రి ఎవరైనా ఉన్నారంటే అది కిషన్‌రెడ్డి మాత్రమేనన్నారు. నగరంలో అతి పెద్ద గుడి కట్టింది పీజేఆర్ కుటుంబమని, అయినప్పటికీ ఆయన కుమారుడు ఏనాడూ ఓట్ల కోసం దానిని వాడుకోలేదని, కానీ బీజేపీ దేవుడి పేరు చెప్పి డ్రామాలు చేస్తోందని విమర్శించారు.

మైనారిటీలపై కాంగ్రెస్ పగబట్టింది

ఆర్ఎస్ఎస్ మూలాలు కలిగిన సీఎం రేవంత్‌రెడ్డి మైనారిటీలపై ప్రతీకారం తీర్చుకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చినందునే మైనారిటీలపై కాంగ్రెస్ పగబట్టిందని, రాష్ట్ర కేబినెట్‌లో మైనారిటీలకు స్థానం కల్పించకపోవడమే దీనికి నిదర్శనమన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ మైనారిటీ విభాగం సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. రేవంత్ మంత్రివర్గంలో మైనారిటీలకు ప్రాతినిధ్యం లేదని, 1953 తర్వాత కేబినెట్‌లో మైనారిటీలకు చోటు లేకపోవడం ఇదే తొలిసారని గుర్తు చేశారు. ఎమ్మెల్యేలుగా మైనారిటీలు ఎవరూ లేరనే సాకుతో కాంగ్రెస్ తప్పించుకోలేదని, మంత్రివర్గంలో చోటు కల్పించి ఆ తర్వాత శాసనమండలికి ఎన్నికయ్యేలా చూసుకునే అవకాశముందన్నారు. మైనారిటీ సెంటిమెంటును రెచ్చగొట్టేందుకు అసెంబ్లీ ఎన్నికల్లో షబ్బీర్ అలీ పేరును వాడుకున్న రేవంత్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం సలహాదారు పదవితో సరిపెట్టారని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో ఈనెల 22న నల్లగొండ, సంగారెడ్డి తదితర ప్రాంతాల్లో చోటు చేసుకున్న మత ఘర్షణలకు హోం శాఖ బాధ్యతలు చూస్తున్న సీఎం రేవంత్ బాధ్యత వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

ఆటోలో బీఆర్ఎస్ భవన్‌కు కేటీఆర్

యూసుఫ్‌గూడలోని ఫంక్షన్ హాల్‌లో విస్తృత స్థాయి సమావేశం అనంతరం బయటకు రాగానే ఆటో కార్మికులు కేటీఆర్‌ను చుట్టుముట్టారు. తమ సమస్యలను ఆయనకు విన్నవించుకున్నారు. దీనికి స్పందించిన కేటీఆర్ ఓ ఆటోలో ఎక్కి వారితో మాట్లాడారు. అదే ఆటోలో బీఆర్ఎస్ భవనానికి చేరుకున్నారు. దారిలో వారి సమస్యలను సావధానంగా విన్న కేటీఆర్ ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. ఆటోలో ఆయన వెంట ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కూడా ఉన్నారు.

అబద్ధాలతో అధికారంలోకి వచ్చారు

- కాంగ్రెస్ నేతలపై మాజీ మంత్రి హరీశ్ ధ్వజం
- హామీలు గుర్తు చేస్తే దుర్భాషలాడుతున్నారు
- ప్రభుత్వంలో ఉన్నవారికి సహనం అవసరం
- 'దావోస్'దండగ అని ఇప్పుడు ఎందుకు వెళ్లారు?

సిద్దిపేటజోన్: అనేక అబద్ధాలు ప్రచారం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు అన్నారు. ఆ పార్టీ ఇచ్చిన హామీలను గుర్తు చేస్తే నాయకులు సహనం కోల్పోయి దుర్భాషలాడుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. శనివారం ఆయన సిద్దిపేటలో నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణుల కృతజ్ఞత సభలో మాట్లాడారు. ప్రభుత్వంలో ఉన్నవారు ఓపిక, సహనంతో ఉండాలని, ప్రజలు, ప్రతిపక్షాలు అడిగే దానికి సమాధానం చెప్పాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీల గురించి ప్రశ్నిస్తే కాంగ్రెస్ పాలకులు సహనం కోల్పోతున్నారని విమర్శించారు. అసెంబ్లీలో నిరుద్యోగ భృతి గురించి అడిగితే తాము ఆ మాట చెప్పలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బదులు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ఒకప్పుడు దావోస్ పర్యటన దండగ అన్న కాంగ్రెస్.. ఇప్పుడు సీఎం, మరో మంత్రి పోటీలుపడి వెళితే ఏం సమాధానం చెపుతుందని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఒక్క ఎకరాకు కూడా నీరు ఇవ్వలేదని గతంలో కాంగ్రెస్ నాయకులు తమపై ఆరోపణలు చేశారని, మరి ఇటీవల రంగనాయక సాగర్ ద్వారా నీటిని విడుదల చేసిన మంత్రి కొండా సురేఖ.. లక్షా 10 వేల ఎకరాలకు నీరు ఇస్తున్నట్టు ప్రకటించారని, దీనికి కాంగ్రెస్ నాయకులు ఏం సమాధానం చెపుతారని ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా కేవలం 14 నుంచి 16 గంటలు మాత్రమే ఉంటోందని హరీశ్‌రావు విమర్శించారు.



సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

తప్పించుకునేందుకు కుట్ర..

వంద రోజుల్లో ఆరు గ్యారంటీల అమలు హామీ నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుకునే ప్రయత్నంలో ఉందని హరీశ్‌రావు విమర్శించారు. 'లంకె బిందెలు దొరకలేదు, ఖజానా ఖాళీ అయింది'అనే సాకులతో వాయిదాల పేరిట ఆరు గ్యారంటీల నుంచి తప్పించుకునేందుకు పథకం ప్రకారం కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికలలోపు ఒకటో రెండో అమలు చేసి తర్వాత చేతులు ఎత్తేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందే ఈ నెలలో రైతుబంధు డబ్బులు, చేయూత ద్వారా రూ 4 వేల పింఛన్, మహిళలకు 2,500 చొప్పున డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను, సీఎం రేవంత్, మంత్రుల వ్యాఖ్యలను క్లిప్పింగ్స్ రూపంలో ఆయన భారీ స్క్రీన్ ద్వారా పార్టీ శ్రేణులకు వివరించారు.



సభా ప్రాంగణం నిండిపోవడంతో బయట భారీ ఎత్తున నిలిచిపోయిన జనం



ఓ కార్యకర్త సమరోత్సాహం



చేయెత్తి సీఎం వైఎస్ జగన్‌కు తమ సంఘీభావం తెలియజేస్తున్న యువత

యుద్ధానికి సిద్ధం..

అబద్ధానికి, నిజానికి.. మోసానికి, విశ్వసనీయతకు మధ్య సంగ్రామమిది

భీమిలి వేదికగా 2024 ఎన్నికల శంఖం పూరించిన ఏపీ సీఎం వైఎస్ జగన్

గత ఎన్నికల ముందు ప్రకటించిన మేనిఫెస్టోలో 99 శాతం హామీలను అమలు చేశాం. తద్వారా చెప్పాడంటే చేస్తాడంతే.. అని నిరూపించాం. ఇది నా ఒక్కడి పార్టీ కాదు. ఇది అందరి పార్టీ. అందుకే నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని పదవులు, నియామకాల్లో అగ్రభాగం కల్పించాం. రానున్న ఎన్నికలు పేదలకు ఎంతో కీలకం. మన పిల్లలకు ఇంగ్లిష్ విద్య అందాలన్నా.. వారికి ట్యాబ్‌లు రావాలన్నా.. ప్రభుత్వ పాఠశాలల్లో ఐఎఫ్‌బీ ప్యానల్స్‌తో విద్యను అందించాలన్నా.. పోటీ ప్రపంచంతో మన విద్యార్థులు ధైర్యంగా ఢీకొట్టాలన్నా.. ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే పింఛను చేతికి అందాలన్నా.. ఆర్బీకేల ద్వారా రైతుల అవసరాలు తీరాలన్నా.. ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ క్లినిక్ విధానం కొనసాగాలన్నా.. మనందరి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాలి. ఇందుకోసం ప్రతీ ఒక్కరూ గడప గడపకు వెళ్లి మన ప్రభుత్వం చేసిన మంచిని వివరించాలి.

అటు సముద్రం.. ఇటు జన సముద్రం కనిపిస్తోంది. ఇక్కడకు వచ్చిన ప్రతి అక్క, చెల్లెమ్మ, అన్న, తమ్ముడు, స్నేహితుడు, అవ్వ, తాతల్లో కురుక్షేత్ర యుద్ధానికి సిద్ధమైన పాండవ సైన్యం, సేనాధిపతులు కనిపిస్తున్నారు. ఇక్కడ పాండవ సైన్యం కనిపిస్తుంటే.. అక్కడ కౌరవ సైన్యం ఉంది. వారి సైన్యంలో దుష్ట చతుష్టయం ఉంది. గజ దొంగల ముఠా ఉంది. వారి వ్యూహాలు, కుట్రలు, కుతంత్రాలు మోసపూరిత వాగ్దానాలు, ఎత్తులు, పొత్తులు, చిత్తుల పద్మవ్యూహం కనిపిస్తోంది. ఆ పద్మవ్యూహంలో చిక్కుకొని బలైపోడానికి ఇక్కడ ఉన్నది అభిమన్యుడు కాదు. ఇక్కడ ఉన్నది అర్జునుడు. ఈ అర్జునుడికి మీ అందరి తోడు.. కృష్ణుడి రూపేనా అండదండలున్నాయి. అందుకే మీ బిడ్డ భయపడడు. దేనికీ తొణకడు.

- సీఎం వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: భీమిలిలో అటు సముద్రం.. ఇటు జన సముద్రం సాక్షిగా దిక్కులు పిక్కటిల్లేలా లక్షలాది జన నినాదాల నడుమ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల శంఖారావం పూరించారు. అబద్ధానికి, నిజానికి.. మోసానికి, విశ్వసనీయతకు మధ్య జరుగుతున్న ఈ కురుక్షేత్ర సంగ్రామంలో ఇక్కడున్నది అభిమన్యుడు కాదు.. అర్జునుడని సీఎం జగన్ స్పష్టం చేశారు. పొత్తులు, జిత్తుల పద్మవ్యూహాలతో చంద్రబాబు నేతృత్వంలోని కౌరవ సైన్యాన్ని ఎదుర్కొనేందుకు ప్రజల ఆశీస్సులు, దేవుడి దయ వంటి కృష్ణుడి ఆశీస్సులతో మీ బిడ్డ జగన్ సిద్ధంగా ఉన్నాడని ప్రకటించారు. 2024 జైత్ర యాత్రకు భీమిలి నుంచే శంఖారావాన్ని పూరిస్తున్నామని చెప్పారు. భీమిలి నియోజకవర్గం తగరపువలస జంక్షన్ వద్ద శనివారం 'సిద్ధం' పేరుతో ఏర్పాటు చేసిన ఉత్తరాంధ్ర వైఎస్సార్ కుటుంబ సమావేశానికి సీఎం హాజరయ్యారు. సభలో అభిమాన జనం మధ్య ఏర్పాటు చేసిన ర్యాంపుపై అడుగులు ముందుకు వేస్తూ అభివాదం చేశారు. శంఖం పూరించి.. నగారా మోగించి 2024 ఎన్నికల కురుక్షేత్రానికి సిద్ధమని లక్షలాది మంది శ్రేణుల ఈలలు, కేకలు, నినాదాల మధ్య ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాలకు 175 సాధించాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. గత 56 నెలలో కాలంలో కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు ఏ గ్రామాన్ని చూసినా మనం చేసిన మంచి కనపడుతుందని తెలిపారు. సచివాలయం, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ విధానం, నాడు-నేడుతో మారిన పాఠశాలలతో రాష్ట్రమంతటా వైఎస్సార్‌సీపీ మార్క్, జగన్ మార్క్ కనిపిస్తోందన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు హయాంలో ఆయన మార్క్ పని ఒక్కటీ లేదని దుయ్యబట్టారు. మనందరి ప్రభుత్వంలో లంచాలు, వివక్ష లేని పాలనను అందించామని చెప్పారు. ఈ ఎన్నికల్లో వేసే ఓటు పేదల తలరాతలు మార్చే ఓటు అని అభివర్ణించారు. సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

పథకాలే మన ఎన్నికల బాణాలు, అస్త్రాలు

- 2024 ఎన్నిల్లో మన పార్టీ జైత్ర యాత్రకు.. మరో పాతికేళ్ల పాటు సంక్షేమ, అభివృద్ధి పాలన కొనసాగింపునకు.. ఈ భీమిలిలో సన్నాహక సమావేశం జరుగుతోంది. మేనిఫెస్టో ద్వారా మనం ఇచ్చిన ప్రతి మాటా అధికారంలోకి వచ్చాక త్రికరణ శుద్ధితో ఒక భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావిస్తూ ఏకంగా 99 శాతం హామీలను నెరవేర్చిన ఈ పార్టీలో మీతో నా ఆలోచనలను పంచుకోవడానికే ఈ సమావేశం.
- పేద ప్రజల మీద ప్రేమతో, బాధ్యతతో 56 నెలల కాలంలో అమలు చేస్తున్న పథకాలే మనకు రానున్న ఎన్నికలకు బాణాలు, అస్త్రాలు. ఈ యుద్ధంలో 175కు 175 వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ టార్గెట్. గెలుపే మన లక్ష్యం. దేవుడి దయతో ప్రతి ఇంటికి, ప్రాంతానికి, ఊరికి చేసిన మేలుతో చంద్రబాబుతో సహా వారంతా ఓడాల్సిందే.
- ఒంటరిగా పోటీ చేసే ధైర్యం లేక దత్తపుత్రుడితో సహా ఇతరులతో పొత్తు కోసం వెంపర్లాడుతున్నాడంటే దాని అర్థం ఏమిటో ఆలోచించండి. చంద్రబాబు తాను మంచి పని చేశానని, ఒక స్కీమ్ పెట్టామని చెప్పలేక.. కొత్త వాగ్దానాలతో గారడీ చేయాలని చూస్తున్నాడంటే ప్రజల్లో వారు లేరని అర్థం. 2019లో వచ్చినన్ని 23 స్థానాలు కూడా వారికి రావని అర్థం. 175 స్థానాల్లో కనీసం పోటీ పెట్టేందుకు అభ్యర్థులు లేరని అర్థం.

మన చరిత్ర ఇంటింటి విజయగాథ

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చరిత్ర ఓ విప్లవ గాథ. మన ప్రభుత్వ చరిత్ర ఇంటింటి విజయ గాథ. మన పాలనలో అన్ని రంగాల్లో చిత్తశుద్ధితో సంక్షేమం, అభివృద్ధి కనిపిస్తుంది. నేను మోసాన్ని నమ్ముకోలేదు. ఇంటింటికి చేసిన సంక్షేమం, అభివృద్ధిని నమ్ముకొని ప్రజల దగ్గరకు మళ్లీ వెళుతున్నాను.
- పేదరికం, అసమానత సంకెళ్లను బద్దలు కొట్టి.. ప్రతి పేద కుటుంబానికి మంచి చేస్తూ.. 21 శతాబ్దంలోకి నడిపిస్తున్న మనసున్న, బాధ్యత గల ప్రభుత్వం మనది. ఇదే విషయాన్ని ప్రతి ఇంటికి వెళ్లి చెప్పండి. 70 రోజుల్లో ఎన్నికల యుద్ధానికి ప్రతి ఒక్కరి భుజస్కందాలపై బాధ్యతలు పెడుతున్నాం. అబద్ధానికి నిజానికి.. మోసానికి, విశ్వసనీయతకు మధ్య జరుగుతున్న యుద్ధమిది. 2014లో చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో 650 వాగ్దానాలు ఇచ్చారు. అందులో 10 శాతం కూడా అమలు చేయలేదు. మన ప్రభుత్వం 99 శాతం వాగ్దానాలు అమలు చేయడం వల్ల ప్రతి ఇంట్లో సంతోషం చూసి సంబర పడుతున్నాం.

కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు..

- రాష్ట్రంలో కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు ఏ గ్రామానికైనా వెళ్లండి. మీ ఇష్టం. ఎక్కడకు వెళ్లినా ఆ గ్రామానికి చంద్రబాబు ఏం చేశారంటే చెప్పడానికి ఏమీ కనిపించదు. జగన్ ఏం చేశాడంటే.. ఈ 56 నెలల్లో ప్రతి గ్రామంలో ఎన్నెన్నో మార్పులు కనిపిస్తున్నాయి. గ్రామ సచివాలయాలు కనిపిస్తాయి. 540 పౌర సేవలు. అందులో దాదాపు 10 మంది మన పిల్లలు శాశ్వత ఉద్యోగాలు చేస్తూ కనిపిస్తారు. ఎక్కడా అవినీతి, లంచాలు, వివక్ష ఉండదు.
- ఇంటింటికీ ఒకటో తేదీ ఉదయాన్నే పెన్షన్ అయినా, పౌర సేవలైనా, ఏ పథకమైనా మన గడపకే తెచ్చి చిరునవ్వుతో అందించే మనలో భాగమైన ఓ గ్రామ వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చాం. రైతన్నను చేయి పట్టుకొని నడిపించే ఆర్బీకే వచ్చింది. అదే గ్రామంలో ఒక విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్, ఇంటింటినీ జల్లెడ పడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమం.. ఇటువంటివన్నీ మీ బిడ్డ పాలనలోనే వచ్చాయి.
- నాడు-నేడుతో విద్యా రంగానికి మంచి రోజులు వచ్చాయి. ఇంగ్లిష్ మీడియంతో మొదలు ట్యాబ్‌లు, ఐఎఫ్‌బీ, బైలింగ్వల్ టెక్స్ట్ బుక్‌లు ఇలా అన్నీ మన ప్రభుత్వంలోనే అమలయ్యాయి. అదే గ్రామంలో సచివాలయంలో మహిళా పోలీస్. ప్రతి అక్కచెల్లెమ్మ చేతిలోని ఫోన్‌లో దిశ యాప్.. వారికి ఎటువంటి అపాయం సంభవించినా కేవలం బటన్ నొక్కిన వెంటనే లేదా మొబైల్ అయిదుసార్లు ఊపితే 10 నిమిషాల్లో పోలీస్ సోదరుడు వచ్చి చెల్లెమ్మను ఏమైందని అడిగే వ్యవస్థ వచ్చింది ఇప్పుడే.
- ఇలాంటి మంచి పనులు చేయాలనే ఆలోచన 14 ఏళ్లు సీఎంగా పని చేసిన చంద్రబాబుకు ఏనాడూ రాలేదు. ఎందుకంటే వీరు పెత్తందారులు కాబట్టి. పల్లె ప్రజలంటే బాబు దృష్టిలో పని మనుషులు. పెత్తందారుల పొలాల్లో, ఇళ్లలో పని చేసే పని మనుషులు. పొట్ట పోసుకోవడం కోసం ఉండే జనావాసం ఆ పల్లె అని చంద్రబాబు నమ్మకం. ఆయన ముఖ్యమంత్రిగా ఉంటే ఏ గ్రామం, పల్లె బాగుపడదు. ప్రజలు, పేదవాడు బాగుపడాలి, గొప్పగా చదవాలి, భవిష్యత్తు మారాలన్న తాపత్రయం పెత్తందార్లకు లేదు.

ఈ పెత్తందారులను ఓడిద్దాం..

- వచ్చే ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య యుద్ధం. వారి వంచనకు, మన విశ్వసనీయతకు మధ్య యుద్ధం. వచ్చే ఎన్నికలు వారి దోచుకో, పంచుకో, తినుకో అనే విధానానికి మన డీబీటీ అంటే బటన్ నొక్కడం.. నేరుగా అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి డబ్బు వెళ్లిపోడానికి మధ్య జరుగుతున్న యుద్ధం. వారి సామాజిక అన్యాయానికి మన సామాజిక న్యాయానికి మధ్య యుద్ధం. వచ్చే ఎన్నికలు ఈ సంక్షేమ పథకాలన్నీ రద్దు చేసే వారి కుట్రలకు, మన సంక్షేమ ప్రభుత్వానికి మధ్య యుద్ధం. వచ్చే రెండు నెలలు మనందరికీ నిత్యం యుద్ధమే. ఈ 70 రోజులు ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీకి ఒక సైన్యంలా పని చేయాలి.
- ప్రతిపక్షాలు పది వైపుల నుంచి చేసే దాడులను వారి ఎల్లో మీడియాను, వారి సోషల్ మీడియాను, అందులో చేసే దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి. ప్రతి ఒక్కరి చేతుల్లో సెల్‌ఫోన్‌లు ఉన్నాయి. అవే మీకు అస్త్రాలు. సెల్‌ఫోన్ ఉన్న ప్రతి పేద వాడు కూడా సోషల్ మీడియాను శాసించవచ్చు. బూత్ కమిటీల సభ్యులు, గృహ సారథులు, వలంటీర్లు, సామాన్య కార్యకర్త మొదలు, రాజ్యసభ సభ్యుల వరకు ప్రతి ఒక్కరూ కీలకమైన పాత్ర పోషించాలి. వచ్చే ఎన్నికల్లో మన టార్గెట్ 175కి 175 ఎమ్మెల్యే స్థానాలు. 25కి 25 ఎంపీలు మన లక్ష్యం.
- ప్రతి ఇంటికి మంచి చేశాం. ప్రతి గ్రామంలో మంచి జరిగింది. అందులో 60 శాతం కుటుంబాలు మీ వెంట, మన వెంట ఉంటే అన్ని సీట్లు మనవే. మంచి చేసిన, మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం, ప్రతి పేదవాడి భవిష్యత్తు గురించి ఆలోచన చేసిన, చేస్తున్న ప్రభుత్వం, మనందరి ప్రభుత్వం. ఈ యుద్ధానికి సిద్ధం, సై అంటున్న మీ బిడ్డకు మీరందరూ తోడుగా ఉండడానికి సిద్ధమా అని అడుగుతున్నా. (సిద్ధం.. అని జనం నుంచి కేకలు) జనంలో లేని, పేదవారి గుండెల్లో లేని వారు, దిగజారుడు పార్టీలన్నింటికీ మీ జగనన్నే టార్గెట్. పేదవాడి భవిష్యత్తు, వైఎస్సార్‌సీపీయే లక్ష్యంగా ఆయుధాలు రెడీ చేసుకుంటున్నాయి. దుష్ట చతుష్టయాన్ని, గజదొంగల ముఠాను, ఓడించేందుకు మీరు సిద్ధమా.. (సిద్ధమేనని నినాదాలు) వారందరిపై ఒంటరి పోరాటానికి మీ బిడ్డ సిద్ధం. మీ అందరి చల్లని దీవెనలు, ఆశీస్సులు, దేవుడి దయ ఉన్నంత వరకు మీ బిడ్డ ఏ ఒక్కరికీ భయపడడు. సమరనాథం చేస్తూ ఎన్నికల శంఖారావం పూరిస్తూ మేం యుద్ధానికి సిద్ధమని వైఎస్సార్‌సీపీ ఇక్కడి నుంచి పిలుపునిస్తోంది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



ఎక్కడ చూసినా వైఎస్సార్‌సీపీ, జగన్ మార్క్

- రైతు సంక్షేమాన్ని చూస్తే మనమెక్కడ.. చంద్రబాబు ఎక్కడ? అని ఆలోచన చేయాలి. రుణమాఫీ చేస్తానని నిలువునా ముంచింది చంద్రబాబు. రైతులు 87,612 కోట్లు బ్యాంకులకు కట్టొద్దని పిలుపిచ్చాడు. మొట్టమొదటి సంతకంతో రుణమాఫీ అని వాగ్దానం చేశాడు. మేనిఫెస్టోలో పెట్టి రైతులను మోసం చేశాడు.
- ఈ రోజు రైతు భరోసా అంటే గుర్తుకొచ్చేది మీ జగన్. ఆర్బీకే అంటే జగన్. సకాలంలో విత్తనమైనా, ఎరువులైనా, ఇన్‌పుట్ సబ్సిడీ అయినా సకాలంలో అందుతున్నాయంటే గుర్తుకొచ్చేది మీ జగన్. పగటి పూట ఉచిత్ విద్యుత్, ఉచిత బీమా, సున్నా వడ్డీ అందుతున్నాయన్నా, ఆక్వా రైతులకు కరెంట్ సబ్సిడీ అందుతోందంటే గుర్తుకొచ్చేది జగన్.
- ఏ పొలంలోకి వెళ్లినా చంద్రబాబు చెప్పుకోడానికి ఏముంది? చంద్రబాబు మార్క్ ఎక్కడుంది? ఎక్కడ చూసినా వైఎస్సార్‌సీపీ, జగన్ మార్క్ కనిపిస్తోంది. ప్రజల వైద్యం, ఆరోగ్యం విషయానికి వస్తే.. 108, 104 చూసినా, 3,257 ప్రొసీజర్లతో ఆరోగ్యశ్రీ విస్తరించినా.. ఆరోగ్య ఆసరా చూసినా, గ్రామ స్థాయిలో విలేజ్ క్లినిక్, ఇంటింటినీ జల్లెడ పడుతూ నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష, 17 కొత్త మెడికల్ కాలేజీలు, వైద్య రంగంలో 53 వేల కొత్త నియామకాలు.. నాడు-నేడుతో బాగుపడుతున్న ఆస్పత్రులు.. ఇలా ఏది తీసుకున్నా ఒక వైఎస్సార్‌సీపీ, జగన్ మార్క్ కనిపిస్తోంది.
- ఏ ప్రభుత్వ బడిని తీసుకున్నా.. మొత్తంగా విద్యా రంగాన్ని తీసుకున్నా.. నాడు-నేడు, ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ నుంచి ఐబీ వరకు ప్రయాణం, తెలుగు, ఇంగ్లిషు భాషలు ఉన్న పాఠ్యపుస్తకాలు, బైజూస్ కంటెంట్, మన ప్రభుత్వ బడి పిల్లల చేతుల్లో ట్యాబ్‌లు, క్లాస్‌రూమ్‌లలో ఐఎఫ్‌పీలు, గోరుముద్ద, బడి తెరిచే సరికే విద్యా కానుక, పెద్ద చదువులు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు అప్పుల పాలు అవ్వకూడదని ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తూ జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ డిగ్రీ, విదేశాల్లోని టాప్ యూనివర్సిటీల్లో ఆన్‌లైన్ వర్టికల్స్ ద్వారా డిగ్రీల అనుసంధానం ఇలా అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. జాబ్ ఓరియంటెడ్ కరిక్యులం ద్వారా ఇంటర్న్‌షిప్‌తో డిగ్రీలో చేర్చడం, ఇలా విద్యా రంగంలో ఏది తీసుకున్నా మార్పు స్పష్టంగా కనిపిస్తోంది.

క్లుప్తంగా...

రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములమవుతాం

వెల్లడించిన గ్రూప్-3, 4 ఉద్యోగులు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఆదేశానుసారం రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములం అవుతామని గ్రూప్-3, 4 ఉద్యోగులు అన్నారు. శనివారం తెలంగాణ సచివాలయంలో పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ విభజన చట్టంలో భాగంగా ఏపీకి కేటాయించిన 148 మంది గ్రూప్ 3, 4 ఉద్యోగులను తెలంగాణ సెక్రటేరియట్ విధుల్లోకి తీసుకునేందుకు అనుమతించిన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. గతంలో 25 ఏళ్లపాటు సచివాలయంలో పనిచేశామని గుర్తుచేశారు.



శనివారం కవి కొత్త శ్రీనివాస్ రూపొందించిన 2024 కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న సినీ దర్శకుడు కె.రాఘవేంద్రరావు.

టీఎస్‌పీఎస్సీ సభ్యురాలు అరుణకుమారి రాజీనామా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యురాలు కోట్ల అరుణ కుమారి శనివారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని గవర్నర్ తమిళిసైకు పంపించారు. తాజాగా అరుణ కుమారి రాజీనామాతో మొత్తం కమిషన్ సభ్యులందరూ రాజీనామాలు చేసినట్టయింది. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో తనకు ఎలాంటి సంబంధం లేకున్నా.. పాత ప్రభుత్వంలో నియమితులైన చైర్మన్, సభ్యులందరూ రాజీనామాలు చేయడంతో పదవి నుంచి తప్పుకొన్నట్టు ఆమె ఒక ప్రకటనలో తెలిపారు.

'కౌలు'కు ఏపీ తరహా చట్టం

ధరణి కమిటీకి వ్యవసాయశాఖ సూచన


సాక్షి, హైదరాబాద్: ఏపీలో అమలు చేస్తున్న పంటసాగు హక్కుల చట్టం-2019 తరహాలోనే తెలంగాణలో సైతం కొత్త చట్టం తీసుకొస్తే కౌలు రైతులకు 'రైతు భరోసా' పథకం వర్తింపజేయడానికి అవకాశం ఉంటుందని, ధరణి పోర్టల్ పునర్నిర్మాణ కమిటీకి వ్యవసాయశాఖ ప్రతిపాదించింది. వ్యవసాయం, గిరిజన సంక్షేమం, అటవీశాఖల అధికారులతో శనివారం రాష్ట్ర సచివాలయంలో కమిటీ సమావేశమై చర్చించింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కౌలుదారులకు రైతు భరోసా ఇచ్చేందుకు అనుసరించాల్సిన విధానంపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ప్రతి ఏటా నిర్దేశిత కటాఫ్‌తేదీ నాటికి ధరణి పోర్టల్‌లో ఉన్న భూరికార్డుల సమాచారం ఆధారంగా రైతుబంధు పంపిణీ చేస్తున్నామని వ్యవసాయశాఖ అధికారులు కమిటీకి నివేదించారు. రైతుబంధు సాయం పొందుతున్న లబ్ధిదారులు నిజంగా భూములను అనుభవిస్తున్నారా? పంటలు సాగు చేస్తున్నారా? ఖాళీ భూములకు కూడా రైతుబంధు చెల్లిస్తున్నారా? అని కమిటీ ప్రశ్నించగా, తమ వద్ద ఎలాంటి సమాచారం లేదని వ్యవసాయశాఖ అధికారులు బదులిచ్చారు. అటవీ భూములన్నింటిని ధరణిలోని నిషేధిత భూముల జాబితాలో చేర్చలేదని, అటవీశాఖ అధీనంలోని భూముల లెక్కకు, ధరణిలోని అటవీ భూముల లెక్కకు పొంతన లేదని అటవీఅధికారులు కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. అటవీ భూముల పరిరక్షణకు ధరణిలో లోటుపాట్లు సరిచేయాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లోని కొందరు రైతుల పట్టాభూముల వివరాలు పాత రికార్డుల్లో నమోదు కాకపోవడంతో, ధరణిలో ఎంట్రీకి నోచుకోలేదని గిరిజనశాఖ అధికారులు కమిటీకి తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో వారసత్వ బదిలీకి గ్రామసభలు నిర్వహించి తీర్మానం చేయాలని నిబంధనలు ఉండటంతో ఇబ్బందికరంగా మారిందని వివరించారు. క్షేత్ర స్థాయిలో గిరిజన రైతుల ఆధీనంలో ఉన్న భూములను వారి పేరు మీద ధరణిలో ఎంట్రీ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు కాంగ్రెస్ కిసాన్‌సెల్ నేత కోదండరెడ్డి, భూచట్టాల నిపుణుడు సునీల్‌కుమార్, రిటైర్డ్ రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రేమండ్ పీటర్, రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిట్టల్, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ మధుసూదన్, సీఎంఆర్‌ఓపీడీ వి.లచ్చిరెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. కమిటీ తదుపరిగా వచ్చేనెల 3వ తేదీన సచివాలయంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, వక్ఫ్, ఎండోమెంట్, స్వే అండ్ సెటిల్మెంట్ శాఖల అధికారులతో సమావేశమై ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక సమర్పించనుంది. జిల్లాల పర్యటనల తర్వాత తుది నివేదిక ఇవ్వనుంది.



సమావేశంలో కోదండరెడ్డి, నవీన్ మిట్టల్, సునీల్

నేటి అమిత్‌షా పర్యటన వాయిదా

సాక్షి, హైదరాబాద్: బీజేపీ అగ్రనేత, కేంద్రహోంమంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటన వాయిదా పడింది. లోక్‌సభ ఎన్నికల సమాయత్తతలో భాగంగా ఆదివారం ఆయన మహబూబ్‌నగర్, కరీంనగర్, హైదరాబాద్‌లలో పార్టీ నేతలతో వివిధ సమావేశాల్లో పాల్గొనాల్సి ఉంది. కొన్ని అత్యవసర పనుల వల్ల అమిత్ షా రాష్ట్ర పర్యటన వాయిదా పడిందని కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఆదివారం రాష్ట్రంలోని మూడు జిల్లాల్లో ఏర్పాటు చేసిన సమావేశాలను వాయిదా వేసినట్టు ఆయన తెలియజేశారు. త్వరలోనే జరగనున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో.. జాతీయస్థాయిలో వివిధ కీలక



రాజకీయ పరిణామాలు చోటుచేసుకోవడంతో అమిత్ షా పర్యటనలో మార్పులు జరిగినట్టు రాజకీయవర్గాలు భావిస్తు న్నాయి. ఇండియా కూటమిలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న బిహార్ సీఎం నితీశ్ కుమార్ మళ్లీ ఎన్డీఏ కూటమిలో చేరడంతో పాటు, ఆ రాష్ట్రంలో సంకీర్ణ సర్కార్‌లోని ఆర్జేడీకి దూరం కానున్నట్టు వార్తలు వినిపిస్తుండటం తెలిసిందే. బిహార్‌లో నితీశ్‌కుమార్ మళ్లీ బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారనే అంచనాల మధ్య అమిత్‌షా హుటాహుటిన పట్నాకు వెళ్లనుండడంతో రాష్ట్ర పర్యటన వాయిదా పడినట్టు సమాచారం.

గరిష్ట వయోపరిమితి పెంచండి..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పోటీ పరీక్షలకు హాజరయ్యే నిరుద్యోగుల గరిష్ట వయోపరిమితిని 44 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి నిరుద్యోగుల సంక్షేమ సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం నేతలు మంజులా రెడ్డి, దునుకు వేలాది, కె.నర్సింహులు, వెంకట నారాయణ, రవీంద్రన్, సుధాకర్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. పోటీ పరీక్షలకు హాజరయ్యేందుకు గత ప్రభుత్వం వయోపరిమితిని 34 ఏళ్ల నుంచి 44 ఏళ్లకు సడలించినప్పటికీ, నోటిఫికేషన్లు రాలేదని వివరించారు. ఒకే ఒక్కసారి గరిష్ట వయోపరిమితిని 50 ఏళ్లకు పెంచి నోటిఫికేషన్లు జారీ చేస్తే కొన్నేళ్లుగా ఉద్యోగాల కోసం పోరాడుతున్న అందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. కొత్త మల్టీ జోనల్ వ్యవస్థ అమలు, కొత్త జిల్లాల ఏర్పాటు, కోవిడ్-19, 61 ఏళ్ల ఉద్యోగ విరమణ వయసు తదితర డిమాండ్ల సాధనకు 16 ఏళ్లుగా తెలంగాణ నిరుద్యోగులు పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. వయసు లెక్కించడానికి ఏజ్ కటాఫ్ డేట్‌ను జూన్1కి బదులుగా జనవరి 1వ తేదీని ప్రాతిపదికగా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను నిరుద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు.

నేడు సింగరేణిలో పోలింగ్

గోదావరిఖని: సింగరేణిలోని అధికారుల సంఘం ఎన్నికల ప్రచారానికి తెరపడింది. 18 రోజులుగా అధికారులు ఎన్నికల ప్రచారంలో మునిగితేలారు. సంస్థ వ్యాప్తంగా ఉన్న 12 ఏరి యాల అధ్యక్షులు, ఓవరాల్ సింగరేణి కమిటీ కోసం ఆదివారం పోలింగ్ నిర్వహిస్తారు. మొత్తం 17 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య ఎన్నికల ముఖ్య అధికారిగా వ్యవ హరిస్తున్నారు. పోలింగ్ కేంద్రాలకు ఇప్పటికే ఎన్నికల సామగ్రి తరలించారు. 28, 29వ తేదీల్లో ఓట్ల లెక్కింపు చేపడతారు. విజేతలకు ఈనెల 30న ధ్రువీకరణ పత్రం అందిస్తారు.

మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తాం

బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫె స్టోకు అనుగుణంగా మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివా రం సచివాలయంలోని తన చాంబర్‌లో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీని వాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర మున్నూరు కాపు సంఘాల నేతలతో మంత్రి సమా వేశ మయ్యారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వెనుకబడిన కులాల్లో 50లక్షల మందికి పైగా ఉన్న మున్నూరుకాపు కులానికి న్యాయం చేయాలని కోరారు. మున్నూరుకాపుల్లో ఎక్కువ శాతం కుటుంబాలు వ్యవసాయంపైనే జీవనం సాగిస్తున్నాయని, ఇప్పుడిప్పుడే అక్షరాస్యత పెరుగుతోందని తెలిపారు. కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే కొంత అభివృద్ధి జరుగుతుందన్నారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ మున్నూరుకాపుల్లో మరింత రాజకీయ చైతన్యం రావాలని సూచించారు. బీసీ సంక్షేమంపై జరిగే సమావేశంలో కార్పొరేషన్ అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో కార్పొరేషన్ ఏర్పాటుకు సంబంధించిన విధివిధానాలు రూపొందిస్తామని చెప్పారు.

ఫెయిలవుతానేమోనని..

ఉరేసుకొని టెన్త్ విద్యార్థి ఆత్మహత్య



సంజయ్‌గౌడ్(ఫైల్)

హవేళిఘణాపూర్(మెదక్): పరీక్షల్లో ఫెయిలవుతానేమోనని మనస్తాపానికి గురైన ఒక పదో తరగతి విద్యార్థి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మెదక్ జిల్లా హవేళిఘణాపూర్ మండల పరిధిలోని బూర్గుపల్లి గ్రామంలో జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలివి. బూర్గుపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి సాయాగౌడ్, స్వప్నల రెండో కుమారుడు సంజయ్‌గౌడ్(15) శనివారం పాఠశాలకు సెలవు కావడంతో కుటుంబ సభ్యులతో ఇంటివద్దే ఉన్నాడు. పని నిమిత్తం కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లిపోగా, సంజయ్‌గౌడ్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తిరిగి ఇంటికి వచ్చేటప్పటికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. లోపలికి వెళ్లి కిందకు దించేసరికే మృతి చెంది ఉన్నాడు. పదో తరగతి పాస్ కానంటూ నిరాశతో తరచూ తన అక్కకు చెబుతుండేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.



నా పూర్ణహృదయముతో నిన్ను వెదకియున్నాను,
నన్ను నీ ఆజ్ఞలను విడిచి తిరుగనియ్యకుము.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు పుష్య మాసం, **తిథి:** తె.4.02 వరకు (తెల్లవారితే సోమవారం), తదుపరి చవితి, **నక్షత్రం:** మఖ ప.2.34 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** రా.11.27 నుండి 1.11 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.23 నుండి 5.11 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.56 నుండి 1.44 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం : 5.49
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

మమతా బెనర్జీ (ప.బెం. సీఎం)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

వీధులంటే నాకు ఇష్టం. అది నేను ఉంటున్న ఛటర్జీ స్ట్రీట్ అయినా, రోజూ నేను వెళ్లొస్తుండే కిరణ్ శంకర్ రే రోడ్డు అయినా.. వీధులతో నేను అదే పనిగా హృదయ పూర్వకమైన సంభాషణ జరుపుతుంటాను.

వీధులలో ఉండేది కొద్దిసేపే. ఆ కొద్దిసేపూ మనసు హాయిగా అడుగులు వేస్తుంది. వడివడిగా నడుస్తుంది. పరుగులు తీస్తుంది. గాలిలో తేలినట్లు, ప్రాణ వాయువుతో కలిసి ప్రయాణిస్తున్నట్లు ఉంటుంది.

అంతగా ఏముంటుంది వీధులలో?! చాలా ఉంటాయి. ముఖ్యంగా మనుమలుంటారు. ఆ మనుమల్లో హిందువులు, ముస్లిములు, క్రిస్టియన్లు, సిక్కులు ఉంటారు. అందరిదీ ఒకే దారిగా ఉంటారు. ఆ దారుల్లో వాళ్ల మాటలు వినిపిస్తుంటాయి. వాళ్ల పిల్లల నవ్వులు తుళ్లి, తూనీగలై ముఖానికి తగులుతుంటాయి.

వీధి అయితే చాలు నాకు. అది కోల్‌కతాలో ఉందా, లండన్‌లో ఉందా అని కాదు. మందిరం ఉందా, మసీదు ఉందా, చర్చి ఉందా అని కూడా కాదు. నిండా మనుమలున్న వీధి, ఒకరినొకరు అంటకుండా వెళ్లలేని వీధి:



ఎప్పుడూ ఊరేగింపులు, ఉత్సవాలు జరుగుతుండే వీధి... నాకు నచ్చుతుంది. అది నా వీధిలా ఉంటుంది. నా సొంత వీధిలా! సొంతంగా కట్టుకున్న వీధిలా!

నవ్వొచ్చింది నాకు. వీధిని ఎవరైనా సొంతానికి కట్టుకుంటారా? వీధులే తమ సొంతానికి మనుమల్ని కట్టుకుంటాయి కానీ!

"దీదీజీ... యూకేలో మీకు ఇష్టమైన ప్లేస్ ఏది?" అని గతవారం బుక్ ఫెయిర్ ప్రారంభానికి వెళ్లినప్పుడు కాలేజ్ స్టూడెంట్స్ నన్ను అడిగారు. ఈ ఏడాది బుక్ ఫెయిర్ థీమ్... 'యూకే' కనుక ఆ ప్రశ్న అడిగి ఉంటారు.

"లండన్ ఇష్టం" అని చెప్పాను.

"లండన్‌లో ఏమిష్టం?" అన్నారు.

"లండన్‌లో నేను నడిచే ప్రతి వీధీ నాకు ఇష్టం" అని చెప్పాను.

నవ్వారు. "మరి మన కోల్‌కతాలో మీకు ఏ వీధి ఇష్టం?" అని అడిగారు.

"ఇప్పటికిప్పుడైతే సెంట్రల్ పార్క్ రోడ్డు ఇష్టం..." అన్నాను.

"ఎందుకు దీదీజీ!" అన్నారు.

"బుక్ ఫెయిర్ జరుగుతోంది కదా! అందుకు..." అని నవ్వాను.

"ఓ.." అంటూ అంతా చప్పట్లు.

వీధులు ఎప్పుడూ ఏదో ఒక ఫెయిర్ జరుగుతున్నట్లుగా, ఇదుగో... ఈ పిల్లలు నిర్భయంగా ప్రశ్నలు అడుగుతున్నట్లుగా మనుమలందరితో హోరెత్తిపోతుండాలి. బల వంతపు పరమత సహన మూతి బిగింపుల్ని ఇంట్లోనే చెప్పుల స్టాండ్‌లో వదిలేసి మనం బయటికి రావాలి. వీధిలోకి రాగానే వీధే మన కాళ్లకు ఉత్సాహాన్ని తొడుగుతుంది.

లండన్ వెళ్లినప్పుడు ఊరికే అలా కాసేపు వీధుల్లో తిరుగుతూ ఉంటాను నేను. గొప్ప నిర్మాణాలు, గొప్ప కట్టడాలు ఉంటాయి. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, 'లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్' ఉంటాయి. వాటికన్నా ఆ వీధులు నాకు ఎక్కువ ఆకర్షణ.

"దీదీజీ... 22న మీరు అయోధ్యకు ఎందుకు వెళ్లలేదు?" అని రిపబ్లిక్ డే ఈవెంట్‌కి వచ్చిన విద్యార్థులు కొందరు అడిగాను.

"ఆ రోజు నేను ఇక్కడి మన వీధుల్లో నడవాలనుకున్నాను" అని చెప్పాను.

"ఇక్కడికి, అక్కడికి తేడా ఏంటి దీదీజీ?" అన్నారు.

"ఇక్కడ నేను కాళీఘాట్‌లో నడిచాను. హజ్రా క్రాసింగ్‌లో నడిచాను. పార్క్ సర్కస్ మైదాన్‌లో నడిచాను. ఆ దారిలో ఉన్న ఆలయాన్ని, మసీదును, గురుద్వారను, చర్చిని దర్శించుకోడానికి వచ్చిన వారందరితో కలిసి నడిచాను..." అన్నాను.

"ఆరోజే ఎందుకు దీదీజీ..." ఆ వారు తమ తర్వాతి ప్రశ్నగా అడగలేదు.

కలుపుకొని వెళ్లవలసిన సమయంలోనే కదా కలిసి నడుస్తాం అని అర్థం చేసుకోలేని వారు బెంగాల్‌లోనే కాదు, మొత్తం ఇండియాలోనే ఉండరు. అదీ ఇక్కడి వీధుల గొప్పతనం!

షణ్ముఖ కూటమి... సిద్ధమా?



జనతంత్రం

వర్ధెల్లి మురళి



> ఏపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు సిద్ధమయ్యారు సరే! మరి ప్రత్యర్థుల సంగతి? ఆ ప్రత్యర్థి ఏకవచనమా? బహువచనమా అనే సందేహం అవసరం లేదు. బహువచనంగా కనిపించే ఏకవచనం. చంద్ర బాబు బహురూపి. ఒక రూపం నుంచి మరో రూపంలోకి పాదరసంలా ప్రవహించగల నేర్పరి. ఈ ఎన్నికల కోసం ఆయన ఇప్పటికే ఆరు రూపాల్లోకి ప్రవహించారు. ఇందులో కొన్ని పాత రూపాలే. కొన్ని కొత్తవి. ఆరు ముఖాల వాడిని సంస్కృతంలో షణ్ముఖం అంటారు. తమిళ సంప్రదాయంలో ఆర్ముగం అంటారు. ఇప్పుడు మన ఆర్ముగం చంద్రబాబు ఆరు ముఖాలతో ఆరు శిబిరాలను తన కోసం సన్నద్ధం చేసుకున్నారు.
>
> ఇందులో మొదటి ముఖం తనదైతే, రెండోది యెల్లో మీడియా లీడర్ రామోజీది. వీరిద్దరు సియామీ కవలలు. ఇద్దరిలో ఎవరిది ఒకటో నెంబరో తేల్చడం కష్టం. పొలిటికల్ ఫేస్ కనుక బాబునే ఒకటి అనుకుందాం. ఇక మూడో ముఖం జగమెరిగిన జనసేనాధిపతి. తన కోవర్టుల సాయంతో కబ్జా చేసిన బీజేపీ రాష్ట్ర శాఖ నాలుగో ముఖం. తాను కొనుగోలు చేసిన రాష్ట్ర కాంగ్రెస్ యూనిట్ ఐదో ముఖం. ఈ సిక్ యూనిట్‌ను 'కొనుగోలు' చేసినందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహకర్త 'కనుగోలు' సేవలు ఉచితంగా లభిస్తాయట! ఇక సందర్భాన్ని బట్టి తనకు ఉపయోగపడే పనులు చేసిపెడుతూ, అప్రకటిత ఓఎస్‌డీగా పనిచేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర శాఖ ఆరో ముఖం. ఇందులో ఎవరికి నిర్దేశించిన పాత్రను వారు పోషిస్తూ చంద్రబాబుకు తోడ్పాటునందిస్తుంటారు.

> బీజేపీలో చేరిన బాబు కోవర్టులు, బీజేపీ భాగస్వామిగా చేరిన పవన్ కల్యాణ్‌ల ప్రయత్నాలతో పాటు తన పాత పరిచయాలతో చేసిన లాబీయింగ్ ఫలితంగా బీజేపీ రాష్ట్రశాఖకు బాబు వదినమ్మ అధ్యక్షురాలిగా వచ్చారు. వర్గ ప్రయోజనాల రక్షణ కోసం ఆ వదినమ్మ బాబుకు అండగా నిలబడుతున్నారు. ఫలితంగా రాష్ట్ర బీజేపీని ఒక ఫ్రాంచైజీగా చంద్రబాబు మార్చేసుకున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. దానితోపాటు ఈగలు తోలుకుంటున్న రాష్ట్ర కాంగ్రెస్ దుకాణాన్ని కూడా తెరిపించి అద్దె చెల్లిస్తున్నారు. దానికి షర్మిలను అధ్యక్షురాలిగా వేయించుకున్నారు. మొన్న ఒక ఇంటర్వ్యూలో కాంగ్రెస్ ప్రముఖ నాయకుని సలహా మేరకే చంద్రబాబును కలిశానని ప్రశాంత్ కిశోర్ చెప్పిన సంగతి సోషల్ మీడియా చూసేవారికి గుర్తుండే ఉంటుంది. సదరు ప్రముఖ నాయకుడి పేరు డీకే శివకుమార్. 2018 కర్ణాటక ఎన్నికల్లో డబ్బు సాయం చేసినప్పటి నుంచి డీకేకూ, చంద్రబాబుకూ దోస్తీ కుదిరింది. ఆ దోస్త్ ద్వారా రాయబారం నడిపి, షర్మిలను ఇక్కడికి డిప్యుటేషన్ వేయించుకున్నాడని కాంగ్రెస్ వర్గాల భోగట్టా. దీన్నే చావు తెలివితేటలంటారు. ప్రభుత్వ అనుకూల వోటును ఎంతోకొంత చీల్చడం కోసం కాంగ్రెస్ కొంపను బాబు అద్దెకు తీసుకున్నారు. నెగిటివ్ ఓటును చీల్చడం సాధ్యమవుతుందేమో గానీ పాజిటివ్ ఓటును చీల్చలేమన్న కనీస అవగాహన అనుభవజ్ఞుడైన బాబుకు లేకపోవడం ఒక విషాదం.

ఒకే ఒక్కడు సిద్ధం! 'జో జీతా వోహీ సికిందర్' అంటారు. తాను సిద్ధమేనని సికిందర్ ప్రకటించారు. సాగర తీరంలో ఆయన చేసిన రణగర్జనకు జన ప్రభంజన ఘోష ప్రతిధ్వని పలికింది. ఏమా జనం? లక్షలాది నింగి చుక్కలు ఒక్కచోటనే రాలిపడ్డట్టు లేదూ! బీదాబిక్కీ జనం, బడుగు బలహీనవర్గాల ప్రజలే వారంతా! తమ జీవితాలకు గొడుగు పట్టిన జగన్‌మోహన్‌రెడ్డి జైత్రయాత్రకు తాము సైతం అన్నట్టుగా తరలివచ్చారు. యుద్ధానికి సిద్ధమంటూ నాయకుని గొంతుతో వారంతా శ్రుతి కలిపారు. జన హోరుపై గౌరవంతో సముద్రుడు తన కెరటాలను అవనతం చేశాడేమో! జన సాగర సందడిలో అలల చప్పుడు వినిపించలేదు.

ఏపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు సిద్ధమయ్యారు సరే! మరి ప్రత్యర్థుల సంగతి? ఆ ప్రత్యర్థి ఏకవచనమా? బహువచనమా అనే సందేహం అవసరం లేదు. బహువచనంగా కనిపించే ఏకవచనం. చంద్రబాబు బహురూపి. ఒక రూపం నుంచి మరో రూపంలోకి పాదరసంలా ప్రవహించగల నేర్పరి. పాదరసం ఒక లోహం. కానీ సాధారణ పరిస్థితుల్లో ద్రవ రూపంలో కనిపిస్తుంది. ఈయనా అంతే – ద్రవరూపంలో కనిపించే ఒక లోహ విశేషం. ఈ ఎన్నికల కోసం ఆయన ఇప్పటికే ఆరు రూపాల్లోకి ప్రవహించారు. ఇందులో కొన్ని పాత రూపాలే. కొన్ని కొత్తవి. ఆరు ముఖాల వాడిని సంస్కృతంలో షణ్ముఖం అంటారు. తమిళ సంప్రదాయంలో ఆర్ముగం అంటారు. ఇప్పుడు మన ఆర్ముగం చంద్రబాబు ఆరు ముఖాలతో ఆరు శిబిరాలను తన కోసం సన్నద్ధం చేసుకున్నారు.

ఇందులో మొదటి ముఖం తనదైతే, రెండోది యెల్లో మీడియా లీడర్ రామోజీది. వీరిద్దరు సియామీ కవలలు. ఇద్దరిలో ఎవరిది ఒకటో నెంబరో తేల్చడం కష్టం. పొలిటికల్ ఫేస్ కనుక బాబునే ఒకటి అనుకుందాం. ఇక మూడో ముఖం జగమెరిగిన జనసేనాధిపతి. తన కోవర్టుల సాయంతో కబ్జా చేసిన బీజేపీ రాష్ట్ర శాఖ నాలుగో ముఖం. తాను కొనుగోలు చేసిన రాష్ట్ర కాంగ్రెస్ యూనిట్ ఐదో ముఖం. ఈ సిక్ యూనిట్‌ను 'కొనుగోలు' చేసినందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహకర్త 'కనుగోలు' సేవలు ఉచితంగా లభిస్తాయట! ఇక సందర్భాన్ని బట్టి తనకు ఉపయోగపడే పనులు చేసిపెడుతూ, అప్రకటిత ఓఎస్‌డీగా పనిచేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర శాఖ ఆరో ముఖం. ఇందులో ఎవరికి నిర్దేశించిన పాత్రను వారు పోషిస్తూ చంద్రబాబుకు తోడ్పాటునందిస్తుంటారు.

జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రెండో రోజు నుంచే చంద్రబాబు, యెల్లో మీడియాలు తదుపరి ఎన్నికలకు సన్నాహాలు ప్రారంభించాయి. అప్పటి నుంచే జగన్ సర్కార్‌పై యెల్లో మీడియాలో దుమ్మెత్తి పోయడం ప్రారంభించారు. కాకపోతే ఆరు శిబిరాలను సమయాత్తం చేసి ఆరు ముఖోటాలను తగిలించడానికి ఇంత సమయం పట్టింది. ఇప్పుడు షణ్ముఖ కూటమి సిద్ధమైంది. షడ్యంత్రం కూడా ఎప్పుడో సిద్ధమైంది. ఆరు రకాల మాయోపాయాలను ఉపయోగించి నడిపే కుట్రను 'షడ్యంత్రం' అని పూర్వం అనేవారు. శాస్త్ర ప్రకారం చేసే కుతంత్రమన్నమాట. మన ఆర్ముగం మాస్టారు ఆరు రకాలేం ఖర్మ... అరవై రకాల మాయోపాయాలను ఏకకాలంలో ప్రయోగించగల నేర్పరి.

కీలకమైన ఆరు మాయలను చెప్పాల్సి వస్తే దాంట్లో మొదటిది మోసం లేదా వెన్నుపోటు లేదా నమ్మకద్రోహం. గూగుల్ ఇమేజెస్‌లో వెన్నుపోటు అనే అక్షరాలు టైప్ చేస్తే వచ్చే బొమ్మల్లో 90 శాతానికి పైగా చంద్రబాబు బొమ్మలే కనిపిస్తాయి. అకడమిక్ ఆసక్తి ఉన్నవారెవరైనా పరీక్షించి చూసుకోవచ్చు. వెన్నుపోటు కేటగిరీలో బాబు, యెల్లో మీడియాలు యూనివర్సల్ పేటెంట్ హోల్డర్లు. మిగిలిన నాలుగు ముఖాలకు కూడా తరతమ భేదాలతో ఈ లక్షణం ఉన్నది. మాయోపాయాల్లో రెండోది – దుష్ప్రచారం లేదా గోబెల్స్ ప్రచారం. తప్పుడు ప్రచారాలకు ఆదిగురువుగా పేరొందిన గోబెల్స్ మహాశయుడు ఇప్పుడు కనుక బతికి వుంటే యెల్లో మీడియా బడిలో మరోసారి ఓనమాలు దిద్దుకునేవాడు. యెల్లోమీడియా ఘనత ఈ రంగంలో దిగంతాలకు వ్యాపించింది.

మూడో మాయోపాయం – అవకాశవాద పొత్తులు. నాలుగోది – వ్యవస్థలను దురుపయోగపరచడం. ఐదవది – పారదర్శకత లేమి. ఆరవది – గోముఖ వ్యాఘ్రంలా పెత్తందారీవర్గ స్వభావాన్ని దాచిపెట్టడం. ఈ ఆరు లక్షణాల్లో చంద్రబాబుకు, యెల్లో మీడియాకు ఉన్న ప్రావీణ్యతను గురించి కొత్తగా చెప్పనవసరం లేదు. వీరు కూడగట్టుకున్న కొత్త మిత్రులందరిలోనూ ఈ లక్షణాలు అంతో ఇంతో కనిపిస్తాయి. జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీ పెట్టిన పదేళ్లలో విశ్వసనీయతను పూర్తిగా కోల్పోయారు. ఆయనకొక సైద్ధాంతిక నిబద్ధత లేదని పలుమార్లు రుజువైంది. మాట నిలకడ లేదని కూడా ఆయన పదేపదే నిరూపించుకుంటున్నారు. ఒక నమ్మదగిన నాయకుడుగా స్థిరపడలేకపోయాడు. చంద్రబాబు ప్రయోజనాలు తప్ప ఆయనకంటూ సొంత ఎజెండా ఏమీ లేదని ప్రతి సందర్భంలోనూ రుజువు చేసుకుంటున్నారు. కాపు సామాజిక వర్గంలో మెజారిటీ ప్రజలు తెలుగుదేశం పార్టీ పట్ల విముఖత ప్రదర్శిస్తారు. అదొక సహజ వ్యతిరేకత. అందువల్ల ఆ వర్గానికి చెందిన పవన్ కల్యాణ్ నాయకత్వంలో ఓ వేదికను ఏర్పాటు చేసి దాని ద్వారా ఆ ఓట్లు పరోక్షంగా తనకు లభించేట్టుగా పన్నిన కుతంత్రమేనని ఇప్పటికే ప్రజలకు అర్థమైంది. ఈ ప్రయత్నం ఫలించే అవకాశం లేదు. చంద్రబాబుతో పాటు పవన్ కల్యాణ్ వేదిక కూడా కూలిపోయే అవకాశమే ఎక్కువ.

పవన్ కల్యాణ్ పార్టీని ఎన్డీఏ కూటమిలో చేర్పించడం కూడా చంద్రబాబు వ్యూహమేనని తెలియని వారెవరూ రాష్ట్రంలో లేరు. తన పార్టీ ఎంపీలను, పైరవీకార్లను కూడా బీజేపీలో చేర్పించింది చంద్రబాబేనన్న సంగతి జగమెరిగిన సత్యమే. పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగితే మాత్రం లోకానికి నిజం తెలియకుండా ఉంటుందా? గడిచిన ఎన్నికల్లో జరిగిన దారుణ పరాభవంతో బాబుకు జ్ఞానోదయమైంది. రాష్ట్రంలో యాభై శాతం ఓట్లను అప్పటికే స్థిరపరచుకున్న జగన్‌తో పోరాడాలంటే తన బలం సరిపోదనీ మిగిలిన అన్ని పార్టీల నుంచి రకరకాల పద్ధతుల్లో మద్దతు స్వీకరించాలనీ ఆయనకు అర్థమైంది. అవకాశవాద పొత్తులు మాత్రమే కాదు, జగన్ అనుకూల ఓటర్లలో కూడా ఏదో ఒకరకంగా కోత పెట్టాలి. ఈ రకంగా సాగిన ఆలోచనల్లోంచే ఈ షణ్ముఖ కూటమి పుట్టింది.

బీజేపీలో చేరిన బాబు కోవర్టులు, బీజేపీ భాగస్వామిగా చేరిన పవన్ కల్యాణ్‌ల ప్రయత్నాలతో పాటు తన పాత పరిచయాలతో చేసిన లాబీయింగ్ ఫలితంగా బీజేపీ రాష్ట్రశాఖకు బాబు వదినమ్మ అధ్యక్షురాలిగా వచ్చారు. వర్గ ప్రయోజనాల రక్షణ కోసం ఆ వదినమ్మ బాబుకు అండగా నిలబడుతున్నారు. ఫలితంగా రాష్ట్ర బీజేపీని ఒక ఫ్రాంచైజీగా చంద్రబాబు మార్చేసుకున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. దానితోపాటు ఈగలు తోలుకుంటున్న రాష్ట్ర కాంగ్రెస్ దుకాణాన్ని కూడా తెరిపించి అద్దె చెల్లిస్తున్నారు. దానికి షర్మిలను అధ్యక్షురాలిగా వేయించుకున్నారు. మొన్న ఒక ఇంటర్వ్యూలో కాంగ్రెస్ ప్రముఖ నాయకుని సలహా మేరకే చంద్రబాబును కలిశానని ప్రశాంత్ కిశోర్ చెప్పిన సంగతి సోషల్ మీడియా చూసేవారికి గుర్తుండే ఉంటుంది. సదరు ప్రముఖ నాయకుడి పేరు డీకే శివకుమార్. 2018 కర్ణాటక ఎన్నికల్లో డబ్బు సాయం చేసినప్పటి నుంచి డీకేకూ, చంద్రబాబుకూ దోస్తీ కుదిరింది. ఆ దోస్త్ ద్వారా రాయబారం నడిపి, షర్మిలను ఇక్కడికి డిప్యుటేషన్ వేయించుకున్నాడని కాంగ్రెస్ వర్గాల భోగట్టా..

దీన్నే చావు తెలివితేటలంటారు. ప్రభుత్వ అనుకూల వోటును ఎంతోకొంత చీల్చడం కోసం కాంగ్రెస్ కొంపను బాబు అద్దెకు తీసుకున్నారు. నెగిటివ్ ఓటును చీల్చడం సాధ్యమవుతుందేమోగానీ పాజిటివ్ ఓటును చీల్చలేమన్న కనీస అవగాహన అనుభవజ్ఞుడైన బాబుకు లేకపోవడం ఒక విషాదం. విశ్వసనీయతను కోల్పోవడంలో పవన్ కల్యాణ్ కంటే పదిరెట్ల వేగాన్ని షర్మిల ప్రదర్శించారు. వివిధ సందర్భాల్లో ఒకే అంశంపై ఆమె వ్యక్తం చేసిన విరుద్ధ అభిప్రాయాలు వింటే చాలు, ఆమెకు ఏ రకమైన రాజకీయ నిబద్ధతా లేదనే విషయం ఎవరికైనా అర్థమవుతుంది. ఈ ఎన్నికల్లో ఆమె పార్టీ ఏమాత్రం ప్రభావం చూపే అవకాశం లేకపోయినా చంద్రబాబు పడుతున్న పాట్లను వివరించడానికే ఈ ప్రస్తావన! అంతకన్నా ప్రాధాన్యత లేదు. సీపీఐ వ్యవహారం కూడా ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. అదొకప్పుడు పేదల ఇళ్లస్థలాల కోసం పోరాడిన పార్టీ. ఇప్పుడు జగన్ ప్రభుత్వం 30 లక్షల మంది మహిళలకు ఇళ్లు కట్టిస్తుంటే టీడీపీ పలురకాలుగా అడ్డుపడింది. ఆ పార్టీకి సీపీఐ వంతపాడటం విచిత్రం. ఈ అయిదేళ్లలో ఇటువంటి ఉదాహరణలు కోకొల్లలు.

జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఈ షణ్ముఖ కూటమి ఆపసోపాలు పడుతున్నది. ఆయన చేసిందేమిటి? ఆయన ఎటువంటి వ్యక్తి! ఏడున్నర దశాబ్దాల భారత రాజకీయ చరిత్రలో ఏ నాయకుడి మీద జరగనంత దుష్ప్రచారాన్ని జగన్ మీదా యెల్లో మీడియా సాగించింది. వ్యక్తిత్వ హననానికి ఉండవలసిన హద్దులన్నీ చెరిపేసి బర్బర మనస్తత్వాన్ని ప్రదర్శించింది. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్రంలోని ప్రతిపక్షం కుమ్మక్కయి ఒకే ఒక్క యువకుడిని వేధించడం, రాజకీయ అంకురాన్ని మొలకెత్తకుండా కేసులు పెట్టడం, పదహారు నెలలు జైల్లో ఉంచడం ప్రపంచంలోనే ఎక్కడా జరగలేదు. అవి తప్పుడు కేసులనీ, రాజకీయ కేసులనీ అర్థం కావడానికి మనిషికి కామన్ సెన్స్ ఉంటే చాలు. జగన్‌మోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లోనే ఉంటే ముఖ్యమంత్రిని చేసేవాళ్లమని గులామ్‌నబీ ఆజాద్ ఒక బహిరంగ సభలోనే చెప్పారు. ఆయన అప్పట్లో సోనియా గాంధీ కోటరీలోని ముఖ్యవ్యక్తి.

ముఖ్యమంత్రిని చేయనందుకే ఆయన కాంగ్రెస్ నుంచి వెళ్లిపోయారని అప్పట్లోనే దుష్ప్రచారాన్ని సృష్టించారు. తనను ముఖ్యమంత్రి చేయాలని ఆయన సంతకాలు సేకరించారని ఓ అభాండం వేశారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న యువకుడిపై ఇటువంటి అమానవీయ దాడి చేయడానికి ఎంత బరితెగింపు ఉండాలి. ఆయనకు సంతకాల సేకరణతో ఎటువంటి సంబంధం లేదని అప్పట్లోనే పలువురు కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. తాజాగా తెలంగాణ ఎన్నికలకు ముందు ఓ ఇంటర్వ్యూలో భట్టి విక్రమార్క కూడా ఈ ఆరోపణను నిర్ద్వంద్వంగా ఖండించారు. రోశయ్యను లెజిస్లేచర్ పార్టీ నాయకుడిగా నిండు పేరోలగంలో ప్రతిపాదించిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డే అనే సత్యాన్ని దాచేస్తే దాగుతుందా!

ఆయన కాంగ్రెస్ పార్టీని వదిలి వెళ్లాల్సి వచ్చింది మాట కోసం. ప్రజలకిచ్చిన ఒక్క మాట కోసం! తన తండ్రి మరణ వార్తను తట్టుకోలేక ఉమ్మడి రాష్ట్రంలో వందలాదిమంది గుండె పగిలి చనిపోయారు. ఈ ఉదంతం అప్పటికి ముప్పయ్యారేళ్ల వయసున్న జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా కలచివేసింది. ఆ కుటుంబాల సభ్యులను వారి ఇళ్ల వద్దకు వెళ్లి ఓదార్చుతానని నిండు సభలో ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకత్వం అడ్డుకున్నది. ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండలేని రాజకీయ జీవితం ఎందుకన్న ప్రశ్నను ఆయన వేసుకున్నారు. 'పదవులూ, అధికారాల కంటే మాట నిలబెట్టుకోవడమే నాకు ముఖ్యమ'ని ఓదార్పు యాత్రను ప్రారంభించారు. కష్టాల పాలవుతావని నాయకత్వం హెచ్చరించింది. ఖాతరు చేయకుండా ముందడుగు వేశాడు. ఫలితంగా పదేళ్లపాటు కష్టాలు కడగండ్లతో కూడిన కడలిని ఈదవలసి వచ్చింది. అగ్ని సరస్సున వికసించిన వజ్రంలా రాటుదేలి ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చున్నాడు.

పదేళ్లలో ఏర్పడిన కోట్లాది ప్రజల సాంగత్యం ఆయననొక తాత్వికునిగా, రాజనీతిజ్ఞునిగా, పాలనాదక్షునిగా తీర్చిదిద్దింది. షడ్ యంత్రాన్ని తిప్పికొట్టగల ఆరు అద్భుతమైన లక్షణాలు ఆయన అయిదేళ్ల పాలనలోంచి మనం గ్రహించవచ్చు. విశ్వసనీయత, పారదర్శకత, దార్శనికత, బహుజన పక్షపాతం, పాలనా దక్షత, మెరుగైన విద్య – ఆరోగ్యాలతో కూడిన ఉన్నత సమాజ నిర్మాణం. ఈ లక్షణాలు ఫలితాలివ్వడం ప్రారంభమైంది. అందుకే ఆయనలో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతున్నది. నిన్నటి భీమిలి సభలో అదే ఆత్మవిశ్వాసం సమర శంఖం పూరించింది. 'వైనాట్ 175?' అని ఆ విజయశంఖం ప్రశ్నించింది. 'యుద్ధానికి నేను సిద్ధం, మీరు సిద్ధమా?' అని ఆ సింహనాదం ప్రశ్నించింది. సిద్ధం.. సిద్ధం.. సిద్ధం – లక్షలాది గళాల్లో ఓ తారకమంత్రం మార్మోగింది. మరో అద్భుతమైన విజయానికి రంగం సిద్ధమైంది.

vardhelli1959@gmail.com

మూలాల అన్వేషణలో వరదకు ఎదురీత

అభిప్రాయం




వాడ్రేవు చినవీరభద్రుడు


కల్లూరి భాస్కరం రచించిన 'ఇవీ మన మూలాలు' అనే పుస్తకం ఒక మల్టి-డిసిప్లినరీ అధ్యయనం. మానవుడికి సంబంధించిన ఒక సుదీర్ఘమైన కథని ఎంతో ఉత్కంఠభరితంగా చెప్తున్న రచన ఇది. ఇటువంటి కృషి ఒక్క మనిషి ఒంటి చేత్తో చెయ్యగలిగేది కాదు. ఏదైనా ఒక విశ్వ విద్యాలయమో లేదా ఒక శాస్త్రవేత్తల బృందమో మాత్రమే చెయ్యగల పని.

మానవ చరిత్ర దశాబ్దాల లెక్కకో, చివరికి శతాబ్దాల లెక్కకో కుదించగలిగేది కాదు. అది సహస్రాబ్దాల లెక్కలో అర్థం చేసుకోవలసింది. మనం ఈ రోజు అట్లాసులో చూస్తున్న ఈ ఖండాలు ఎల్లప్పుడూ ఇలానే లేవనీ, ఈ దేశాలూ, ఈ సరిహద్దులూ ఎప్పటికప్పుడు మారుతూనే ఉన్నాయనీ, ఈ రోజు భారతదేశంతో సహా ఎన్నో జాతీయరాజ్యాలు భావిస్తున్నట్టుగా వాటి జాతి చరిత్ర అవి గీసుకున్న సరిహద్దులకే పరిమితం కాలేదనీ, నిజానికి మనం కట్టుకుంటున్న గోడలేవీ ఒకప్పుడిలా లేవనీ, ఇప్పుడు కూడా ఈ గోడలు ఇలానే శాశ్వతంగా నిలబడిపోయేవి కావనీ మనం గ్రహించవలసి ఉంటుంది.

మన్వంతరాల చరిత్రలో మానవుడు ఈ వసుధ మొత్తాన్ని ఏక కుటుంబంగా భావించాడనీ, ఎక్కడో సుదూర ప్రాంతానికి చెందిన మానవ సమూహాలు మరెక్కడో సుదూర ప్రాంతానికి పోయి అక్కడ నాగరికతలు నిర్మించాయనీ ఈ రోజు ఎన్నో ఆనవాళ్ళు లభిస్తున్నాయి. ప్రపంచంలో ఏ ఒక్క దేశం కూడా తన సంస్కృతి, తన సాహిత్యం, తన సాంకేతికత పూర్తిగా తన ఘనత మాత్రమే అనుకోడానికి లేదనీ, మానవుడు ఏ దేశంలో ఉన్నా అతడు సాధించిన ప్రతి విజయంలోనూ ప్రపంచ మానవులందరి పాత్రా ఉందని మనం ఒప్పుకోవలసి ఉంటుంది.

ఇదే మాట మన జన్యు వారసత్వం గురించి కూడా చెప్పుకోక తప్పదు. ఇప్పుడు ఈ నేల మీద నడయాడుతున్న ప్రతి ఒక్క మానవుడూ, ఇంతదాకా ఈ పృథ్వి మీద సంచరించిన ప్రతి ఒక్క మానవుడికీ జన్యుపరంగా వారసుడేనన్నది ఒక వైజ్ఞానిక సత్యం.





ఇంత కొట్టొచ్చినట్టుగా మన ముందు బయటపడుతున్న మానవుడి గతాన్ని చూడటానికి ఇష్టపడకుండా, ఇంకా శుద్ధ జాతులూ, శుద్ధరక్తమూ, శుద్ధ సంస్కృతీ ఉంటాయనుకోవడం సాంస్కృతిక అంధత్వం మాత్రమే!

ఇటువంటి గుడ్డితనం ఎవరో ఒకరిద్దరు వ్యక్తులకి ఉండటం వేరు, ఒక జాతి అత్యధికభాగం ఇటువంటి కథనాల్ని చెప్పుకుంటూ తనని తాను నమ్మించుకోడం వేరు. ఇది అత్యంత ప్రమాదకరమైన పరిస్థితి. తాను బలపడుతున్నానుకుంటూ నిజానికి ఒక జాతి దుర్బలమైపోతున్న ప్రక్రియ ఇది. ఈ నేపథ్యంలో భాస్కరం గారి పుస్తకాన్ని మనం అర్థం చేసుకోవలసి ఉంటుంది.

జాతీయోద్యమ నాయకులు భారతదేశ చరిత్రలో ప్రతి ఒక్కరి పాత్రనీ గుర్తించారు. కానీ కొత్త జాతీయవాదులు అటువంటి విశాల దృక్పథాన్ని స్వాగతించరు సరికదా, అటువంటి విస్తృత దృక్పథాన్ని సహించలేరు కూడా. తమ అసహనాన్ని ప్రకటించడానికి వారికున్న అనేక సాధనాల్లో కృత్రిమ కథనాల్ని ప్రచారం చేయడం కూడా ఒకటి. ముఖ్యంగా భారతదేశ చరిత్ర గురించి వాళ్ళు శాస్త్రీయ దృక్పథానికి బదులు పౌరాణిక దృక్పథాన్ని ప్రచారం చేస్తారు. ప్రజల్ని ఉద్రిక్తుల్ని చేయడానికి వాస్తవం కన్నా కల్పనది దగ్గరి దారి అని వాళ్ళ నమ్మకం. సరిగ్గా ఈ వరదకు ఎదురీదుతూ భాస్కరం గారు ఈ పుస్తకం రాశారని చెప్పవచ్చు. ఇది సాహసమే కాని ఎంతో అవసరం. ఆయనిలా అంటున్నారు:

'ఒక్కోసారి రాజకీయం తన హద్దును, తూకాన్ని దాటిపోయి సంస్కృతి, సాహిత్యం, శాస్త్రవిజ్ఞానం తదితర జ్ఞాన రంగాలను కూడా తన పరిధిలోకి తెచ్చేసుకుని, రాజకీయాన్నీ వాటినీ కలగాపులగం చేసి సర్వం తానే అవడానికి ప్రయత్నిస్తూ ఉంటుంది. రాజకీయానికి సమాంతరంగా జ్ఞానరంగానికి ఉన్న ప్రాముఖ్యాన్నీ, దాని స్వేచ్ఛా స్వాతంత్ర్యాల్నీ గుర్తించి దాని ఉనికిని ఎప్పటికప్పుడు పటిష్ఠం చేసుకోవడమే రాజకీయ స్వైరవిహారానికి విరుగుడు.' ఈ రచన సత్యాన్వేషణ దృష్టితో చేసిన కృషి. ఇందుకు గాను భాస్కరంగారు ఆధునిక, సమకాలిక జన్యుశాస్త్ర పరిశోధనల్ని తన ముడిసరుకుగా తీసుకున్నారు. ఎందుకంటే ఆయనే ఒక చోట రాసినట్టుగా 'జనశాస్త్రమంటే జన్యుశాస్త్రమే.'

ఒక ప్రాంతం నుంచి వలసపోయినవాళ్ళో లేదా అక్కడికి వలస వచ్చినవాళ్ళో మాత్రమే అక్కడి చరిత్రని నిర్మించారని భాస్కరం గారు ఈ రచనలో ఎక్కడా రాయలేదు. ఆయన చెప్తున్నదల్లా ఏమిటంటే, ఏ దేశ చరిత్రనైనా కేవలం ఆ దేశీయులు మాత్రమే నిర్మించారనుకోకండి, అది బహుళ జాతుల సంస్కృతుల ఆదాన ప్రదానాలతో నిరంతరం సంభవిస్తూండే ఒక ప్రక్రియ అని మాత్రమే. అలాగే, శుద్ధమైన జాతి అంటూ ఏదీ లేదనీ, అలా ఉంటుందనుకుని తమ దేశం చుట్టూ సాంస్కృతికంగా గోడలు కట్టుకోవడం మూర్ఖత్వం మాత్రమే కాదు, ప్రమాదకరమని కూడా ఆయన చెప్తున్నారు.

ముందే చెప్పినట్టుగా ఇదొక మల్టీ డిసిప్లినరీ అధ్యయనం. ఇందులో జన్యుశాస్త్ర పరిశీలనలతో పాటు, పురావస్తు, మానవ శాస్త్ర పరిశీలనలతో పాటు, తులనాత్మక భాషాశాస్త్రం, మైథాలజీ, వేద, పురాణ, ఇతిహాసాల పరిశీలనలతో పాటు, సంస్కృత, తెలుగు సాహిత్యాల నుంచి కూడా ప్రస్తావనలు ఉన్నాయి. ఈ ఒక్క గ్రంథం చదివితే ఎన్నో గ్రంథాలు చదివినట్టు! ఈ అధ్యయనంలో భాస్కరంగారు ఎన్నో హైపోథీసిసులు మనముందుంచడమేకాక, మన సంస్కృతి, చరిత్రలకు సంబంధించిన ఎన్నో చిక్కుముళ్ళు విడి పోవడానికి అవసరమైన తాళంచెవులు కూడా ఈ పుస్తకంలో పొందుపరిచారు.

ఒకటి, ఆయన స్వయంగా పండిత కుటుంబం నుంచి వచ్చిన వారు కావడంవల్లా, భారతీయ సంస్కృతికి మూలగ్రంథాలు అని చెప్పదగ్గవాటిని క్షుణ్ణంగా అధ్యయనం చేసినందువల్లా ఇది సాధ్యపడిందని చెప్పవచ్చు. రెండోది– ఏళ్ళ తరబడి ఆయన ఎంతో సమర్థవంతంగా నిర్వహించిన పాత్రికేయ వృత్తి ఆయనకు సమకాలిక ప్రపంచం గురించీ, భారతీయ సామాజిక పరివర్తన గురించీ ప్రత్యక్ష పరిజ్ఞానాన్ని అందించడం మరో కారణం.

('ఇవీ మన మూలాలు'కు రాసిన ముందుమాట నుంచి)

వ్యాసకర్త కవి, రచయిత

(ఈ రోజు సాయంత్రం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో 'ఇవీ మన మూలాలు' పుస్తక ఆవిష్కరణ)

మళ్లీ అసైన్డ్ చర్చ

▶ మొదటి పేజీ తరువాయి

భూముల బదలాయింపు నిషేధ చట్టం (పీవోటీ) తెచ్చారు. దీనిప్రకారం భూమి పొందిన వ్యక్తి ఆ భూమిని ఇతరులకు విక్రయించకూడదు. కౌలుకు ఇవ్వకూడదు. దానం ఇవ్వకూడదు. వారసత్వంగా అనుభవించే హక్కులు మాత్రమే ఉంటాయి. మాజీ సైనికులైతే పదేళ్ల తర్వాత అమ్ముకోవచ్చు. రాజకీయ బాధితుల కేటగిరీలో లేదంటే మార్కెట్ ధర చెల్లించిన తర్వాత అసైన్ చేస్తే మాత్రం వెంటనే అమ్ముకునే హక్కులుంటాయి. ప్రభుత్వం ఉచితంగా అసైన్ చేసిన భూమిని మాత్రం అమ్ముకునే అవకాశం ఉండదు.

పలు రాష్ట్రాల్లో ఇలా....

అసైన్డ్ భూములపై హక్కుల కల్పనపై దక్షిణాదిలోని పలు రాష్ట్రాలు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నాయి. అసైన్ చేసిన తర్వాత 20 ఏళ్లు దాటితే వాటిపై అసైనీలకు యాజమాన్య హక్కులు కల్పిస్తూ ఇటీవల ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర మంత్రి ధర్మాన ప్రసాదరావు నేతృత్వంలోని కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇక, కర్ణాటకలో అసైన్ చేసిన 15, తమిళనాడులో 20, కేరళలో 25, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లో పదేళ్లకు యాజమాన్య హక్కులు కల్పించారని రైతు ప్రతినిధులు చెబుతున్నారు. ఇక, ఏపీ తరహాలో తెలంగాణలోనూ ఈ తరహా కమిటీ ఏర్పాటు చేస్తామని, ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలతో నియమించిన కమిటీ ఇచ్చిన సిఫారసుల మేరకు అసైన్డ్ భూములపై పేదలకు హక్కులు కల్పిస్తామని గత ప్రభుత్వంపలుమార్లు అసెంబ్లీ సాక్షిగా ప్రకటనలు చేసినా కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ఈ అంశాన్ని చేర్చడం, ఆ పార్టీ అధికారంలోకి రావడంతో అసైన్డ్ రైతుల్లో ఆశలు చిగురుస్తున్నాయి.

భిన్నాభిప్రాయాలున్నా...

అసైన్డ్ భూములపై రైతులకు యాజమాన్య హక్కులు కల్పించే విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. తెలంగాణ ఏర్పాటైన తర్వాత భూముల ధరలు అమాంతం పెరిగిన నేపథ్యంలో సదరు పేదలకు హక్కులు ఇవ్వడం ద్వారా వారికి ఆర్థిక ఆసరా కలుగుతుందని, ఇతరులపై ఆధారపడకుండానే ఆ కుటుంబాలు ఆర్థికంగా స్థిరపడతాయనే భావనతోనే ఈ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. అయితే, ఇలా చేస్తే ఎక్కువ శాతం ఎస్సీ, ఎస్టీల చేతుల్లో ఉన్న ఈ భూములు అన్యాక్రాంతమవుతాయని, ఆయా వర్గాల చేతుల్లో ఉండే భూకమతాల సంఖ్య తగ్గిపోతుందని దళిత సంఘాలు వాదిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలతో కమిటీ ఏర్పాటు చేయడం ద్వారా అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకుని, కమిటీ సిఫారసుల మేరకు నిర్ణయం తీసుకోవడం మేలనే అభిప్రాయం కూడా ఉంది.

అసెంబ్లీ సమావేశాల్లో సవరణ చేయాలి

రైతుకు అసైన్ చేసిన 20 ఏళ్ల తర్వాతైనా శాశ్వత హక్కులు కల్పించాలి. తద్వారా రాష్ట్రంలోని 15 లక్షలకు పైగా కుటుంబాలకు ఆర్థిక, సామాజిక భరోసా లభిస్తుంది. ఇందుకోసం పీవోటీ చట్టం-1977కి సవరణ చేయాల్సి ఉంటుంది. రానున్న బడ్జెట్ సమావేశాల్లో ఈ బిల్లును అసెంబ్లీలో పెట్టి దశాబ్దాల తెలంగాణ రైతాంగ కలను సాకారం చేయాలి.

–మన్నె నర్సింహారెడ్డి,
అసైన్డ్ భూముల శాశ్వత హక్కుల సాధన సమితి

రాష్ట్రంలో భూసంస్కరణల అమలుతో ఇప్పటివరకు హక్కులు కల్పించిన భూములు

కార్యక్రమం	లబ్ధిదారుల సంఖ్య	విస్తీర్ణం (ఎకరాల్లో)
ఇనాం రద్దు	1,18,132	5,89,134
కౌలు చట్టం (38ఈ)	1,06,965	5,95,280
భూదాన ఉద్యమం	36,236	99,155
సీలింగ్ మిగులు భూములు	1,85,202	3,14,981
భూమి కొనుగోలు	37,018	53,553
అటవీ హక్కులు	93,494	3,00,092
ప్రభుత్వ భూముల పంపిణీ	12,34,552	16,56,150
సాదా బైనామాల క్రమబద్ధీకరణ	6,18,369	8,65,000
మొత్తం	24,29,968	44,73,345



మేడారం జాతర పోస్టర్ ఆవిష్కరణ

మేడారం మహాజాతర పోస్టర్‌ను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శనివారం సచివాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.
– సాక్షి, హైదరాబాద్

పాలమూరు మున్సిపల్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరు మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్ చైర్మన్ తాటి గణేశ్‌కుమార్‌లపై కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. 35 మంది కౌన్సిలర్లతోపాటు ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలికారు. ఈ మున్సిపాలిటీలో మొత్తం 49వార్డులు ఉన్నాయి. శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో కలెక్టర్ జి.రవినాయక్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ నుంచి 27 మంది, కాంగ్రెస్ నుంచి ఐదుగురు, బీజేపీ నుంచి ముగ్గురు (మొత్తం 35 మంది) హాజరై అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటేశారు. బీఆర్ఎస్‌కు చెందిన మరో 14 మంది కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు.

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- అధికార ప్రతినిధులకు ఏఐసీసీ మీడియా ఇన్‌చార్జి సుజాత పాల్ సూచన

సాక్షి, హైదరాబాద్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాల్లో గెలుపే లక్ష్యంగా అధికార ప్రతినిధులు పనిచేయాలని ఏఐసీసీ మీడియా ఇన్‌చార్జి సుజాతపాల్ అన్నారు. హైదరాబాద్‌లో కాకుండా నియోజకవర్గాల్లో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. శనివారం గాంధీభవన్‌లో జరిగిన టీపీసీసీ అధికార ప్రతినిధుల సమావేశంలో సుజాత పాల్ మాట్లాడారు. 10 మంది అధికార ప్రతినిధులు గాంధీభవన్‌కు అందుబాటులో ఉండి ప్రభుత్వ, పార్టీ వాణిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.



కొండప్పకు గవర్నర్ అభినందన

నారాయణపేట జిల్లా దామరగిద్దకు చెందిన బుర్రవీణ వాయిద్యకారుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత దాసరి కొండప్పను శనివారం రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ హైదరాబాద్‌లో సన్మానించారు. గ్రామీణకళకు జీవంపోస్తున్న కొండప్పను ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వం ద్వారా సహాయసహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.
– దామరగిద్ద(నారాయణపేట)

ఖమ్మం డీసీసీబీ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం!

- కోర్టు ఆదేశాలతో ఫలితాల వెల్లడి నిలిపివేత

రఘునాథపాలెం: ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) చైర్మన్ కూరాకుల నాగభూషణంపై రఘునాథపాలెం మండల వీవీ పాలెం సహకార సంఘంలో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఆయన వీవీ పాలెం సొసైటీ చైర్మన్‌గా ఉంటూ, డీసీసీబీకి ఎంపికయ్యారు. వీవీ పాలెం సొసైటీలోని 13 డైరెక్టర్లకుగాను 11 మంది ఆయనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతూ గతంలోనే లేఖ ఇచ్చారు. దీనిపై శనివారం జిల్లా సహకార అధికారి విజయకుమారి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటుచేయగా.. ఆ 11 మంది డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటేశారు. దీనితో నాగభూషణం వీవీ పాలెం సొసైటీ, డీసీసీబీ చైర్మన్ పదవులను కోల్పోయే అవకాశముంది. అయితే అవిశ్వాసం విషయంలో నాగభూషణం కోర్టును ఆశ్రయించడంతో.. ఫలితం వెల్లడించకుండా స్టే విధించినట్టు తెలిసింది. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఈనెల 30వ తేదీ తర్వాత ఫలితాలను ప్రకటించనున్నట్టు సమాచారం.

సాగర విలాసం



ఆదివారం తొలి ప్రయాణానికి పూర్తిస్థాయిలో ముస్తాబైన ప్రపంచంలోకెల్లా అతి పెద్ద విలాస నౌక ఐకాన్ ఆఫ్‌ద సీస్

ప్రపంచంలోకెల్లా అతి పెద్ద నౌక

- 365 మీటర్లు, 2.5 లక్షల టన్నులు!
- ఏకంగా 10 వేల మంది సామర్థ్యం
- 20 అంతస్తులు, 40 రెస్టారెంట్లు
- నేడు తొలి ప్రయాణానికి సిద్ధం
- హాట్‌కేకుల్లా అమ్ముడైన టికెట్లు

అది ప్రపంచంలోకెల్లా అతి పెద్ద విహార నౌక. పేరు ఐకాన్ ఆఫ్ ద సీస్. పొడవు 365 మీటర్లు. బరువు 2.5 లక్షల టన్నుల పై చిలుకు. 20 డెక్కులు, ప్రపంచంలోకెల్లా అతి పెద్ద వాటర్ పార్కు, స్విమింగ్ పూల్స్ వంటి లెక్కలేనన్ని ఆకర్షణలు దాని సొంతం. ఒక్క మాటలో చెప్పాలంటే అదో మినీ ప్రపంచం. కళ్లు చెదిరే స్థాయిలో సర్వ సదుపాయాలున్న ఈ లగ్జరీ క్రూయిజ్ ఆదివారం నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చేసింది. జనవరి 10న అమెరికాలో మియామీ బీచ్‌లో అంగరంగ వైభవంగా జలప్రవేశం చేసింది. ఆదివారం నుంచే వారం రోజుల పాటు తొలి పర్యటనకు బయల్దేరుతోంది. కరీబియన్ దీవుల్ని చుడుతూ ప్రయాణం సాగనుంది. ఈ ట్రిప్‌కు టికెట్లన్నీ ఇప్పటికే అమ్ముడైనట్టు నిర్మాణ సంస్థ రాయల్ కరేబియన్ ప్రకటించింది.

ఈ భారీ నౌకలో విశేషాలెన్నో...

- ఈ నౌక నిర్మాణానికి 200 కోట్ల డాలర్లకు పైగా ఖర్చయిందట. ఫిన్లండ్‌లోని మెయర్ తుర్క్ షిప్‌యార్డులో దీని నిర్మాణం జరిగింది.
- ఈ విలాస నౌక టైటానిక్ కంటే ఏకంగా ఐదు రెట్లు పెద్దది.
- ఇందులో ఏకంగా 7,960 మంది హాయిగా ప్రయాణించవచ్చు. 2,350 మంది సిబ్బందితో కలిపి దాదాపు 10 వేల మందికి పైగా పడతారు!
- 17,000 చదరపు అడుగుల విస్తీర్ణంతో ప్రపంచంలోనే అతి పెద్ద వాటర్ పార్కు ఈ నౌక సొంతం.
- 16, 17 అంతస్తులను పూర్తిగా వాటర్ పార్కుకే కేటాయించారు.
- వాటిలో లెక్కలేనన్ని వాటర్ గేమ్స్‌ను ఆస్వాదించవచ్చు. ఒళ్లు గగుర్పొడిచే అడ్వెంచర్ గేమ్స్ కూడా ఉన్నాయట. ఇక ఏడు సువిశాలమైన స్విమ్మింగ్ పూల్స్ అదనపు ఆకర్షణ.



- మరీ గుండెలు తీసిన బంట్లయితే 20వ అంతస్తు నుంచి నేరుగా సముద్రంలోకి డైవింగ్ చేయడం వంటి పలు సాహసాలు కూడా చేయవచ్చు.
- ప్రత్యేకంగా రూపొందించిన ఐస్ ఎరీనాలో స్కేటింగ్ కూడా చేయవచ్చు! మినీ గోల్ఫ్ కోర్సూ ఉంది.
- పలు థీమ్ పార్కులు, సువిశాలమైన 40 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. ఇక్కడ ప్రపంచ ప్రఖ్యాత రుచులన్నింటినీ ఆస్వాదించవచ్చు. వీటిలో 21 కాంప్లిమెంటరీ తరహావి. వాటిలో ఏం తిన్నా, తాగినా అంతా ఉచితమే.
- అత్యాధునిక సినిమా థియేటర్లలో సినిమాలు మొదలుకుని లైవ్ మ్యూజిక్ షోల దాకా అన్నీ అందుబాటులో ఉంటాయి.
- 55 అడుగుల ఎత్తైన ఇండోర్ జలపాతం నౌకలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.
- ఈ నౌకను పూర్తిగా కలియదిరిగి చూసేందుకే కనీసం 10 రోజులు పడుతుందట!
- ఆదివారం మొదలయ్యే తొలి ప్రయాణం కరేబియన్ దీవుల్లో బహమాస్, హోండురస్‌ల గుండా ఏడు రాత్రులు, ఆరు పగళ్లు సాగుతుంది.
- ఈ నౌక ప్రధానంగా లిక్విఫైడ్ నాచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ)తో నడుస్తుంది.
- 90 శాతానికి పైగా తాగునీటి అవసరాలను ఆర్వో పద్ధతిలో సముద్ర జలాల ద్వారానే తీర్చుకుంటుంది.
- ఐకాన్ ఆఫ్ ద సీస్‌లో ప్రయాణానికి ఔత్సాహికులు ఏడాదిగా ఎదురు చూస్తున్నారు. 2022 అక్టోబర్లో దీని తొలి ఫొటోలు బయటికి వచ్చినప్పటి నుంచే జనాలు విపరీతంగా ఆసక్తి చూపడం మొదలైంది. టికెట్లను ఆన్‌లైన్లో అందుబాటులో పెట్టీ పెట్టడంతోనే హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి.
- నిజానికిది రెండేళ్ల క్రితమే అందుబాటులోకి రావాల్సిందట. కరోనా కారణంగా ఆలస్యమైంది.
- ఇందులో రకరకాల ప్యాకేజీల్లో 2,805 గదులు, విశాలమైన లగ్జరీ కుపేలు అందుబాటులో ఉంటాయి.
- వాటి ఖరీదు చూస్తే నోరెళ్లబెట్టాల్సిందే! అతి తక్కువ ప్యాకేజీయే 3 వేల డాలర్ల (దాదాపు రూ.2.5 లక్షల) నుంచి మొదలవుతుంది. 2 లక్షల డాలర్లు, అంతకు మించిన ప్యాకేజీలూ ఉన్నాయి!
- ఐకాన్ ఆఫ్ ద సీస్‌ను కూడా తలదన్నే స్థాయిలో స్టార్ ఆఫ్ ద సీస్ పేరుతో మరో అతి విలాసమైన నౌకను నిర్మిస్తామని రాయల్ కరేబియన్ ఇప్పటికే ప్రకటించింది.
- దీనికి ముందు అతి పెద్ద లగ్జరీ నౌకగా రికార్డుకెక్కిన వండర్ ఆఫ్ ద సీస్‌ను కూడా రాయల్ కరేబియనే నిర్మించింది. దాని బరువు 2.35 లక్షల టన్నులు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఇలా రాజీనామా, అలా ప్రమాణం!

- నేడు ఎన్డీఏ కూటమిలోకి నితీశ్
- ఆర్జేడీ, కాంగ్రెస్ సంకీర్ణ సర్కారుకు గుడ్‌బై
- బీజేపీకి డిప్యూటీ సీఎం, మాంఝీకి 2 పదవులు
- బిహార్‌లో క్లైమాక్స్‌కు చేరిన రాజకీయ సంక్షోభం

పట్నా/న్యూఢిల్లీ: బిహార్‌లో రాజకీయ సంక్షోభం క్లైమాక్స్‌కు చేరుతోంది. ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలతో కూడిన మహాఘట్‌బంధన్ సంకీర్ణ సర్కారుకు జేడీ(యూ) సారథి, సీఎం నితీశ్‌కుమార్ గుడ్‌బై చెప్పడం, మళ్లీ బీజేపీతో దోస్తీ కట్టి ఎన్డీఏ కూటమిలో చేరడం ఖాయమైనట్టు కన్పిస్తోంది. అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు, ఆదివారం ఉదయం నితీశ్ సారథ్యంలో పట్నాలో ఎన్డీఏ శాసనసభా పక్ష భేటీ జరగనుంది. బీజేపీ, జేడీ(యూ), జితన్‌రాం మాంఝీ సారథ్యంలోని హిందూస్తాన్ అవామీ లీగ్ అందులో పాల్గొంటాయి. ఎమ్మెల్యేలంతా కలిసి శాసనసభాపక్ష నేతగా నితీశ్‌ను ఎన్నుకుంటారు. వెంటనే ఆయన గవర్నర్‌ను కలిసి సీఎం పదవికి రాజీనామా చేస్తారు. ఎన్డీఏ పక్షాల మద్దతు లేఖలు సమర్పించి మళ్లీ ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం కోరతారు. సాయంత్రం సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తారు. బీజేపీ నేత సుశీల్‌కుమార్ మోదీ ఉప ముఖ్యమంత్రి పదవి ఇస్తారని సమాచారం. మాంఝీ కూడా రెండు మంత్రి పదవులు డిమాండ్ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఆదివారం విధులకు రావాల్సిందిగా సచివాలయ సిబ్బందికి ఆదేశాలు వెళ్లడం వంటివన్నీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సూచికలేనని చెబుతున్నారు. పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా నితీశ్‌ను బలపరిచే అవకాశముందని వార్తలొస్తున్నాయి. కనీసం ఏడెనిమిది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల సెల్ ఫోన్లు శనివారమంతా స్విచాఫ్ కావడం వాటిని బలపరుస్తోంది! దాంతో పరిస్థితిని సమీక్షించేందుకు కాంగ్రెస్ అధిష్టానం తరఫున ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ బఘెల్ హుటాహుటిన పట్నా చేరుకున్నారు. ఇండియా కూటమిలోకి రావాల్సిందిగా మాంఝీతో మంతనాలు జరిపారు. మరోవైపు నితీశ్‌తో చేదు అనుభవాల నేపథ్యంలో ఈ మొత్తం వ్యవహారంపై బీజేపీ వ్యూహాత్మకమౌనం పాటిస్తోంది. శనివారం పట్నాలో జరిగిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో దీనిపై లోతుగా చర్చ జరిగినా జేడీ(



యూ)ను తిరిగి ఎన్డీఏలోకి ఆహ్వానించడంపై ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. ఇక ఘట్‌బంధన్ సంకీర్ణంలో ప్రధాన భాగస్వామ్య పక్షమైన ఆర్జేడీ ఎలాగైనా సర్కారును కాపాడుకునేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు కొనసాగిస్తోంది. ఆర్జేడీ నేతలతో పార్టీ చీఫ్ లాలు మంతనాల్లో మునిగి తేలుతున్నారు. జేడీ(యూ) లేకుండా ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమవ్వాలని నేతలు ప్రతిపాదించారు. అయితే బీజేపీ, జేడీ(యూ) కలిస్తే 123 ఎమ్మెల్యేలతో మెజారిటీ మార్కు (122)ను సులువుగా దాటేస్తారంటూ లాలు కుమారుడు, డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ వాటిని తిరస్కరించినట్టు చెబుతున్నారు. ఇలా శనివారమంతా పట్నాలో హై వోల్టేజ్ పొలిటికల్ డ్రామా నడిచింది.

ఇండియా కూటమి ఖతమే: జేడీ(యూ)

బిహార్లో ఘట్‌బంధన్ సంకీర్ణం కుప్పకూలనుందని జేడీ(యూ) రాజకీయ సలహాదారు, అధికార ప్రతినిధి కేసీ త్యాగి స్పష్టం చేశారు. శనివారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు నితీశ్‌ను పదేపదే అవమానించడమే ఇందుకు కారణమని చెప్పారు. కాంగ్రెస్ సారథ్యంలోని విపక్ష ఇండియా కూటమి కూడా కుప్పకూలే దశలో ఉందని ఆయన జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మాత్రం కూటమికి వచ్చిన ముప్పేమీ లేదని ఆశాభావం వెలిబుచ్చారు. అయితే, నితీశ్‌తో మాట్లాడేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పదేపదే ప్రయత్నించినా ఆయన 'బిజీ'గా ఉండటంతో వీలు కాలేదని వెల్లడించారు! ఇండియా కూటమి నుంచి జేడీ(యూ) వైదొలగుతున్నట్టు ఎలాంటి సమాచారమూ లేదని ఖర్గే చెప్పుకొచ్చారు.

సీట్ల సర్దుబాటు కింద 11 స్థానాలిస్తాం

కాంగ్రెస్‌కు సమాజ్‌వాదీ పార్టీ ఆఫర్

లక్నో: విపక్షాల 'ఇండియా' కూటమి భాగస్వామి పార్టీగా భావిస్తూ 11 లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్‌కు ఇస్తున్నట్లు సమాజ్‌వాదీ పార్టీ శనివారం ప్రకటించింది. ఈ కేటాయింపుతో విపక్షాల కూటమిలో సీట్ల సర్దుబాటు పర్వానికి చక్కటి శుభారంభం లభించిందని ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ వ్యాఖ్యానించారు. ' ఈ పంథా గెలుపు సమీకరణాలతో మరింత ముందుకెళ్తుంది. వెనుకబడిన, దళిత, అల్పసంఖ్యాల వర్గాల ఫార్ములాతో ఇండియా కూటమి చరిత్ర సృష్టించనుంది'' అని అఖిలేశ్ అభిలషించారు. '' కాంగ్రెస్‌కు ఇస్తామన్న సీట్ల సంఖ్యలో ఎలాంటి మార్పు ఉండబోదు'' అని ఎస్పీ అధికార ప్రతినిధి రాజేంద్ర చౌదరి స్పష్టంచేశారు. '' యూపీలో సీట్ల సర్దుబాటులో భాగంగా మేం కాంగ్రెస్‌కు 11, రాష్ట్రీయ లోక్‌దళ్(ఆర్ఎల్‌డీ)కి ఏడు సీట్లు ఇస్తాం. మిగతా మొత్తం 62 స్థానాల్లో మేమే పోటీచేస్తాం'' అని వివరించారు. దీనిపై ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్ స్పందించారు. '' మిత్ర పక్షం ఎస్పీ చేసిన ప్రతిపాదనపై తుది నిర్ణయం కాంగ్రెస్ నేత ముకుల్ వాస్నిక్ నేతృత్వంలోని కమిటీ తీసుకోనుంది' అని అన్నారు.

మిస్ జపాన్‌గా 'ఉక్రెయిన్' యువతి!



టోక్యో: ఆమె పేరు కరోలినా షినో. వయసు 26 ఏళ్లు. ప్రఖ్యాత మోడల్. తాజాగా జరిగిన మిస్ నిప్పన్ (జపాన్ పాత పేరు) పోటీల్లో విజేతగా నిలిచింది. ఆమె మిస్ జపాన్ కిరీటం నెగ్గడంపై దేశమంతటా విపరీతమైన చర్చ జరుగుతోంది. ఆమె జన్మతః ఉక్రేనియన్ కావడమే ఇందుకు కారణం! షినోకు ఐదేళ్ల వయసులో ఆమె తల్లి ఓ జపనీయున్ని పెళ్లాడింది. ఆ వెంటనే తల్లితో పాటు ఆమె ఉక్రెయిన్ వీడి జపాన్ వచ్చేసింది. గతేడాదే షినోకు జపాన్ పౌరసత్వం కూడా లభించింది. తాను నూరుపాళ్లు జపాన్ పౌరురాలినేనని షినో చెబుతోంది. ''కాకపోతే ఆ గుర్తింపు కోసం ఏళ్ల తరబడి పోరాడాల్సి వచ్చింది. పదేపదే జాతి వివక్షను ఎదుర్కొన్నా. మిస్ జపాన్ కిరీటం దక్కినందున ఆ అవమానాలకు ఇకనైనా తెర పడుతుందనే అనుకుంటున్నా'' అంటూ ఆశాభావం వెలిబుచ్చింది. జపాన్ భిన్న జాతులకు ఆలవాలం . గతంలోనూ విదేశీ మూలాలున్న పలువురు మిస్ జపాన్ కిరీటం నెగ్గారు.

ఆర్మీలో తొలి మహిళా సుబేదార్‌గా ప్రీతి

న్యూఢిల్లీ: ట్రాప్ షూటర్‌గా అంతర్జాతీయ పతకాలు సాధించిన క్రీడాకారిణి, ఆర్మీ హవాల్దార్ ప్రీతీ రజక్ చరిత్ర సృష్టించారు. ఆర్మీలో సుబేదార్‌గా పదోన్నతి సాధించి, ఆ ఘనత సాధించిన తొలి మహిళగా నిలిచారు. 19వ ఆసియా గేమ్స్‌లో టీమ్ ఈవెంట్‌లో వెండి పతకం సాధించి ఛాంపియన్ ట్రాప్ షూటర్‌గా పేరొందిన ప్రీతీ 2022లో సైన్యంలో చేరారు. కార్ప్స్ ఆఫ్ మిలిటరీ పోలీస్‌లో హవాల్దార్‌గా విధుల్లో చేరారు. ఇలా చేరిన తొలి క్రీడాకారిణి కూడా ఆమే! ట్రాప్ విమెన్ ఈవెంట్ విభాగంలో ప్రీతి దేశంలో ఆరో ర్యాంకర్. పారిస్‌లో జరగబోయే ఒలింపిక్స్ కోసం ఆర్మీ మార్క్‌మ్యాన్‌షిప్ యూనిట్‌లో శిక్షణ పొందుతున్నారు.

సోరెన్‌కు ఈడీ మళ్లీ సమన్లు

రాంచీ: భూ మాఫియాకు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో విచారణకు రావాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) శనివారం జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌కు సమన్లు జారీ చేసింది. వచ్చే వారంలో 29 లేదా 31వ తేదీల్లో ఎప్పుడు వీలైతే అప్పుడు విచారణకు రావాలంటూ అందులో కోరింది. తేదీని ఖరారు చేయాలని అందులో స్పష్టం చేసింది. అంతకుముందు, ఈడీ అధికారులు ఈ నెల 27 లేదా 31వ తేదీల్లో ఏదో ఒక రోజు విచారణకు రావాల్సి ఉందంటూ సీఎం సోరెన్‌ను కోరగా ఆయన స్పందించలేదు. దీంతో, తాజాగా మరోసారి ఆయనకు సమన్లు ఇచ్చారు.

రబ్రీ దేవికి ఢిల్లీ కోర్టు నోటీసులు

న్యూఢిల్లీ: రైల్వేశాఖలో ల్యాండ్ ఫర్ జాబ్స్ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై ఢిల్లీ కోర్టు బిహార్ మాజీ సీఎం రబ్రీ దేవి, ఆమె కూతుళ్లు మిసా భారతి, హేమా యాదవ్‌లకు సమన్లు జారీ చేసింది. ఫిబ్రవరి 9వ తేదీన కోర్టులో విచారణకు రావాలంటూ స్పెషల్ కోర్టు జడ్జి విశాల్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) వేసిన చార్జిషీటులో ఆరోపణలకు తగు ఆధారాలున్నాయని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి గత ఏడాది నవంబర్ నుంచి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న వ్యాపారవేత్త అమిత్ కట్యాల్‌ను సైతం తమ ముందు హాజరుపరచాలని ఆదేశించారు.

కూటమిని కాపాడుకుంటాం: ఖర్గే

కలబురిగి(కర్ణాటక): బిహార్‌లో సీఎం నితీశ్ కుమార్‌కు చెందిన జేడీ(యూ) ఇండియా కూటమిని వీడి బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏలో చేరనుందన్న వార్తలపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే స్పందించారు. దేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలనే తపన ఉన్నవారు కచ్చితంగా ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోరని తమ పార్టీ భావిస్తోందని ఖర్గే పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీలతో కూడిన ఇండియా కూటమిని ఐక్యంగా నిలిపి ఉంచేందుకు కాంగ్రెస్ శాయశక్తులా ప్రయత్నిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

హిందువులకు అప్పగించండి: వీహెచ్‌పీ

న్యూఢిల్లీ: వారణాసిలోని జ్ఞానవాపి మసీదును అంతకుముందున్న ఆలయాన్ని ధ్వంసం చేసి నిర్మించినట్లు ఏఎస్ఐ సర్వే మరోసారి రూఢీ చేసినందున ఆ ప్రాంతాన్ని హిందువులకు అప్పగించాలని విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) కోరింది. శివలింగం లభించిన వజూ ఖానాగా చెబుతున్న చోట హిందువులకు పూజలకు అనుమతులివ్వాలని డిమాండ్ చేసింది. మసీదును హిందూ ఆలయంగా ప్రకటించాలని వీహెచ్‌పీ వర్కింగ్ ప్రెసిడెంట్ అలోక్ కుమార్ ఒక ప్రకటనలో కోరారు.

ఇజ్రాయెల్ దాడుల్లో 174 మంది మృతి

గాజా: హమాస్‌తో జరుగుతున్న యుద్ధంలో ప్రజల మరణాలను, విధ్వంసాన్ని నివారించడంతోపాటు జన హనన చర్యలను మానుకోవాలంటూ అంతర్జాతీయ న్యాయస్థానం ఆదేశించి రోజైనా గడవక మునుపే గాజాపై ఇజ్రాయెల్ మళ్లీ భీకర దాడులు ప్రారంభించింది. 24 గంటల వ్యవధిలో 174 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోగా మరో 310 మంది గాయపడినట్లు శనివారం గాజా ఆరోగ్య శాఖ తెలిపింది. శనివారం ఉదయం రఫాలో ఓ నివాసంపై జరిగిన దాడిలో ఇద్దరు మహిళలు సహా ముగ్గురు చనిపోయారని స్థానిక అధికారులు తెలిపారు.

ఢిల్లీలో ఆప్ ప్రభుత్వాన్ని పడగొట్టే కుట్ర

ఏడుగురు ఎమ్మెల్యేలకు రూ.25 కోట్ల చొప్పున ఎర: కేజ్రీవాల్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలో తమ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందని ఆప్ అధినేత, సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. ఏడుగురు ఆప్ ఎమ్మెల్యేలకు ఒక్కొక్కరికి రూ.25 కోట్ల ఆశ చూపిందంటూ శనివారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ''నన్ను త్వరలో అరెస్టు చేస్తామంటూ మా ఎమ్మెల్యేలను భయపెట్టజూస్తున్నారు. ఇప్పటికే 21 మంది ఆప్ ఎమ్మెల్యేలతో చర్చలు జరిపామని సర్కార్‌ను పడగొడతామని చెబుతున్నారు. ఒక్కొక్కరికి రూ.25 కోట్లతో పాటు బీజేపీ టికెట్ ఇస్తామని ఆఫర్ ఇచ్చారు'' అని కేజ్రీ ఆరోపించారు. అందుకు తమ ఎమ్మెల్యేలు ససేమిరా అన్నట్టు చెప్పారు. ఇదంతా పచ్చి అబద్ధమని బీజేపీ మండిపడింది. ఆ ఏడుగురు ఎమ్మెల్యేల పేర్లు బయటపెట్టాలని డిమాండ్ చేసింది. ఒక ఎమ్మెల్యేతో బీజేపీ నేత మాట్లాడిన రికార్డింగ్ భద్రంగా ఉందని, సమయం వచ్చినప్పుడు దాన్ని బయట పెడతామని ఆప్ స్పందించింది.


హౌతీల దాడితో శుక్రవారం రాత్రి బ్రిటిష్ చమురు నౌకలో చెలరేగుతున్న మంటలు

బ్రిటిష్ నౌకపై హౌతీల దాడి

- నౌకలో 22 మంది భారతీయ సిబ్బంది
- రక్షణ చర్యలు చేపట్టిన ఐఎన్ఎస్ విశాఖపట్నం
- హౌతీల క్షిపణిని కూల్చేసిన అమెరికా యుద్ధ నౌక

జెరూసలేం: యెమెన్‌లో హౌతీ తిరుగుబాటుదారులు మళ్లీ రెచ్చిపోయారు. బ్రిటిష్ చమురు ట్యాంకర్‌తోపాటు మొట్టమొదటిసారిగా అమెరికా యుద్ధ నౌక యూఎస్ఎస్ కార్నీపైకి క్షిపణులను ప్రయోగించారు. బ్రిటిష్ చమురు నౌక మంటల్లో చిక్కుకోగా, అందులోని 22 మంది భారతీయ సిబ్బందిని కాపాడేందుకు భారత నావికా దళం ఐఎన్ఎస్ విశాఖపట్నం అక్కడికి హుటాహుటిన తరలి వెళ్లింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి ఎర్ర సముద్రంలోని ఏడెన్ సింధులో చోటుచేసుకుంది. బ్రిటిష్ చమురు నౌక ఎంవీ మర్లిన్ లువాండా లక్ష్యంగా హౌతీలు ప్రయోగించిన క్షిపణితో నౌకలో అగ్ని కీలలు ఎగిసిపడ్డాయి. విపత్తు సమాచారం అందుకున్న భారత నేవీకి చెందిన డెస్ట్రాయర్ ఐఎన్ఎస్ విశాఖపట్నం అక్కడికి చేరుకుంది. నౌకలో మంటలను ఆర్పి, సిబ్బందిని కాపాడేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. నౌకలోని సిబ్బందిలో 22 మంది భారతీయులతోపాటు ఒక బంగ్లాదేశీ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఘటనలో ఎవరికీ ఎటువంటి హాని కలగలేదని సమాచారం. ఇలా ఉండగా, ఏడెన్ సింధు శాఖలో పయనించే చమురు నౌకలే లక్ష్యంగా హౌతీ తిరుగుబాటుదారుల దాడులు పెరిగిన నేపథ్యంలో అమెరికాకు చెందిన యుద్ధ నౌక యూఎస్ఎస్ కార్నీని మోహరించింది. ఈ నౌకపైకి శుక్రవారం హౌతీలు మొట్టమొదటి సారిగా క్షిపణిని ప్రయోగించారు. దీనిని మధ్యలోనే కూల్చివేసినట్లు అమెరికా నేవీ ప్రకటించింది.

ఆమెకు రూ.692 కోట్లు చెల్లించండి

- పరువు నష్టం కేసులో ట్రంప్‌ను ఆదేశించిన అమెరికా కోర్టు


డొనాల్డ్ ట్రంప్


జీన్ కరోల్

న్యూయార్క్: పాత్రికేయురాలు, రచయిత్రి ఇ.జీన్ కరోల్‌కు పరువు నష్టం కలిగించినందుకు జరిమానాగా ఆమెకు దాదాపు రూ.692 కోట్లు(8.33 కోట్ల డాలర్లు) చెల్లించాలని అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను అమెరికా కోర్టు శనివారం ఆదేశించింది. 1996లో మాన్‌హాటన్‌లోని బెర్గ్‌డోర్ఫ్ గుడ్‌మ్యాన్ అవెన్యూ షాపింగ్‌మాల్ ట్రయల్ రూమ్‌లో ట్రంప్ తనను రేప్ చేశారంటూ కరోల్ కేసు వేసింది. లైంగికదాడి జరిగిందని నిర్ధారించిన కోర్టు, ఆమెకు 41.56 కోట్లు చెల్లించాలంటూ 2023 మే లో ట్రంప్‌ను ఆదేశించింది. తనపై లైంగికదాడి వివరాలను న్యూయార్క్ మేగజైన్ వ్యాసంలో, తర్వాత పుస్తకంలో కరోల్ పేర్కొన్నారు. రచనల అమ్మకాలు పెంచుకునేందుకు అసత్యాలు రాస్తున్నారంటూ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇవి తన పరువుకు భంగం కలిగిస్తున్నాయంటూ ఆమె మరో దావా వేశారు. ఈ కేసు తుది తీర్పును మన్‌హాటన్ ఫెడరల్ కోర్టు శనివారం వెలువరించింది. కరోల్‌కు 1.83 కోట్ల డాలర్ల పరిహారంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా ఉండేందుకు హెచ్చరికగా మరో 6.5 కోట్ల డాలర్లు ఇవ్వాలని ట్రంప్‌ను ఆదేశించింది.

పై కోర్టుకు వెళతా: ట్రంప్

కోర్టు తీర్పు హాస్యాస్పదమని ట్రంప్ దుయ్యబట్టారు. ''న్యాయ వ్యవస్థ చేయి దాటి పోయింది. ప్రభుత్వం దాన్నో ఆయుధంగా వాడుతోంది. పై కోర్టుకు వెళతా' అని తీర్పు తర్వాత వ్యాఖ్యానించారు. గురువారం ఈ కేసు విచారణ మధ్యలోనే ట్రంప్ కోర్టులో నుంచి లేచి బయటికొచ్చారు. దీనిపై జడ్జి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ట్రంప్ లాయర్ వైఖరిని సైతం బాగా తప్పుబట్టారు. సరిగా ప్రవర్తించకుంటే మీరు జైలుకెళ్తారని లాయర్‌ను తీవ్రంగా మందలించారు కూడా.

రోడ్డు పక్కన కూర్చుని కేరళ గవర్నర్ నిరసన

- ఎస్ఎఫ్ఐ నిరసనలపై కినుక
- గంటలోపే జెడ్‌ప్లస్ భద్రత

తిరువనంతపురం/కొల్లం: కేరళ గవర్నర్, వామపక్ష ప్రభుత్వం మధ్య విభేదాలు ముదిరిన నేపథ్యంలో శనివారం నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈసారి కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ రోడ్డు పక్కన రెండు గంటలపాటు కూర్చుని దాదాపు ధర్నాకు దిగినంత పనిచేశారు. శనివారం ఉదయం కొట్టరక్కరలో జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ వెళ్తుండగా అధికార సీపీఎం అనుబంధ విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు నిలామెల్ వద్ద నల్ల జెండాలతో నిరసన తెలిపారు. 'సంఘీ చాన్సెలర్ గో బ్యాక్'అంటూ ఆయన్నుద్దేశించి నినాదాలు చేశారు. ఆగ్రహించిన గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ తన కారును ఆపించి, కిందికి దిగారు. తన వద్దకు రావాలంటూ పెద్దగా అరుస్తూ వారి సమీపానికి వెళ్లారు. దీంతో, పోలీసులు నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు, గవర్నర్‌కు మధ్య అడ్డుగా నిలబడ్డారు. అనంతరం, గవర్నర్ సమీపంలోని దుకాణం నుంచి కుర్చీ తెప్పించుకుని రెండు గంటలపాటు రోడ్డు పక్కనే కూర్చున్నారు. నిరసనకారులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను గట్టిగా డిమాండ్ చేశారు. నిరసనల్లో పాల్గొన్న 17 మంది ఎస్ఎఫ్ఐ కార్యకర్తలపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు ఎఫ్ఐఆర్ కాపీని చేతికి అందించాకే ఆయన నిరసన విరమించారు. ముఖ్యమంత్రి విజయన్ రాష్ట్రంలో అరాచకాన్ని ప్రోత్సహిస్తున్నారని, రాష్ట్ర అధినేతగా వాటిని సహించబోనన్నారు. వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే వామపక్ష ప్రభుత్వం తనపై దాడులకు ఉసిగొల్పుతోందని ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ కార్యకర్తలను గూండాలు, రోజువారీ కూలీలుగా ఆయన అభివర్ణించారు. దేశంలోని ఏరాష్ట్ర గవర్నర్ కూడా ఇలా వ్యవహరించ లేదని కేరళ విద్యా మంత్రి వి.శివన్‌కుట్టి వ్యాఖ్యానించారు. నిలామెల్ ఘటన జరిగిన గంటలోపే ఆయనకు సీఆర్‌పీఎఫ్ బలగాలతో కూడిన జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత కల్పించినట్లు కేంద్ర హోం శాఖ సమాచారం అందించిందని రాజ్ భవన్ ప్రకటించింది. గవర్నర్ తిరిగి తిరువనంతపురంలో కొన్ని కార్యక్రమాల్లో పాల్గొనగా ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు అక్కడ కూడా నిరసనలు కొనసాగించడం గమనార్హం.


శనివారం కేరళలోని నీలమెల్ వద్ద రోడ్డుపై బైఠాయించిన గవర్నర్ ఆరిఫ్

మరాఠాలకు ఓబీసీ రిజర్వేషన్

దిగొచ్చిన మహారాష్ట్ర సర్కార్


నిరసన శిబిరం వద్ద మనోజ్ జరాంగేతో సీఎం షిండే

ముంబై: ఓబీసీ రిజర్వేషన్ కల్పించాలంటూ ఉద్యమబాట పట్టిన మరాఠాలకు మహారాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. తక్షణం రిజర్వేషన్‌లు అమలుచేసే దాకా నిరాహార దీక్ష ఆపేది లేదని ఉద్యమనేత మనోజ్ జరాంగే పాటిల్ శుక్రవారం ప్రభుత్వానికి అల్టిమేటమ్ జారీచేయడంతో ఏక్‌నాథ్ షిండే సర్కార్ దిగొచ్చింది. వ్యవసాయ ఆధారిత కుంబీ కులంతో సమానంగా మరాఠాలకు ఓబీసీ రిజర్వేషన్లు వర్తింపజేస్తామని సీఎం షిండే శనివారం ప్రకటించారు. ఇందుకు సంబంధించి ముసాయిదా ఆర్డినెన్స్‌ను ప్రభుత్వం సిద్ధంచేసింది. ముసాయిదాలో పేర్కొన్న ప్రకారం కుంబీ కులానికి చెందినట్లుగా ధృవపత్రాలున్న మరాఠా వ్యక్తుల రక్తసంబంధీకులనూ ఇకపై కుంబీ కులస్తులుగా ప్రభుత్వం గుర్తిస్తుంది. మరాఠాలకు రిజర్వేషన్‌పై రాష్ట్ర ఓబీసీ నేత, మంత్రి ఛగన్ భుజ్‌బల్ అసంతృప్తి వ్యక్తంచేశారు. ఓబీసీ కోటాను పలుచన చేస్తూ, దొడ్డిదారిన మరాఠాలను ఓబీసీల్లో కలిపేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఒకే దేశం ఒకే వేదిక

పార్లమెంట్, శాసనసభల కార్యకలాపాలకు త్వరలో ఒకే డిజిటల్ ప్లాట్‌ఫామ్: మోదీ

ముంబై/న్యూఢిల్లీ: లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్రాల శాసనసభల ప్రొసీడింగ్స్‌ను ఒకే వేదిక మీదకు తెచ్చే డిజిటల్ ప్లాట్‌ఫామ్ ప్రాజెక్టు పనులు శరవేగంగా సాగుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. ముంబైలో శనివారం 84వ ఆలిండియా ప్రిసైడింగ్ అధికారుల సదస్సులో ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. ''లోక్‌సభ, రాజ్యసభ, శాసనసభల కార్యకలాపాలను ఒకే వేదికపైకి తెచ్చే ప్రయత్నం త్వరలో సఫలమవనుంది. వన్ నేషన్ వన్ లెజిస్లేటివ్ ప్లాట్‌ఫామ్‌కు ఇది బాటలు వేస్తోంది'' అని చెప్పారు. శాసనసభ్యుల ప్రవర్తన బట్టే ఆ శాసనసభ ప్రతిష్ఠ ఇనుమడిస్తుందని మోదీ అన్నారు. ''గతంలో సభాహక్కులను ఉల్లంఘించే సభ్యులను సీనియర్ సభ్యులు మందలించేవారు. ఇప్పుడా పరిస్థితే లేదు. తమ సభ్యులు ఎంతటి ఉల్లంఘనలకు పాల్పడినా పార్టీలు వెనకేసుకొస్తున్నాయి. ఈ సంస్కృతి మంచిది కాదు'' అన్నారు. '' గతంలో సభ్యునిపై అవినీతి ఆరోపణలు వస్తే సమాజంలో ఆ సభ్యుడు బహిష్కరణకు గురైనట్లే. ఆ సంస్కృతిని ఇప్పుడు గాలికొదిలేశారు. అవినీతి సభ్యులకు పాపులారిటీ పెరుగుతోంది'' అన్నారు. యువత చేతుల్లోనే అభివృద్ధి చెందిన భారత్ రూపుదిద్దుకోనుందని మోదీ అన్నారు. శనివారం ఢిల్లీలో ఎన్‌సీసీ-పీఎం ర్యాలీలో ఆయన ప్రసంగించారు. ''అమ్మాయిలను సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమితం చేసేవారు. వారికి అన్ని మేం రంగాల్లో ద్వారాలు తెరవడంతో తమదైన ముద్ర వేస్తున్నారు. గణతంత్ర వేడుకల్లో నారీశక్తి ప్రస్ఫుటంగా కనిపించింది'' అన్నారు.



ధర్మపురిలో రద్దీ

ధర్మపురి: ధర్మపురి శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. ముందుగా గోదావరిలో స్నానాలు ఆచరించి, అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు.

ఎస్‌యూ వీసీ పోస్టుకు నోటిఫికేషన్



కరీంనగర్ సిటీ: శాతవాహన యూనివర్సిటీ వీసీ పోస్టుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుతం వీసీగా మల్లేశం కొనసాగుతున్నారు. కొన్ని నెలల్లో ఆయన ఉద్యోగ విరమణ చేయనున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/14.8

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. ఉదయం, సాయంత్రం చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.



ఆవేదన దించుకోవాలె..

పెద్దింటి అశోక్‌కుమార్.. ఆ పేరు గుర్తొస్తే పల్లెల ముఖచిత్రం కళ్లముందు మెదులుతుంది. కరువు, వలసలు, కులవృత్తులు, ప్రపంచీకరణ ఆయనను కదిలించాయి. వలస కుటుంబాల కష్టాలు, కన్నీళ్లే కథావస్తువులు అయ్యాయి. 250 వరకు కథలు రాశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పాఠ్యాంశాల రూపశిల్పిగా మారారు. కథకుడిగా, మాటలు, పాటల రచయితగా పేరు పొందారు. అశోక్‌కుమార్ పాతికేళ్ల సాహిత్య ప్రస్థానంపై ప్రత్యేక కథనం.

– వివరాలు 8లో..

పల్లెల్లో 'ప్రత్యేక' పాలన!

- అధికారుల జాబితా రూపొందించిన యంత్రాంగం
- నియామకానికి ఏర్పాట్లు
- ఫిబ్రవరి 1తో ముగియనున్న సర్పంచుల పదవీకాలం
- జిల్లాలో 313 పంచాయతీలు



కరీంనగర్: జిల్లాలోని సర్పంచుల పదవీ కాలం ఫిబ్రవరి 1తో ముగియనుంది. దీంతో ప్రత్యేక అధికారుల పాలన కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉన్నతాధికారుల నుంచి వచ్చిన మౌఖిక ఆదేశాలతో జిల్లాలోని అన్ని పంచాయతీలకు అధికారులను నియమించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు కలెక్టర్ సూచనలతో పంచాయతీ అధికారులు ఇప్పటికే జాబితా రూపొందించారు. ప్రభుత్వం ప్రకటనే తరువాయి నియామకాలు చేపట్టనున్నట్లు తెలిసింది.

పార్లమెంట్ ఎన్నికల తర్వాతే..

రాష్ట్రంలో కొత్తగా ప్రభుత్వం ఏర్పడటం.. తక్కువ సమయం ఉండటంతో సర్పంచు ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కావడం లేదు. పార్లమెంట్ ఎన్నికల తర్వాతే స్థానిక సంస్థలకు జరగనుండటంతో గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించాలని చూస్తున్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి ఇప్పటికే కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మొత్తం 313 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో మేజర్, మధ్యరకం, చిన్న పంచాయతీలను బట్టి అధికారులను నియమించనున్నారు. మేజర్ జీపీలకు గెజిటెడ్ స్థాయి అధికారులను, మిగతా వాటికి మండల స్థాయిలో పని చేస్తున్న ఉద్యోగులను నియమిస్తారు. జిల్లాలో ఎమర్జెన్సీ విధులు నిర్వహించే వైద్యారోగ్య, విద్యుత్, విద్యాశాఖలకు మినహాయింపు ఇవ్వనున్నారు. కొన్ని శాఖలకు చెందిన డివిజన్ అధికారులను కూడా ప్రత్యేక అధికారులుగా నియమించే అవకాశం ఉంది. మండల స్థాయిలో పనిచేస్తున్న వ్యవసాయ, ఉద్యానవన, ఇంజినీరింగ్ శాఖల అధికారులకు కూడా విధులు కేటాయించనున్నట్లు సమాచారం. ప్రభుత్వం నుంచి ఈ నెల 30న లేదా 31న ఆదేశాలు రాగానే ప్రత్యేక అధికారులను నియమించేందుకు జిల్లా ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నారు. మళ్లీ ఎన్నికలు నిర్వహించేవరకు ప్రత్యేక అధికారులే గ్రామ పంచాయతీల్లో బాధ్యతలు నిర్వహించనున్నారు.

పైరవీలు షురూ..

ప్రతీ పంచాయతీకి ఒక అధికారిని నియమించాలని మౌఖిక ఆదేశాలు రావడంతో జిల్లా అధికారులు కొన్ని రోజులుగా ఇదే పనిలో ఉన్నారు. ఇందులో రాజకీయ జోక్యం తప్పడం లేదు. ఇప్పటికే అధికారుల పేర్లతో జాబితా తయారు చేయగా కొందరు నాయకుల ఒత్తిడి కారణంగా నిలిపివేసినట్లు తెలిసింది. మండల స్థాయిలో ఆయా శాఖల్లో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ల నుంచి సూపరింటెండెంట్ వరకు అధికారుల పేర్లు సేకరించారు. ఇదే అదనుగా పలువురు ప్రజాప్రతినిధులు చాలాచోట్ల తమకు నచ్చినవారిని నియమించుకునేందుకు పైరవీలు చేస్తున్నారు. కఠినంగా వ్యవహరించేవారు వస్తే ఎక్కడ తమ అక్రమాలు బయటపడతాయోననే కొందరు సర్పంచులు పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు అధికారులు సైతం తమకు నచ్చిన పంచాయతీలు కేటాయించాలని కోరుతుండటం గమనార్హం. కొందరు పెద్ద పంచాయతీ కావాలని, మరికొందరు పని తక్కువగా ఉండే చిన్న పంచాయతీలకు ఇన్‌చార్జీలుగా నియమించాలంటున్నారని చర్చ జరుగుతోంది.

ఆదేశాలు రాగానే నియామకం



జిల్లాలో ప్రత్యేక అధికారుల నియామకం కోసం జాబితా సిద్ధం చేశాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే నియామక ప్రక్రియ పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రభుత్వ నిర్ణయం మేరకు నడుచుకుంటాం. – పవన్‌కుమార్, జెడ్పీ సీఈవో, ఇన్‌చార్జి డీపీవో

కాంగ్రెస్ నాయకులు తిరిగిరండి



మాజీ కార్పొరేటర్ రాజేందర్‌ను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు

కరీంనగర్ కార్పొరేషన్ : కాంగ్రెస్‌కు చెందిన పాత నాయకులు తిరిగి పార్టీలోకి రావాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. నిజాయితీ గల నాయకులు మాత్రమే రావాలని షరతు విధించారు. బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ మల్లికార్జున రాజేందర్‌తోపాటు పలువురు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో రాజేందర్ తదితరులకు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన సందర్భంగా మాట్లాడారు. గతంలో వివిధ కారణాలతో పార్టీని వీడిన నాయకులను తిరిగి ఆహ్వానిస్తున్నామని, అవసరమైతే వారి ఇళ్లకు వెళ్లేందుకు సైతం సిద్ధమేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ హయాంలో ఎప్పుడూ పేదల భూములు, ప్రభుత్వ భూముల వెంట పడలేదన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో పరిస్థితి ఏ విధంగా తయారైందో ప్రజలు కూడా ఆలోచిస్తున్నారన్నారు. ఆరు గ్యారంటీల్లో కొన్ని అమలు చేశామని, మిగతావి అమలు చేయబోతున్నామని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ టి.సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో 14వ డివిజన్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు జంగ శరత్‌చంద్ర, యాగండ్ల అనిల్‌కుమార్, సిద్ది లక్ష్మణ్, వెంకటేశం, రంగు చెన్నయ్య, పంజాల నవీన్, వాసర హాస్పిటల్ చైర్మన్ నాగసముద్రం వాసరయ్య, నాగసముద్రం పురుషోత్తం తదితరులు కాంగ్రెస్‌లో చేరారు.

న్యూస్‌రీల్

షా పర్యటన వాయిదాతో బీజేపీ కార్యకర్తల్లో నైరాశ్యం



కరీంనగర్‌టౌన్: బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదివారం మధ్యాహ్నం కరీంనగర్‌లో నిర్వహించ తలపెట్టిన పార్లమెంట్ స్థాయి కార్యకర్తల సమావేశం వాయిదా పడింది. అత్యవసర కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉన్నందున ఆయన హాజరుకాలేక పోతున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, అమిత్ షా పర్యటన కోసం నగర చౌరస్తాలను కాషాయమయం చేసి, భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఎస్సారార్ కళాశాల మైదానంలో వేదిక, కార్యకర్తల కోసం గ్యాలరీలను ముస్తాబు చేశారు. వాహనాలను సిద్ధం చేసుకున్నారు. చివరికి హోంమంత్రి పర్యటన వాయిదా పడడంతో బీజేపీ నాయకులు, కార్యకర్తల్లో నైరాశ్యం నెలకొంది. తిరిగి ఆయన కరీంనగర్ ఎప్పుడు వస్తారనేది త్వరలోనే తెలియజేస్తామని ఎంపీ సంజయ్ పేర్కొన్నారు.

నేడు హైకోర్టు న్యాయమూర్తుల రాక

కరీంనగర్ క్రైం: హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి.శ్రీసుధ(కరీంనగర్ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి), జస్టిస్ ఇ.వి.వేణుగోపాల్ ఆదివారం కరీంనగర్ జిల్లా కోర్టుకు రానున్నారు. కోర్టు కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన జువెనైల్ కోర్టును ప్రారంభించనున్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ, ఇతర న్యాయమూర్తులు హాజరవుతారని కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రఘునందన్‌రావు, ప్రధాన కార్యదర్శి లింగంపల్లి నాగరాజు తెలిపారు. అసోసియేషన్ న్యాయవాదులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు 'నారాయణపూర్'కు నీటి విడుదల

గంగాధర(చొప్పదండి): నారాయణపూర్ రిజర్వాయర్‌కు ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిని ఆదివారం విడుదల చేయనున్నట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. ఇటీవల నంది రిజర్వాయర్ పరిశీలించామని, మరమ్మతులు పూర్తి చేసి, నారాయణపూర్‌కు నీటిని విడుదల చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. చొప్పదండి నియోజకవర్గంలో ఇంచు భూమిని కూడా ఎండనీయమని, రైతులు ఆందోళన చెందవద్దని కోరారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- అవసరమైతే మరో కాంట్రాక్టర్‌తో చేయించండి
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ కార్పొరేషన్/ కరీంనగర్ కల్చరల్: నగరంలోని అభివృద్ధి పనులను కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తే కఠినచర్యలు తప్పవని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ హెచ్చరించారు. శనివారం నగరంలోని స్మార్ట్‌సిటీ పనుల పురోగతిపై కలెక్టరేట్‌లో నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరపాలిక పరిధిలో అసంపూర్తిగా ఉన్న పనుల్లో వెంటనే పురోగతి కనిపించాలన్నారు. అలాగే, స్మార్ట్‌సిటీలో భాగంగా ఇప్పటికే ప్రారంభించిన, టెండర్ దశలో ఉన్న, ప్రారంభ దశలో ఉన్న పనుల జాబితా రూపొందించి, అందించాలని ఆదేశించారు. పనుల్లో ఆలస్యం జరగొద్దని, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే మరో కాంట్రాక్టర్‌తో పనులు పూర్తి చేయించాలని సూచించారు. అంచనాలు, కొలతల్లో పొరపాట్లు జరగకుండా అధికారులు పరిశీలించి, ధ్రువీకరించాలని పేర్కొన్నారు. ఏవైనా పొరపాట్లు జరిగితే అధికారులపైనా చర్యలు తీసుకుంటామన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీనివాస్, ఈఈలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

కచ్చితమైన తుది ఓటరు జాబితా సిద్ధం చేయాలి

రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు కచ్చితమైన తుది ఓటరు జాబితా రూపొందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చొప్పదండి నియోజకవర్గ బీఎల్‌వోలతో ఆయన సమావేశమయ్యారు. తప్పులు, పొరపాట్లకు ఆస్కారం లేని తుది ఓటరు జాబితా సిద్ధం చేసేందుకు కృషి చేయాలన్నారు. బదిలీ అయిన ఓటర్ల గుర్తిస్తే క్షేత్రస్థాయిలో పరిశీలించి, ధ్రువీకరించిన తర్వాతే జాబితా నుంచి వారి వివరాలు తొలగించాలని సూచించారు. ఎస్ఎస్ఆర్, ఏఎస్‌టీలో పెండింగ్ లేకుండా, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటర్లుగా నమోదయ్యేలా చూడాలని పేర్కొన్నారు. 2 కి.మీ. పైబడి దూరంలో ఉన్న పోలింగ్ కేంద్రాల వివరాలు ఇవ్వాలని, పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు, విద్యుత్ తదితర సౌకర్యాలను పరిశీలించాలని సూచించారు. హోం ఓటింగ్ కోసం దివ్యాంగులు, వయోవృద్ధులు వివరాలు సేకరించి, సిద్ధంగా ఉండాలన్నారు.

ఓటింగ్ శాతం పెంచడానికి 'స్వీప్'

- ఏప్రిల్ 15 వరకు అవగాహన కార్యక్రమాలు
- కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్ కల్చరల్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి స్వీప్ యాక్టివిటీ క్యాలెండర్–2024ను రూపొందించారని కలెక్టర్ పమేలా సత్పతి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 15 వరకు బూత్ స్థాయి సమావేశాలు, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న వారితోపాటు రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్/గేటెడ్ కమ్యూనిటీలు, యువకులు, మహిళలు, థర్డ్ జెండర్లు, పీడబ్ల్యూడీ, సీనియర్ సిటిజన్స్ తదితరులతో స్వీప్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం షెడ్యూల్ రూపొందించడంతోపాటు కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ప్రత్యేక అధికారులను కేటాయించినట్లు తెలిపారు. జనవరి 27 నుంచి ఫిబ్రవరి 5 వరకు గ్రామసభలు, వివిధ శాఖల ద్వారా ఓటర్ అవేర్‌నెస్, ఫిబ్రవరి 1 నుంచి మార్చి 15 వరకు అన్ని మున్సిపాలిటీలు, మండల హెడ్ క్వార్టర్లలో ఆర్‌డబ్ల్యూఏ ప్రెసిడెంట్స్, గేటెడ్ కమ్యూనిటీ ఓటర్ ఎన్‌రోల్‌మెంట్, ఫిబ్రవరి 8న మండల కేంద్రాల్లో 2కె రన్, 16న మున్సిపాలిటీల్లో 2కె రన్, 23న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో బైక్, సైకిల్ ర్యాలీలు, 29న కైట్ ఫెస్టివల్, ఫిబ్రవరి 6 నుంచి 29 వరకు స్పెషల్ ఎస్‌హెచ్‌జీ మీటింగ్స్, మండల సమాఖ్య వీవో, ఏఎల్ఎఫ్, టీఎల్ఎఫ్ సమావేశాలు, మార్చి 5న అన్ని మండల కేంద్రాల్లో, 13న అన్ని మున్సిపాలిటీల్లో రంగోలి పోటీలు, ఫిబ్రవరి 1 నుంచి ఏప్రిల్ 15 వరకు అన్ని గ్రామ పంచాయతీలు, మండలాల్లో, మున్సిపాలిటీల్లో ఓటు ప్రాముఖ్యతను వివరించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి వివరించండి

- మాజీ ఎంపీ వినోద్‌కుమార్



నాయకులతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

కరీంనగర్: ప్రతీ ఓటరును కలిసి, బీఆర్‌ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి వివరించాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. పార్లమెంటు ఎన్నికలకు ఎక్కువ సమయం లేకపోవడంతో శనివారం ఆయన తన నివాసంలో బీఆర్‌ఎస్ నాయకులతో సమావేశమయ్యారు. పలు అంశాలపై దిశానిర్దేశం చేస్తూ గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న 40 మండలాలు, మున్సిపాలిటీల్లో విస్తృతంగా పర్యటించేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని నిర్ణయించారు. త్వరలోనే అన్ని మండలాల్లో సైకిల్, బస్సు యాత్ర, పాదయాత్ర, విస్తృత పర్యటన.. ఏది చేస్తే ఓటర్లకు చేరువవుతామనే విషయమై సమాలోచనలు చేశారు. నాయకులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, సిద్ధం వేణు, ఏనుగు రవీందర్ రెడ్డి, జక్కుల నాగరాజు యాదవ్, పొన్నం అనిల్ గౌడ్, దూలం సంపత్ గౌడ్, తిరుపతి నాయక్, పూర్ణచందర్, కేమసారం తిరుపతి, పర్శరాం, మధు, అరుణ్, వంశీధర్ రెడ్డి, రాజు, శ్రీకాంత్, ఈర్లపల్లి రాజు తదితరులున్నారు.

పేద ఖైదీలకు న్యాయసహాయం

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి, జడ్జి వెంకటేశ్



మహిళా ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి వెంకటేశ్

కరీంనగర్‌క్రైం: ప్రైవేటు న్యాయవాదులను పెట్టుకునే ఆర్థిక స్తోమత లేని పేద ఖైదీలకు ప్రభుత్వ న్యాయవాదుల ద్వారా సహాయం చేస్తామని డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, జడ్జి వెంకటేశ్ అన్నారు. ఆయన జిల్లా జైలును శనివారం సందర్శించి, వంటశాల, క్యాంటీన్, సౌకర్యాలపై ఆరా తీశారు. మహిళా జైలుకు వెళ్లి, ఖైదీలకు అందుతున్న సదుపాయాలు తెలుసుకున్నారు. అనంతరం వారితో మాట్లాడుతూ.. పోక్సో, ఎన్డీపీఎస్, మోటార్ వెహికిల్ యాక్ట్, సీనియర్ సిటిజన్ యాక్ట్‌తోపాటు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ సమ్మయ్య, జైలర్లు పి.శ్రీనివాస్, రమేశ్, డిప్యూటీ జైలర్లు శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, రమేశ్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లాయర్ తణుకు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

8 మంది విడుదలకు నిర్ణయం

వివిధ నేరాల్లో జైలుశిక్ష అనుభవిస్తూ సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. జీవిత ఖైదు పడి, వృద్ధాప్యం, అనారోగ్యం, ఇతర సమస్యలు ఉన్నవారి శిక్షా కాలన్ని తగ్గించేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో కరీంనగర్ జిల్లా జైలు నుంచి 8 మంది ఖైదీలను విడుదల చేయనున్నారు. ఇందుకోసం జైలు అధికారులు 2020 నిబంధనల ప్రకారం రాష్ట్ర అధికారులకు వివరాలు పంపించారు. కానీ, నూతన నిబంధనలు అమలు చేయాలని, వాటి ప్రకారం వివరాలను తిరిగి పంపించాలని ఆదేశించడంతో మార్చి పంపించినట్లు తెలిసింది. దీంతో ఖైదీల విడుదల ఉత్తర్వులు రావడానికి రెండు రోజుల సమయం పడుతుందని సమాచారం. కరీంనగర్ జైలు నుంచి విడుదల కానున్నవారిలో ఏడుగురు జైలు పెట్రోల్ బంకులో పని చేస్తున్నారు. మరో వ్యక్తి వృద్ధాప్యం కారణంగా జైలులోనే ఉంటున్నాడు. శుక్రవారమే ఖైదీలు విడుదల కావాల్సి ఉండగా నిబంధనల్లో మార్పుల వల్ల ఆలస్యమవుతున్నట్లు తెలిసింది.

ముగిసిన ఇద్దరి కస్టడీ

- డాక్యుమెంట్ రైటర్లపై పోలీసుల దృష్టి?

కరీంనగర్‌క్రైం: భూమి విషయంలో ఇబ్బందులకు గురిచేసిన కేసులో కార్పొరేటర్ తోట రాములు, చీటి రామారావుల కస్టడీ శనివారం ముగిసింది. దీంతో వన్‌టౌన్ పోలీసులు వారిని కోర్టులో హాజరుపరిచి, జైలుకు తరలించినట్లు సమాచారం. కస్టడీలో కేసుకు సంబంధించిన కీలక విషయాలపై పోలీసులు విచారణ చేపట్టారు. వారి వద్ద లభ్యమైన డాక్యుమెంట్లపై లోతుగా ఆరా తీశారు. డాక్యుమెంట్ రైటర్లపై దృష్టి పెట్టినట్లు తెలిసింది.

'చీట్'ఫండ్స్!

- చిట్టీ వేయమని వెంట పడతారు..
- డబ్బులు చెల్లించకుండా తిప్పుకుంటారు..
- జిల్లాలో పుట్టగొడుగుల్లా చిట్‌ఫండ్ కంపెనీలు
- అనుమతి ఉన్నవి 61.. లేనివి 2 వేలకుపైనే
- మోసాలపై వరుస ఫిర్యాదులు
- కేసులు నమోదు చేస్తున్న పోలీసులు



'కరీంనగర్‌లోని కట్టరాంపూర్‌కు చెందిన చిట్టంపల్లి సత్యం స్థానికంగా ఉన్న ఓ చిట్‌ఫండ్ కంపెనీలో 50 నెలల చిట్టీ వేశాడు. 42 నెలల తర్వాత చిట్టీ ఎత్తుకోగా.. కంపెనీవారు ఇప్పటివరకు ఆ డబ్బులు ఇవ్వలేదు. బాధితుడు పోలీసులను ఆశ్రయించగా బాధ్యులపై కేసు నమోదైంది'.

'నగరంలోని విద్యానగర్‌కు చెందిన చాడ లక్ష్మి ఓ చిట్‌ఫండ్ కంపెనీలో ఏజెంటు ద్వారా రూ.10 లక్షల చిట్టీ వేసింది. డబ్బులు మొత్తం చెల్లించినప్పటికీ ఆమెకు రావాల్సిన రూ.7.40 లక్షలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించగా ఏజెంటు, చిట్‌ఫండ్ బాధ్యులపై కేసు నమోదైంది'.

కరీంనగర్ క్రైం: జిల్లాలో చిట్‌ఫండ్ కంపెనీల మోసాలు పెరిగిపోయాయి. మొదట చిట్టీ వేయమని ఏజెంట్ల ద్వారా బతిమిలాడటం.. వేశాక డబ్బులు చెల్లించే సమయంలో ముఖం చాటేయడం సర్వసాధారణమైపోయింది. అద్దాల మేడలు.. ఆకట్టుకునే కార్యాలయాలు ఏర్పాటు చేసుకొని సామాన్యులను నట్టేట ముంచుతున్నారు పలువురు చిట్‌ఫండ్ నిర్వాహకులు. చిట్టీ డబ్బులు చెల్లించాలని అడిగితే రౌడీల్లా ప్రవర్తిస్తూ అమాయక జనాలను బెదిరించిన సంఘటనలు అనేకం. పలు సందర్భాల్లో ఆయా కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులు కూడా యజమానుల మోసానికి బలైపోగా ఇంతవరకు వాటిపై ప్రభుత్వ చర్యలు శూన్యం. ఇటీవల సీపీకి వరుస ఫిర్యాదులు వెళ్లిన నేపథ్యంలో మంగళవారం ఏకకాలంలో మూడు చిట్‌ఫండ్ కంపెనీలపై కేసు నమోదు చేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

ఎత్తుకుంటే 100 నిబంధనలు..

పిల్లల చదవులు, భవిష్యత్ అవసరాలు, స్థిరాస్తుల కొనుగోలు, ఇతర అవసరాలకు ప్రజలు చిట్‌ఫండ్ కంపెనీలను ఆశ్రయిస్తున్నారు. పలువురు నిర్వాహకులు ఏజెంట్లను నియమించుకొని, చిట్టీలు కట్టించుకుంటున్నారు. చిట్టీ ఎత్తుకున్నవారికి 100 నిబంధనలు విధిస్తూ.. డబ్బులు చెల్లించకుండా తిప్పుకుంటున్నారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. కరీంనగర్ జిల్లాలో అధికారిక చిట్‌ఫండ్ కంపెనీలు 61 ఉండగా.. 2 వేలకు పైగా అనధికారికంగా నడుస్తున్నవే. రూ.50 వేల నుంచి రూ.50 లక్షల వరకు చిట్టీలు వేస్తుండగా ఆర్థిక అవసరాలు ఎదురైనప్పుడు, చిట్టీ సమయం ముగిశాక తమ డబ్బు ఇవ్వమని అడిగితే షూరిటీ పేరిట ఇబ్బందులు పెడుతున్నారు. నెలలపాటు కార్యాలయం చుట్టూ తిప్పుకుంటూ చివరకు బెదిరింపులకు దిగుతున్నారు. ఆపై ఎంతో కొంత ముట్టజెప్పి, మొత్తం తీసుకున్నట్లు వారితో సంతకాలు చేయించుకొని పంపిస్తున్నారు. ఇటీవల సీపీకి చిట్‌ఫండ్ బాధితుల నుంచి ఫిర్యాదులు పెరగగా.. స్టేషన్లవారీగా వాటిపై ప్రత్యేక దృష్టిసారించారు. మరికొన్ని కంపెనీలపై కేసు నమోదుకు పోలీసులు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

మోసం చేస్తే చర్యలు



ప్రజలను మోసం చేసే చిట్‌ఫండ్ కంపెనీలపై ప్రత్యేక దృష్టిసారించాం. ఇటీవల వరుస ఫిర్యాదులు వస్తున్నాయి. మోసం చేశాయని ఒకేరోజు మూడు చిట్‌ఫండ్స్ కంపెనీలపై బాధితులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేశాం. ప్రజలను మోసం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. – జి.నరేందర్, కరీంనగర్ టౌన్ ఏసీపీ

రెండోరోజు జేఈఈ మెయిన్స్



క్యూలైన్‌లో విద్యార్థులు

తిమ్మాపూర్(మానకొండూర్): మొదటి విడత జేఈఈ మెయిన్స్ పరీక్షలు జిల్లాలో రెండోరోజు ప్రశాంతంగా జరిగాయి. గత బుధవారం కేవలం ఒక పరీక్ష కేంద్రంలో పరీక్షలు నిర్వహించారు. శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6 పరీక్ష కేంద్రాల్లో జరిగాయి. తిమ్మాపూర్ మండలంలోని వాగేశ్వరి అయాన్ డిజిటల్ సెంటర్, శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాల, కరీంనగర్‌లోని అల్ఫోర్స్ ఉమెన్స్ డిగ్రీ కళాశాల, వివేకానంద డిగ్రీ కళాశాల, వాణినికేతన్ డిగ్రీ కళాశాల, మంథని జేఎన్‌టీయూహెచ్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. కరోనా నేపథ్యంలో ఆయా కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విద్యార్థుల మధ్య భౌతిక దూరం ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. కేంద్రాల్లోకి గంటన్నర ముందు నుంచే విద్యార్థులను అనుతించారు. అయాన్ డిజిటల్ సెంటర్‌లో ఉదయం 680 మంది విద్యార్థులకు 675 మంది, మధ్యాహ్నం 688 మందికి 677 మంది హాజరైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. శ్రీ చైతన్య కళాశాలలో ఉదయం 200 మందికి 197 మంది, మధ్యాహ్నం 200 మందికి 199 మంది వచ్చారన్నారు. మంథని జేఎన్‌టీయూహెచ్‌లో ఉదయం 95 మందికి 93 మంది, మధ్యాహ్నం 95 మందికి 92 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. అల్ఫోర్స్ కళాశాలలో ఉదయం 125 మందికి 124 మంది, మధ్యాహ్నం 125 మందికి 125 మంది వచ్చారని తెలిపారు. వివేకానంద కళాశాలలో ఉదయం 100 మందికి 100 మంది, మధ్యాహ్నం 100 మందికి 99 మంది హాజరయ్యారన్నారు. వాణినికేతన్ కళాశాలలో ఉదయం 109 మందికి 108 మంది, మధ్యాహ్నం 109 మందికి 109 మంది వచ్చారని పేర్కొన్నారు. ఫిబ్రవరి 1 వరకు పరీక్షలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఎల్ఎండీ ఎస్సై చేరాలు బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

నకిలీ వీసాలతో మోసం

- సుమారు 60 మంది నుంచి డబ్బులు వసూలు
- బాధితుల ఆందోళన.. పోలీసులకు ఫిర్యాదు

మెట్‌పల్లి: దుబాయ్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి ఓ వ్యక్తి నకిలీ వీసాలు అంటగట్టి మోసం చేసిన సంఘటన జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. పట్టణంలోని చైతన్యనగర్‌కు చెందిన ఏలేటి రమేశ్ కొంతకాలంగా దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఆ దేశంలోని బిన్ బెలాయిలా కాంట్రాక్టింగ్ కంపెనీలో ఉద్యోగాలు ఇప్పిస్తానని అక్కడి నుంచి బంధువులకు, స్నేహితులకు సమాచారం ఇచ్చాడు. వారి ద్వారా నిర్మల్, నిజామాబాద్, మెట్‌పల్లి ప్రాంతాలకు చెందిన సుమారు 60 మంది నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.26,500ను వసూలు చేశాడు. ఆ తర్వాత వీసాలు పంపకుండా జాప్యం చేస్తూ వస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం మెట్‌పల్లికి వచ్చిన అతన్ని డబ్బులు ఇచ్చిన వారంతా కలిసి వీసాల గురించి ప్రశ్నించగా, తొందరలోనే వస్తాయని నమ్మబలికాడు. రోజులు గడుస్తున్నప్పటికీ రాకపోవడంతో అందరూ కలిసి గట్టిగా నిలదీశారు. ఈ నెల 26న పంపిస్తానని చెప్పడంతో వారంతా ఒక్కొక్కరు రూ.20 నుంచి రూ.28వేల వరకు వెచ్చించి విమాన టిక్కెట్లు తీసుకున్నారు. అనంతరం రమేశ్ ఇచ్చిన వీసాలతో శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లగా, అక్కడి అధికారులు వాటిని పరిశీలించి నకిలీవని తేల్చి చెప్పారు. ఖంగుతిన్న బాధితులంతా శనివారం మెట్‌పల్లిలోని అతని ఇంటి వద్దకు రాగా, అందుబాటులో లేకుండా పోయాడు. ఫోన్‌లో కూడా స్పందించకపోవడంతో అక్కడే ఆందోళనకు దిగారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. రమేశ్ మోసం వల్ల ఒక్కొక్కరు రూ.60 వేల వరకు నష్టపోయామని, తమకు న్యాయం చేయాలని ఎస్‌ఐ చిరంజీవిని కోరారు.



రాజన్నా దీవించు

వేములవాడ: సమ్మక్క జాతర సమీపిస్తుండడంతోపాటు వీకెండ్, వరుస సెలవులు రావడంతో శనివారం వేములవాడ రాజన్నను 25వేల మంది భక్తులు దర్శించుకున్నారు. రాజన్న క్షేత్రం రద్దీగా మారింది. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు తడి బట్టలతో కోడెమొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ద్వారా రూ.35 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఏర్పాట్లను ఈవో కృష్ణప్రసాద్, ఏఈవో శ్రీనివాస్, పర్యవేక్షకులు తిరుపతిరావు, అల్లి శంకర్, శ్రీరాములు పరిశీలించారు.

ఆవేదన దించుకోవాలె.. జనంతో పంచుకోవాలె!

- 'పెద్దింటి' కథలు.. వలస కన్నీళ్లు
- పల్లె ఆత్మ కథల్లో ఆవిష్కరణ
- కదిలించిన కరువు, కూలిపోతున్న కులవృత్తులు
- కథకుడు, మాటలు, పాటల రచయిత అశోక్‌కుమార్ సాహిత్య ప్రస్థానం


అశోక్‌కుమార్

సాక్షి, కరీంనగర్ డెస్క్: ఆయన కథలు చదువుతుంటే మట్టి వాసన పరిమళిస్తుంది.. పల్లెల ముఖచిత్రం కళ్లముందు మెదులుతుంది.. మనసును కథలోకి లాక్కెళ్తాడు.. గుండెను పిండేసి కన్నీరు పెట్టిస్తాడు.. మానవ విలువలను రంగరించి రుచిచూపిస్తాడు. నవలంటే జీవితం.. ఓ తరం చరిత్ర, వికాసం, అభివృద్ధి. అలాంటి నవలా ప్రపంచంలో కొత్త చరిత్రను రాసినవాడు పెద్దింటి అశోక్‌కుమార్. రాజన్న సిరిసిల్ల జిల్లా భీముని మల్లారెడ్డిపేట స్వస్థలం. ఐదు దశాబ్దాల తెలంగాణ చరిత్రను తన ఐదు నవలల్లో ఆవిష్కరించారు. భాషాసంస్కృతుల మీద దృష్టిపెట్టి, పల్లె జీవితాన్ని, ఆచార వ్యవహారాలను చిత్రించారు. ఆయన రాసిన 'జిగిరి' నవల 12 భారతీయ భాషల్లోకి అనువాదమైంది. అశోక్‌కుమార్ 250 వరకు కథలు, 9 నవలలు, 8 కథాసంపుటిలు, 6 నాటికలు, 100 వరకు సామాజిక వ్యాసాలు రాశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, పాఠ్యాంశాల రూపశిల్పిగా, కథకుడిగా, మాటలు, పాటల రచయితగా ప్రసిద్ధి చెందారు. పెద్దింటి అశోక్‌కుమార్ సాహిత్యానికి పాతికేళ్లు పూర్తయిన సందర్భంగా పలకరించగా చెప్పిన పలు విషయాలు ఆయన మాటల్లోనే..

- నేను 1968 ఫిబ్రవరి 6న గంభీరావుపేట మండలం భీమునిమల్లారెడ్డిపేటలో పుట్టాను. అమ్మానాన్న మల్లవ్వ, అంజయ్య. మాది రెండెకరాల పేద కుటుంబం. నా ప్రాథమిక విద్య మా ఊరిలోనే సాగింది. ఉన్నత విద్య మా పక్క ఊరు లింగన్నపేటలో చదివాను. ఇంటర్ గంభీరావుపేటలో చేశాను. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు, శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ(గణితం), ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీఈడీ పూర్తి చేసి, 1996లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా మా పక్క ఊరు కోరుట్లపేటలో జాయిన్ అయ్యాను. మా ఊరి నుంచే బడికి వెళ్లేవాడిని.
- అప్పట్లో కరువు పరిస్థితులు, వలసలు, ప్రపంచీకరణ, కూలిపోతున్న కులవత్తులు నన్ను కదిలించాయి. నా చిన్నప్పుడే మా నాన్న బతుకుదెరువు కోసం గల్ఫ్ వెళ్లాడు. అప్పట్లో ఉత్తరం వచ్చేందుకు నెలలు పట్టేది. మా సమీప బంధువులు చాలా మంది గల్ఫ్ దేశాలకు వెళ్లారు. అలా నేను ఒక రకంగా వలస కుటుంబాలు కష్టాలను, కన్నీళ్లను దగ్గరి నుంచి చూశాను. అవే కథావస్తువులు అయ్యాయి.


పుస్తకాల ముఖచిత్రాలు

- 1999లో రచనా రంగంలోకి వచ్చాను. 'ఆశ.. నిరాశ.. ఆశ' నా తొలిరచన. అది అప్పట్లో ఓ ప్రముఖ దినపత్రికలో ప్రచురితమైంది. తెలంగాణ యాసను, భాషను, సామెతలను ఆవిష్కరిస్తూ.. అనేక కథలు రాశాను. తెలంగాణ అంటేనే వలసలకు నిర్వచనం. అవి ఉత్తర తెలంగాణలో మరీ ఎక్కువ. ఆ వలస వెనుక విషాదం దాగి ఉంటుంది. కన్నీళ్లు పొంగుతాయి. వలసలోని వికత రూపాలను 2001లో 'ఎడారి మంటలు'గా చిత్రించాను. దేశం కాని దేశంలో భాష రాని రాజ్యంలో తెలంగాణ బిడ్డలు పడుతున్న బాధలు.. కొడుకులు దూర దేశంలో ఉంటే ఇక్కడ తల్లులు పడుతున్న తండ్లాట రాశాను.
- గ్రామీణ పర్యావరణాన్ని అంశంగా తీసుకొని 'దాడి' నవల రాశాను. వ్యవసాయం ఏతం, మోట, రాటు, డీజిల్ ఇంజిన్లను దాటుకొని హైస్పీడ్ మోటార్లు, సబ్‌మెర్సిబుల్ పంపులదాకా వచ్చింది. ఫలితంగా దోసెడు మట్టిని తీస్తే దోసెడు నీళ్లారే భూములు నీళ్లు లేక ఎండిపోయాయి. అడవులు నాశనమైపోయాయి. ఇప్పుడే ఇలా ఉంటే భవిష్యత్ తరాలకు నీరు ఎలా అందుతుందన్న ప్రశ్నను ముందుంచుతూ 'దాడి'ని రాశాను.
- జంతులక్షణాలు ఉన్న మనిషికి.. మనిషి లక్షణాలు ఉన్న జంతువుకు మధ్య సంఘర్షణే 'జిగిరి' నవల. ఆకాశవాణిలో ప్రసారమైంది. ఇలా ఇప్పటివరకు నవలలుగా ఎడారి మంటలు (2002), దాడి (2005), జిగిరి (2006), ఊరికి ఉప్పులం (2007), సంచారిని (2011), మిలియన్ మార్చ్ (2017), ఇంకెంత దూరం (2020) రాశాను. కథా సంపుటాలుగా ఊటబాయి (2003), వలస బతుకులు (2004), మా ఊరి బాగోతం (2005), మాయిముంత (2007), భూమడు (2009), పోరుగడ్డ (2011), జుమ్మేకి రాత్‌మే (2015), గుండెలో వాన (2021) ప్రచురితమయ్యాయి. ఎండమావి (2005), పోరుగడ్డ (2016), తెగారం (2018), నెనరు (2021) నాటకాలుగా ఆకాశవాణిలో ప్రసారమయ్యాయి. తెగారం నాటకానికి నటనలో నంది అవార్డు సహా పాతిక అవార్డులు వచ్చాయి. నేను రాసిన మరో 25 కథలు హిందీలోకి అనువాదం అయ్యాయి.


రామాజీపేట స్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా అశోక్‌కుమార్ ఊరి జనం ముందు రెఫరెండం (ఫైల్)

- కథా రచయితగా ఉన్న నేను తొలిసారి 2010లో వేదం సినిమాకు మాటలు రాశాను. ఆ సినిమా నిర్మాత క్రిష్ నన్ను పిలిచి, తెలంగాణ మాండలికం పోర్షన్‌కు మాటలు రాయించారు. ఆ సినిమాలోని ఓ పాత్రకు నేను 'సిరిసిల్ల రాజయ్య'అనే పేరు పెట్టాను. అలా 'దాగుడు మూతలు దండాకోర్', 'మల్లేశం', 'దొరసాని', 'తమసోమ జ్యోతిర్గమయ', 'షరతులు వర్తిస్తాయి' వంటి సినిమాలకు పని చేశాను. పలు సినిమాల్లో పాటలు రాశాను. నటించాను కూడా. నేను రాసిన జిగిరి నవల సినిమాగా రాబోతుంది. ఇప్పటికే నా 'ఊటబాయి' కథను అదేపేరుతో పాలసాని వేణు చిన్న సినిమాగా తీశారు. టీవీ సీరియల్‌గా కూడా కొన్ని కథలు బుల్లితెరకెక్కాయి. ఇంకా కొన్ని సినిమాలకు కమిట్‌మెంట్ కుదిరింది.
- నేను రాసిన 8 కథలు వివిధ విశ్వవిద్యాలయాల్లో పాఠ్యాంశాలయ్యాయి. కాకతీయ వర్సిటీ ఎంఏ తెలుగు విభాగం విద్యార్థులకు 'మాయిముంత', 'ఇగురం' కథలు పాఠ్యాంశాలుగా మారాయి. ఉస్మానియా వర్సిటీ 'జిగిరి', నవలను, 'గోస' కథను 'లాంగ్ మార్చ్' నవలను పాఠ్యాంశంగా చేర్చారు. దక్షిణ భారతీయ భాషా అధ్యయన కేంద్రం మైసూర్ వారు తెలుగు విద్యార్థులకు 'అనగనగా ఓ కోడి పెట్ట' కథను పాఠ్యాంశం చేశారు. నాగార్జున వర్సిటీ పరిధిలోని సిల్వర్ జూబ్లీ కళాశాల విద్యార్థులకు రైతు జీవితం నేపథ్యంలో రాసిన 'గుండెలోన వాన' కథను బోధిస్తున్నారు. ఓరియంటల్ కాలేజీ పీడీసీలో జిగిరి నవల పాఠ్యాంశమైంది. నా సాహిత్యంపై ఆరుగురు పరిశోధనలు, ఆరుగురు ఎంఫిల్ చేశారు. విచిత్రంగా నేను తెలుగుపై పీహెచ్‌డీ చేస్తుండగా.. నా జిగిరి నవల గురించి నాకే ప్రశ్న వచ్చింది. తెలుగు మహాసభల్లో అప్పటి సీఎం కేసీఆర్ నా సాహిత్య శైలిని ప్రస్తావించడం సంతోషమనిపించింది.
- నేను గవర్నమెంట్ టీచర్‌గా పని చేస్తూ.. బండలింగంపల్లిలో 'గుండ్ల చెరువు' పేరుతో స్కూల్ మ్యాగజైన్‌ను నడిపించాను. రామాజీపేటలో మా పనితీరుపై ఆ ఊరి ప్రజల ముందు రెఫరెండం పెట్టాను. ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలన్న వారి కోరికను నెరవేర్చుతూ బోధనలో మార్పులు తెచ్చాం. సర్కారు బడిని బతికించాలన్న ఉద్దేశంతో 12 లఘుచిత్రాలు తీశాను.
- మా ఊరే నన్ను కథకుడిని చేసింది. ఎండిన వాగులు.. కరిగిపోయిన కొండలు.. మొరం తేలిన వాకిళ్లు.. గల్ఫ్ దేశాలకు వలసలు.. నన్ను కదిలించాయి. నా గుండెను పిండేసిన సంఘటనలు.. బాధలు.. నా మనసులోని బరువు దించుకోడానికి నేను కథలు రాశాను. అవి కథలు కాదు.. వాస్తవిక ఘటనలకు సజీవ సాక్ష్యాలు.. నేను ఇంకా రాస్తూనే ఉంటాను. నా ఈ సాహిత్య ప్రయాణంలో నా భార్య మంజుల, కూతుళ్లు సాహితి, సతి సహకారం మరువలేనిది. కథకుడిగా ఇప్పటికి 25 ఏళ్లవుతోంది. 11 కథలతో 'విత్తనం' అనే కథల సంపుటి రాబోతుంది.

ముంపు బాధితులను ఆదుకోవాలి


నాయబ్ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బాధిత రైతులు

ముస్తాబాద్(సిరిసిల్ల): చెరువులో పట్టా భూములు కోల్పోతున్న తమను ఆదుకోవాలని రైతులు ముస్తాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు. మండలంలోని చీకోడుకు చెందిన చింతల చెరువు ముంపు బాధిత రైతులు ధర్నా చేపట్టి మాట్లాడారు. నాలుగేళ్లుగా చింతల చెరువులోకి మల్లన్నసాగర్ నీరు విడుదల చేయడంతో 110 ఎకరాలు ముంపునకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టా భూములు నీటిలో మునిగిపోవడంతో పంటలు సాగు చేయడం లేదన్నారు. చెరువు నీటిలో భూములు పోవడంతో ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. భూమికి బదులు భూమి ఇప్పించాలని, లేదా మల్లన్నసాగర్ నీటి విడుదలను ఆపాలని కోరారు. ఈమేరకు నాయబ్ తహసీల్దార్ సురేశ్‌కు వినతిపత్రం అందజేశారు. రైతులు కాంపెల్లి శ్రీనివాస్, రాజిరెడ్డి, నర్సయ్య, నాంపెల్లి, పోశరాములు, విజయ, ఎల్లం, రమేశ్, చందు, రాజశేఖర్, ఎల్లయ్య, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ గణిత పోటీల్లో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ ప్రసాదరావు

కొత్తపల్లి(కరీంనగర్): సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే ఆర్యభట్ట గణిత చాలెంజ్ పోటీల్లో కరీంనగర్ పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ రితేశ్ మెహతా తెలిపారు. లెవల్–1, 2ల్లో నిర్వహించిన పరీక్షకు దేశవ్యాప్తంగా రూ.5.50 లక్షల మంది హాజరయ్యారని అన్నారు. ప్రతీ రీజియన్‌లో 100 మందిని ఎంపిక చేయగా వారిలో జిల్లా నుంచి నలుగురికి చోటు దక్కిందని పేర్కొన్నారు. వీరిలో ముగ్గురు పారమిత విద్యార్థులుండటం గర్వంగా ఉందన్నారు. ఈ మేరకు పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు సీహెచ్.లక్ష్మీహాసని, జి.హరికాంత్, బి.విశాల్‌రెడ్డిలను విద్యాసంస్థల చైర్మన్ ప్రసాదరావు అభినందించారు. డైరెక్టర్లు అనూకర్‌రావు, రశ్మిత, ప్రసూన, వినోద్‌రావు, వీయూఎం.ప్రసాద్, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, గైడ్ టీచర్ సంపత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలస్యంగా నడుస్తున్న సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు

రామగుండం: న్యూఢిల్లీ నుంచి చెన్నై మార్గంలో సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల గంటల కొద్దీ ఆలస్యంగా నడిచాయి. ప్రధానంగా శనివారం రామగుండం చేరుకోవాల్సిన పలు రైళ్లు దాదాపు 12 గంటలకుపైగా ఆలస్యంతో వచ్చాయి. దీంతో ప్రయాణికుల పర్యటన షెడ్యూల్‌లో మార్పులు చోటుచేసుకున్నాయి. గంటల కొద్దీ నిరీక్షించాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. న్యూఢిల్లీలో దట్టమైన పొగమంచుతో రాత్రి, వేకువజామున బయలుదేరే రైళ్లు మధ్యాహ్నం వేళ బయలు దేరుతున్నాయి. దీంతో రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయని రైల్వే అధికారులు తెలిపారు.

రామగుండం చేరుకునే రైళ్ల సమయం ఇలా..

- రైలు నంబరు 12511 కొచ్చువెల్లి –రప్తిసాగర్ రామగుండం ఉదయం 9.25గంటలకు రావాల్సి ఉండగా 7.30 గంటల ఆలస్యంగా సాయంత్రం 4గంటలకు చేరుకుంది.
- రైలు నంబరు 20806 న్యూఢిల్లీ–విశాఖపట్నం ఏపీ ఎక్స్‌ప్రెస్ రామగుండం మధ్యాహ్నం 3.49 గంటలకు రావాల్సి ఉండగా 12 గంటల ఆలస్యంతో ఆదివారం వేకువజాము 3.31 గంటలకు రానుంది.
- రైలు నంబరు.12616 న్యూఢిల్లీ–చెన్నై జీటీ ఎక్స్‌ప్రెస్ రామగుండం సాయంత్రం 4.09గంటలకు రావాల్సి ఉండగా పది గంటల ఆలస్యంగా ఆదివారం వేకువజామున 2.10గంటలకు చేరుకుంటుంది.
- రైలు నంబరు 12626 న్యూఢిల్లీ–త్రివేండ్రం కేరళ ఎక్స్‌ప్రెస్ రామగుండం సాయంత్రం 4.59 గంటలకు రావాల్సి ఉండగా 15 గంటల ఆలస్యంతో ఆదివారం ఉదయం 7.42 గంటలకు రానుంది.
- రైలు నంబరు 12724 న్యూఢిల్లీ–హైదరాబాద్ తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రామగుండం మధ్యాహ్నం 12.31గంటలకు రావాల్సి ఉండగా 12 గంటల ఆలస్యంతో అర్ధరాత్రి ఒంటి గంటకు రానుంది.


తెలంగాణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు

దోపిడీకి పాల్పడిన ఇద్దరి అరెస్ట్

- సీసీ పుటేజీ ఆధారంగా పట్టివేత


ఎస్పీ అఖిల్ మహాజన్ చేతుల మీదుగా రివార్డు అందుకుంటున్న సీఐ సదన్‌కుమార్, సిబ్బంది

సిరిసిల్లక్రైం: ఒంటరిగా వెళ్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకొని దోపిడీకి పాల్పడుతున్న ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం తెలిపారు. సీసీ నిందితులను పట్టుకున్న సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్, ఆర్‌ఎస్‌ఐ జునైద్, సిబ్బంది నరేందర్, రాజశేఖర్, శ్రీనివాస్, అక్షర్‌లకు రివార్డులు అందించారు. ఎస్పీ తెలిపిన వివరాలు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన రుద్రాపు పోషవ్వ అనారోగ్యంతో ఉండగా చికిత్స కోసం జిల్లెల్ల క్రాసింగ్ వద్ద ఉన్న ఆర్‌ఎంపీ వద్దకు ఈనెల 12న వెళ్లి ఇంటికి తిరిగి వస్తుంది. గమనించిన ఓ మహిళ, మరో పురుషుడు బైక్‌పై వచ్చి వృద్ధురాలి ఇంటి వద్ద దిగబెడతామని బైక్ ఎక్కించుకున్నారు. ఇంటి వద్ద దించే క్రమంలో వృద్ధురాలి మెడలోని పుస్తెలతాడును తెంపుకొని పరారయ్యారు. బాధితురాలు తంగళ్లపల్లి ఠాణాలో ఫిర్యాదు చేసింది. సీఐ, ఆర్ఎస్సైలు పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈనెల 26న బద్దెనపల్లి క్రాసింగ్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. సిద్దిపేట జిల్లాకు చెందిన సిద్ధ యాదవ్వ, బోదాసు నరేశ్‌లు ఈ దోపిడీకి పాల్పడినట్లు ఒప్పుకున్నారు.

జాతీయ కబడ్డీ పోటీలకు ఎంపిక



కరీంనగర్ స్పోర్ట్స్: కడప జిల్లాలోని రాయపూర్‌లో ఈ నెల 28 నుంచి 31 వరకు 67వ జాతీయ స్థాయి కబడ్డీ అండర్–14 బాలికల చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు కరీంనగర్‌లోని పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థిని కృతిక ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బాలాజీ తెలిపారు. ఇటీవల జనగాంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆమె ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. పారమిత పాఠశాలల అధినేత ఇనుగంటి ప్రసాదరావు శనివారం ఆమెను అభినందించారు.

జాతీయ బేస్‌బాల్ పోటీలకు..



కరీంనగర్‌స్పోర్ట్స్: చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని కోర్బాలో ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు 67వ జాతీయస్థాయి అండర్–14 బేస్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు కరీంనగర్ మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థి అక్షయ్ కార్తీక్ ఎంపికయ్యాడు. ఇటీవల తొర్రూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా విద్యార్థిని మానేరు విద్యాసంస్థల అధినేత అనంతరెడ్డి శనివారం అభినందించారు.

స్కూల్ ప్రిన్సిపాల్ అదృశ్యం


ఆనంద్


కరీంనగర్‌క్రైం: ఓ ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపాల్ అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మంకమ్మతోటలోని వాసముండే కమలాకర ఆనంద్ తిమ్మాపూర్‌లోని తన స్నేహితుడి వద్ద కు డబ్బుల కోసం వెళ్తున్నానని శుక్రవారం ఇంట్లో చెప్పి, వెళ్లాడు. కానీ, తిరిగి రాలేదు. బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అతని భార్య సుశ్మిత శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

మంచం పట్టిన పదిర

- నెల రోజులుగా వీడని జ్వరాలు
- గ్రామంలో మెగా వైద్యశిబిరం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని పదిర గ్రామస్తులు నెల రోజులుగా జ్వరాలతో బాధపడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నా జ్వరాలు తగ్గడం లేదు. ఇంటికొకరి చొప్పున జ్వరపీడితులు ఉన్నారు. ఈ విషయమై జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావుకు ఫిర్యాదు అందగా వెంటనే స్పందించారు. గ్రామంలో మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేసి తక్షణం వైద్యం అందించాలని ఆదేశించారు. వెంటనే వైద్యాధికారులు శనివారం పదిర గ్రామంలో పర్యటించారు. ఇంటింటికెళ్లి వివరాలు సేకరించి వైద్యసేవలు అందించారు. జిల్లా సబ్‌యూనిట్ అధికారి మోహన్, మండల ఇన్‌చార్జి వైద్యాధికారి చిరంజీవి ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ఇంటింటికి తిరిగి జ్వరాలతో బాధపడుతున్న రోగుల వివరాలు సేకరించి వైద్యసేవలందిస్తున్నారు. జ్వరం తీవ్రంగా ఉన్న వారిని సిరిసిల్ల ఏరియాస్పత్రికి తరలించారు. డ్రెయినేజీల్లో దోమల నివారణకు మందు పిచికారీ చేశారు. వైద్య సిబ్బంది నరేందర్, రమేశ్, పద్మ, స్వప్నదేవి, అనసూయ, లక్ష్మీప్రసన్న, పద్మ, మౌనిక, లత, సర్పంచ్ కుంబాల వజ్రమ్మ, పంచాయతీ కార్యదర్శి సాగరిక, కారోబార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య


యాకూబ్ పాషా (ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్: పట్టణంలోని గడిమహిల్‌కు చెందిన ఎండీ యాకూబ్‌పాషా(రాహిల్)(33) శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఎస్సై విజేందర్, కుటుంబసభ్యుల కథనం ప్రకారం యాకూబ్‌పాషా స్థానికంగా సెల్ రిపేర్ సెంటర్ నడిపిస్తూ జీవిస్తున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తాయి. వీటిని అధిగమించలేక మానసికంగా కృంగిపోయాడు. తీవ్ర మనస్తాపంతో ఈక్రమంలో ఈనెల 5న గడ్డిమందు తాగాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి చెల్లెలు నిషాత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య ఉంది. ఆమె తొమ్మిది నెలల గర్భిణీ అని కుటుంబ సభ్యులు తెలిపారు.

భార్యను వేధించిన భర్తకు ఐదేళ్ల జైలు

కరీంనగర్ క్రైం: అదనపు కట్నం కోసం భార్యను వేధింపులకు గురిచేయడంతోపాటు అత్తంటివారు ఉంటున్న గుడిసెను తగులబెట్టిన కేసులో చెక్కల శివకృష్ణకు ఐదేళ్ల జైలుశిక్ష, రూ.30 వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ ప్రత్యేక ఫ్యామిలీ కోర్టు జడ్జి లక్ష్మీకుమారి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మహాత్మానగర్ చాపల కాలనీకి చెందిన దివ్య అదే కాలనీకి చెందిన చెక్కల శివకృష్ణ ఐదేళ్ల క్రితం ప్రేమించి, పెళ్లి చేసుకున్నారు. మూడేళ్ల భార్యతో కలిసి కాపురం చేసిన శివకృష్ణ తర్వాత రూ.5 లక్షల అదనపు కట్నం తీసుకురావాలంటూ ఆమె వేధింపులకు గురిచేశాడు. దీనిపై పంచాయితీ పెట్టగా భార్యను మంచిగా చూసుకుంటానని చెప్పాడు. కొన్ని రోజుల తర్వాత తిరిగి వేధించడం ప్రారంభించాడు. 2022 అక్టోబర్ 10న రాత్రి శివకృష్ణ అత్తామామ ఉండే గుడిసెను తగులబెట్టాడు. ఈ ఘటనపై దివ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్ఎండీ పోలీసులు శివకృష్ణపై కేసు నమోదు చేసి, దర్యాప్తు జరిపారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జూలూరు శ్రీరాములు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి సాక్ష్యాధారాలు పరిశీలించి, శివకృష్ణకు శనివారం జైలుశిక్ష, జరిమానా విధించారు.

నర్సింగ్ కోర్సు అభ్యర్థులకు జపాన్‌లో ఉద్యోగాలు

- టాంకాం ద్వారా ఎంపిక
- రూ.1.50 లక్షల నుంచి రూ.2లక్షలు వేతనం
- జనవరి 29న స్క్రీనింగ్ పరీక్షలు
- జిల్లా ఉపాధి కల్పన అధికారి రాఘవేందర్

సిరిసిల్ల: నర్సింగ్ కోర్సులను పూర్తి చేసిన అభ్యర్థులకు జపాన్‌లో ఉద్యోగావకాశాలు ఉన్నాయని జిల్లా ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్ శనివారం తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టీవోఎంసీవోఎం) ద్వారా రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తాజాగా బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం డిప్లొమా హెల్పర్స్ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని వివరించారు. టాంకాం ద్వారా గతంలో రెండు బ్యాచ్‌ల్లో 31 మందికి జపాన్‌లో ఉపాధి అవకాశాలు కల్పించిందని, మూడో బ్యాచ్ ఎంపికకు జనవరి 29న హైదరాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కిల్ ట్రెయినింగ్ (ఎన్ఎస్‌టీఐ)లో ఉదయం 10 గంటల నుంచి స్క్రీనింగ్ పరీక్షలు జరుగుతాయని వివరించారు. ఎంపికైన అభ్యర్థులకు జపనీస్ భాషపై, అదనపు వృత్తిపరమైన నైపుణ్యాన్ని రెసిడెన్షియల్ శిక్షణను హైదరాబాద్‌లోనే ఇస్తారని తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు నెలకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు సంపాదించే అవకాశం ఉందని స్పష్టం చేశారు. పూర్తి వివరాల కోసం 89190 47600, 63022 92450, 95739 45684 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రాజకీయాల్లో శత్రువులుగా ఉండొద్దు

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్
- బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభం


బ్యాడ్మింటన్ ఆడుతున్న వినోద్‌కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్: రాజకీయాల్లో ప్రత్యర్థులుగా ఉండాలి గానీ శత్రువులుగా ఉండొద్దని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. స్థానిక అంబేద్కర్ స్టేడియంలోని ఇండోర్ స్టేడియంలో కరీంనగర్ క్లబ్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని, మాట్లాడారు. గెలుపోటములను సమానంగా స్వీకరించిన్నప్పుడే క్రీడల్లో రాణిస్తారని, రాజకీయ నాయకులు కూడా గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. తాను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న కాలంలో అథ్లెటిక్స్ క్రీడాకారుల కోసం రూ.7 కోట్లతో సింథటిక్ ట్రాక్ నిర్మించినట్లు చెప్పారు. అనంతరం బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను సత్కరించారు. సంఘం బాధ్యులు జితేందర్ రెడ్డి, అదనపు ఎస్పీ వెంకట్రావు, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీనివాస్ గుప్తా, శంకరపట్నం జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి, సినీ నటుడు ప్రభాస్ శ్రీను, శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ రమేశ్‌రెడ్డి, డీఎస్పీ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

5 కేజీల గంజాయి స్వాధీనం

- నిందితులు హుజూరాబాద్‌వాసులు


గంజాయి, నిందితుడితో ఏసీపీ హరికృష్ణ

ఖమ్మం క్రైం: ఖమ్మం రైల్వేస్టేషన్ వద్ద పోలీసులు శనివారం 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు చేపట్టిన తనిఖీల్లో ఓ యువకుడు, ఇద్దరు మైనర్లు వెళ్తుండగా వారి బ్యాగ్‌లు పరిశీలించారు. అందులో గంజాయి లభించడంతో అదుపులోకి తీసుకున్నారు. హుజూరాబాద్‌కు చెందిన నీలం రాజు ఇద్దరు మైనర్లతో కలిసి గంజాయి కొనుగోలు చేసి, హుజూరాబాద్ ప్రాంతంలో విక్రయించేందుకు వెళ్తూ పట్టుబడ్డారని ఖమ్మం టౌన్ ఏసీపీ హరికృష్ణ, సీఐ స్వామి వెల్లడించారు.

క్లుప్తంగా

ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

కరీంనగర్‌కల్చరల్‌: రిపబ్లిక్‌ డే సందర్భంగా మెహర్‌నగర్, వివేకానందపూర్‌కాలనీల్లో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు, యువతులు విభిన్న అంశాలను తీసుకొని వేసిన అందమైన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. అనంతరం విజేతలకు ఆర్బీవీఆర్‌ఆర్‌ ఉమ్మడి జిల్లా రెడ్డి సంఘం ఉపాధ్యక్షురాలు కసిరెడ్డి రాణిరెడ్డి, పెన్నింటి సంగీతారెడ్డిలు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



రాజవీరును పరామర్శిస్తున్న బండి సంజయ్‌

కరీంనగర్‌టౌన్‌: గునుకుల కొండాపూర్‌ మాజీ సర్పంచ్‌ సొల్లు అజయ్‌వర్మ తండ్రి అయిన సొల్లు రాజావీరు ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడటంతో కాలు తుంటి ఎముక విరిగిపోయింది. శనివారం కరీంనగర్‌లోని కార్తికేయ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రాజావీరును బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌ పరామర్శించారు. డాక్టర్లతో మాట్లాడి ఆ కుటుంబానికి ధైర్యాన్ని ఇచ్చారు. సంజయ్‌ వెంట డాక్టర్‌ పుల్లెల పవన్‌కుమార్, బోయినపల్లి ప్రవీణ్‌రావు ఉన్నారు.

వైద్యబృందం సందర్శన



పరిసరాలను పరిశీలిస్తున్న వైద్య బృందం

మానకొండూర్‌రూరల్‌: శ్రీనివాసనగర్‌ గ్రామాన్ని శనివారం కరీంనగర్‌ మలేరియా వైద్య బృందం సందర్శించింది. గ్రామానికి చెందిన అమ్మిగల్ల సరిత డెంగీతో మృతిచెందడంతో గ్రామంలో డ్రై డే నిర్వహించారు. ప్రతి వీధి వెంట తిరుగుతూ పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. ప్రతి ఇంటిని పరిశీలించి డ్రైనేజీలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మలేరియా డాక్టర్‌ కె.మహేందర్‌రెడ్డి, సెక్రటరీ మధుమిత, సీహెచ్‌వో రాజునాయక్, ఏఎస్‌ఎం సరోజ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారార్‌ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్‌

కరీంనగర్‌ సిటీ: కరీంనగర్‌ పట్టణంలోని ఎస్సారార్‌ కళాశాల కంప్యూటర్‌ సైన్స్‌ విభాగంలో అధ్యాపకుడిగా పని చేసున్న అందె శ్రీనివాస్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ ప్రకటించింది. 'ఆటోమేటిక్‌ బ్రెయిన్‌ స్ట్రోక్‌ క్లాసిఫికేషన్‌ అండ్‌ డిటెక్షన్‌ యూసింగ్‌ ఏఐ బేస్డ్‌ డేటా మైనింగ్‌ టెక్నిక్స్‌' అనే అంశంపై ప్రొఫెసర్‌ జోసెఫ్‌ పి.మోసిగంటి పర్యవేక్షణలో పరిశోధన చేసినట్లు ఆయన పేర్కొన్నారు. శ్రీనివాస్‌కు వర్సిటీ ప్రొఫెసర్‌ డాక్టర్‌ ఎం.వెంకటదాస్‌ శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సారార్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ కె.రామకృష్ణ, జి.సి.జి.టి.ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌ రెడ్డి, స్టాఫ్‌ క్లబ్‌ సెక్రటరీ శ్రీనివాస్, వైస్‌ ప్రిన్సిపాల్‌ రాజయ్య, అధ్యాపకులు ప్రమోద్‌ కుమార్, మల్లారెడ్డి, ఎస్‌.ఓ.కుమార్, మహేశ్, ఆంజనేయులు తదితరులు ఆయనను అభినందించారు.

లఘు చిత్రాల ప్రదర్శన

కరీంనగర్‌ కల్చరల్‌: కరీంనగర్‌ ఫిల్మ్‌ సొసైటీ, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంయుక్తంగా ప్రతినెలా రెండో, నాలుగో శనివారం చిన్నితెర కార్యక్రమం నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా పునర్జన్మ, లింగని బిడ్డ, బండి పెళ్లాం లఘుచిత్రాలను శనివారం ప్రదర్శించారు. అనంతరం ఆ చిత్రాల బృందాలకు ఆర్డీవో మహేశ్‌ చేతులమీదుగా సర్టిఫికెట్‌ అందజేసి, సన్మానించారు. ఇటీవల డాక్టరేట్‌ అందుకున్న పొన్నం రవిచంద్రను ఆర్డీవో సత్కరించారు. కార్యక్రమంలో ఆయా చిత్రాల నిర్మాతలు, దర్శకులు, నటీనటులు, సాంకేతిక నిపుణులు తంగడ అశోక్‌రావు, మైసయ్య, కిట్లా శ్రీనివాస్, లక్ష్మీగౌతమ్, ముజఫర్, మాడిశెట్టి గోపాల్, నంది శ్రీనివాస్, గాజోజు నాగభూషణం, కృపాదానం తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

కరీంనగర్‌ క్రైం: డ్రంకెన్‌ డ్రైవ్‌ కేసులో కోర్టు ఇద్దరికి జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌ ఏసీపీ సర్వర్‌ తెలిపారు. మద్యం సేవించి, వాహనాలు నడిపిన 15 మందిని పోలీసులు శనివారం కోర్టులో హాజరుపరిచారు. ఒకరికి 5 రోజులు, మరొకరికి 3 రోజుల జైలుశిక్ష, రూ.3,500 చొప్పున జరిమానా, మిగతా 13 మందికి రూ.21,500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.





ప్రమాద సూచికలేవీ..

నగరంలోని ప్రధాన కూడళ్లలో స్మార్ట్‌సిటీలో భాగంగా వేసిన బీటీ రోడ్లపై జీబ్రా లైన్స్, రేడియం స్టిక్కర్స్, పాదచారుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయలేదు. దీంతో ఇష్టానుసారంగా రోడ్లు దాటుతున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ప్రాణనష్టం జరగకముందే అధికారులు ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్‌

వైద్యకళాశాలను అగ్రగామిగా నిలుపుతా

కొత్తపల్లి : కరీంనగర్‌ వైద్య కళాశాలను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపేందుకు కృషి చేస్తానని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ అన్నారు. కొత్తపల్లి శివారులోని వైద్యకళాశాలలో శనివారం రాత్రి జరిగిన ఎంబీబీఎస్‌ మొదటి సంవత్సరం విద్యార్థుల ఫ్రెషర్స్‌డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వైద్యశాల అభివృద్ధికి అవసరమైన నిధులను తీసుకరావడంతో పాటు వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని కళాశాలకు తీసుకొచ్చి అవసరమైన సదుపాయాలు కల్పించేలా చూస్తానని తెలిపారు. గత కాంగ్రెస్‌ హయాంలో 200 ఎకరాల్లో శాతవాహన విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేశామని, 10ఏళ్లుగా అది నిర్లక్ష్యానికి గురైందని అన్నారు. వైద్యకళాశాల విద్యార్థులు గుర్తింపు పొందేలా విద్యనభ్యసించాలని అన్నారు. కార్యక్రమంలో మానకొండూర్‌ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, అడిషనల్‌ కలెక్టర్‌ ప్రఫుల్‌ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్‌ మున్సిపల్‌ చైర్మన్‌ రుద్ర రాజు, డీఎంహెచ్‌వో లలితాదేవి, కళాశాల ప్రిన్సిపాల్‌ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వివిధ క్రీడాపోటీల్లో గెలుపొందిన విజేతలకు మెడల్స్‌ అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



బహుమతులు అందజేస్తున్న మంత్రి పొన్నం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

స్నేహపూర్వకంగా ఉండాలి



గంగాధర: బాలికలను బాలురతో సమానంగా చదివిస్తేనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఐసీడీఎస్‌ సీడీపీవో కస్తూరి సూచించారు. శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. పిల్లలను సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంచాలని, బడికి బంజేసి పనులకు పంపించొద్దని అన్నారు. గుడ్‌ టచ్, బ్యాడ్‌ టచ్‌పై అవగాహన కల్పించాలని, తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా ఉండాలని, బాల్య వివాహాలు చేయొద్దన్నారు.

లెనిన్‌ స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధం కావాలి

కరీంనగర్‌కల్చరల్‌: ప్రపంచ చరిత్రలో నూతన అధ్యాయానికి నాంది పలికిన విప్లవ ఉద్యమాల కాంతి శిఖరం లెనిన్‌ స్ఫూర్తితో శ్రామికులు, కర్షకులు, కార్మికులు ఐక్య ఉద్యమ పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. నగరంలోని ముకుందలాల్‌ మిశ్రాభవన్‌లో శనివారం గీట్ల ముకుందరెడ్డి అధ్యక్షతన వర్తమాన పరిస్థితుల్లో నిజం ప్రాధాన్యత అంశంపై నిర్వహించిన సెమినార్‌లో మాట్లాడారు. సోవియట్‌ విప్లవం ప్రపంచ గమనాన్ని మార్చిందన్నారు. దోపిడీకి వ్యతిరేకంగా పోరాడే ప్రతీ గొంతులోనూ అజరామరంగా గుర్తుండిపోయే పేరు కామ్రేడ్‌ లెనిన్‌ అని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీలు ఆవిర్భవించాయని ఆయా దేశాలకు అనుగుణంగా మార్క్సిజాన్ని సిద్ధాంతాన్ని అన్వయించి విప్లవాల జయప్రదం కోసం కృషి చేస్తున్నాయని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీల్లో పని చేసే ప్రతీ కార్యకర్తకు లెనిన్‌ జీవితం ఆదర్శంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వర్ణ వెంకటరెడ్డి, గుడి కందుల సత్యం, బీమాసాహెబ్‌ జిల్లా కమిటీ సభ్యులు రాజేశం, నరేశ్‌ నాయకులు తిప్పారపు సురేశ్, కోనేటి నాగమణి, గజ్జల శ్రీకాంత్, పుల్లెల మలయ్య, కాల్వ సురేశ్, యాదగిరి, కొంపెల్లి సాగర్, అరవింద్, కనకరాజు, విపిన్‌ కుమార్, చందు, రోహిత్‌ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి

విజేతలకు బహుమతులు ప్రదానం

కరీంనగర్‌కల్చరల్‌: రామ మందిరం ప్రాణప్రతిష్టను పురస్కరించుకొని తెలంగాణ ఆర్ట్, ఫిజికల్‌ వర్క్‌ ఎడ్యుకేషన్‌ టీచర్స్‌ అసోసియేషన్‌ (టీఏపీవేటా) ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శనివారం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారుడు, యునెస్కో లిమ్కా బుక్‌ ఆఫ్‌ రికార్డు గ్రహీత సత్య తిరునగరి, శ్రీనివాసరావు, ప్రముఖ చిత్రకారుడు, కవి, రచయిత గుండు రమణయ్య, టిఏపీవేటా జిల్లా అధ్యక్షుడు తాడూరి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి పబ్బతి రఘు, ఆడపు సంపత్, గీతారాణి, విజయలక్ష్మి, రమేశ్, సుమ, రౌతు రవికుమార్, గోపి తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న బండి సంజయ్‌కుమార్‌

అశోక్‌ కాచె సేవలు అభినందనీయం

విద్యానగర్‌(కరీంనగర్‌) రాష్ట్రంలోని 610 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవాస భారతీయుడు, మంథనికి చెందిన డాక్టర్‌ అశోక్‌ కాచె బాలల గ్రంథాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కరీంనగర్‌ డీఈవో వెంకట సూర్య జనార్దన్‌రావు అన్నారు. శనివారం నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో బ్రైడ్‌ (బేసిక్‌ రీసెర్చ్‌ ఎడ్యుకేషన్‌ అండ్‌ డెవలప్‌మెంట్‌) సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జెడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులకు పుస్తకపఠనం, గ్రంథాలయ నిర్వాహణపై పలు సూచనలు చేశారు. అశోక్‌ కాచె బాలల గ్రంథాలయాలు ఏర్పాటు చేసినందుకు అభినందించారు. ఈ సమావేశంలో డాక్టర్‌ అశోక్‌ కాచె, పెద్దపల్లి జిల్లా డీఈవో మాధవి, బ్రైడ్‌ సొసైటీ ఉపాధ్యక్షులు విజయ్‌ సాయి, ,శశి భూషణ్‌ కాచె, శ్రీనివాస్‌ కాచె, వరహాల శ్రీనివాస్, వివిధ పాఠశాలల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనార్దన్‌రావు

ఎస్‌ఆర్‌ఎస్‌పీ భూములు కాపాడాలి

కరీంనగర్‌ కార్పొరేషన్‌/కరీంనగర్‌ అర్బన్‌: నగరంలోని 18వ డివిజన్‌ రేకుర్తి పరిధిలోని ఎస్‌ఆర్‌ఎస్‌పీ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కార్పొరేటర్‌ సుధగోని మాధవి కృష్ణాగౌడ్‌ ఉన్నతాధికారులను కోరారు. ఈమేరకు శనివారం కలెక్టర్‌ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్‌ లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్, నగరపాలక సంస్థ కమిషనర్‌ బోనగిరి శ్రీనివాస్, ఎస్‌ఆర్‌ఎస్‌పీ ఉన్నతాధికారులకు వినతిపత్రం అందచేశారు. రేకుర్తిలోని డీ 93, 94 ఎస్సారెస్పీ కెనాల్‌కు ఇరువైపులా హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. అక్రమ కట్టడాలు ఉంటే తొలగించాలని, రోడ్డును అభివృద్ధి పరిచి, పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఇక్కడ అధికారులు, కార్పొరేటర్‌ భర్త కబ్జాలు చేస్తున్నారంటూ కొంత మంది దుష్ప్రచారం చేస్తున్నారని, అలాంటిది లేదన్నారు. తాము కార్పొరేటర్‌గా గెలిచిన తర్వాత గౌడ్స్‌ కాలనీ నుంచి రెండు కిలోమీటర్ల మేర రోడ్లు వేసి, చెట్లు నాటించి ఆ స్థలాన్ని కాపాడుతూ వస్తున్నామని తెలిపారు. ఈ భూమిపై సర్వే చేయించి వాస్తవాలు వెల్లడించాలని, ఆక్రమణలు ఉంటే ఆ భూమిని కాపాడాలని కోరారు.



కమిషనర్‌ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న మాధవి

పాలిటెక్నిక్‌ కళాశాలను అప్‌గ్రేడ్‌ చేయాలి

కరీంనగర్‌ సిటీ: కరీంనగర్‌లోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌ కళాశాలను ప్రభుత్వ ఇంజినీరింగ్‌ కళాశాలగా అప్‌గ్రేడ్‌ చేయాలని కోరుతూ తెలంగాణ పాలిటెక్నిక్‌ విద్యార్థుల జేఏసీ రాష్ట్ర చైర్మన్‌ మేకల అక్షయ్‌కుమార్‌ శనివారం ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అక్షయ్‌కుమార్‌ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌ కళాశాలను 2024–25 విద్యా సంవత్సరం నుంచే ప్రభుత్వ మహిళా ఇంజినీరింగ్‌ కళాశాల అప్‌గ్రేడ్‌ చేయాలని కోరారు. ప్రస్తుత మహిళా పాలిటెక్నిక్‌ కళాశాల అభివృద్ధికి,, విద్యార్థినుల ఉన్నత ఇంజినీరింగ్‌ విద్యాభ్యాసానికి ప్రోత్సాహం కలుగుతుందని తెలిపారు. ఈ దిశగా సంబంధిత విద్యాశాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వ మహిళా ఇంజినీరింగ్‌ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.



ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న అక్షయ్‌కుమార్‌

వృద్ధుడి అదృశ్యం

కరీంనగర్‌క్రైం: నగరంలోని మెహర్‌నగర్‌కు చెందిన కొండపల్లి కాశీరావు (91) వృద్ధుడు ఈనెల 26వ తేదీ నుంచి కనిపించడం లేదని తన కుమారుడు జలపతిరావు ఫిర్యాదు చేసినట్లు త్రీటౌన్‌ పోలీసులు తెలిపారు. 26న ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు త్రీటౌన్‌ పోలీసులను సంప్రదించాలని సూచించారు.



కాశీరావు(ఫైల్‌)

ఆటోనగర్‌లో మరో వ్యక్తి..

ఆటోనగర్‌కు చెందిన గాజువాక అంజయ్య(55) ఈనెల 22న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఆయన కుమారుడు అరుణ్‌ వన్‌టౌన్‌ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. 22వ తేదీ నుంచి తెలిసిన వారు, బంధువులు ఇంట్లో వెతికి ఆచూకీ లభించకపోవడంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



అంజయ్య(ఫైల్‌)

మంత్రి పొన్నంకు సన్మానం

విద్యానగర్‌(కరీంనగర్‌): తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యం శనివారం రాత్రి కరీంనగర్‌ ప్రెస్‌భవన్‌లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫోరం బాధ్యులతో పాటు కాంగ్రెస్‌ నాయకులు నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

చొప్పదండి: కొలిమికుంట సర్పంచ్‌ తాళ్ళపల్లి సుజాత భర్త, మాజీ మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ తాళ్ళపల్లి శ్రీనివాస్‌గౌడ్‌ శనివారం కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ నివాసంలో కాంగ్రెస్‌ తీర్థం పుచ్చుకున్నారు.

అలరించిన 'సాధన స్కూల్‌ ఆఫ్‌ ఎక్స్‌లెన్స్‌' వార్షికోత్సవం



కరీంనగర్‌కల్చరల్‌: నగరంలోని సాధన స్కూల్‌ ఆఫ్‌ ఎక్స్‌లెన్స్‌లో శనివారం నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలు అలరించాయి. వేడుకలను పాఠశాల చైర్మన్‌ సీహెచ్‌.శ్రీనివాస్‌రావు, అకాడమిక్‌ డైరెక్టర్‌ నీలిమాలు ప్రారంభించి మాట్లాడుతూ 2004లో పాఠశాల ప్రారంభించినప్పటి నుంచి ఎంతో మంది విద్యార్థులు మంచి చదువు అభ్యసించి వివిధ రంగాల్లో మంచిస్థాయిలో ఉన్నారని అన్నారు. క్రీడలు, వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికేట్స్, మెడల్స్, బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా స్వాతంత్య్ర సమరయోధుల జీవిత గాథ, రైతుల జీవన గమనం, మగువల ప్రాముఖ్యను తెలియజేసే వివిధ రకాల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ వి.కుమారస్వామి, హెచ్‌ఎం.ధనలక్ష్మి, నరేందర్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్‌ పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే

తిమ్మాపూర్‌: ఎల్‌ఎండీ కాలనీలో తెలంగాణ షార్ట్‌ ఫిలిం మేకింగ్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఉమ్మడి కరీంనగర్‌ జిల్లా ఆధ్వర్యంలో క్రికెట్‌ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో షార్ట్‌ ఫిలిమ్స్‌ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు ఐలి రమేశ్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కలర్‌ సత్తన్న, రమేశ్, జిల్లా అధ్యక్షుడు చొప్పరి సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సీతామాలక్ష్మి, కనకవేణి శ్రీనివాస్, శీలం శ్రీనివాస్, అనిత రాజ్, బోనాచారి, గవ్వ రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, యువత అధ్యక్షుడు చెన్నబోయిన రవి తదితరులు పాల్గొన్నారు.



బ్యాటింగ్‌ చేసి పోటీలు ప్రారంభిస్తున్న కవ్వంపల్లి

నూతన జాతీయ విద్యావిధానం రద్దు చేయాలి

జమ్మికుంట: నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్‌ డిమాండ్‌ చేశారు. శనివారం పట్టణంలో ఏఐఎస్‌ఎఫ్‌ ఆధ్వర్యంలో విద్యార్థుల నుంచి రిజెక్ట్‌ బీజేపీ, రిజెక్ట్‌ ఎన్‌ఈపీ, సేవ్‌ ఇండియా, సేవ్‌ ఎడ్యూకేషన్‌ అనే డిమాండ్లతో సంతకాల సేకరణ చేపట్టారు. ప్రభుత్వం విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి పేద, మధ్యతరగతి వర్గాలకు విద్యను దూరం చేసే కుట్ర అమలు చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగా కేంద్రం నూతన జాతీయ విద్యావిధానం తీసుకొచ్చిందని ఆరోపించారు. విద్యా కార్పొరేటీకరణ, కాషాయీకరణ చేయాలని కేంద్రం కుట్ర పన్నుతోందని, దేశంలో జాతీయ విద్యావిధానం వల్ల 90శాతం విద్యార్థులు నాణ్యమైన విద్య పొందే హక్కును కోల్పోతారని అన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు కనుకం సాగర్, జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము, తదితరులు పాల్గొన్నారు.



సంతకాల సేకరణ చేస్తున్న నాయకులు

నాణ్యమైన భోజనం అందించాలి

జమ్మికుంట: విద్యార్థులకు నాణ్యమైన మంచి భోజనం అందించాలని జమ్మికుంట జెడ్పీటీసీ డాక్టర్‌ శ్రీరామ్‌శ్యామ్‌ అన్నారు. శనివారం పట్టణంలో కస్తూర్బా పాఠశాలను ఎంఈవో విడుపు శ్రీనివాస్‌తో కలిసి సందర్శించారు. పాఠశాలలో పరిశుభ్రత, బోధన విషయాలపై విద్యార్థులనడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం ఎంతగానో ఖర్చు చేస్తోందని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని సూచించారు. క్లస్టర్‌ అధికారి సురేష్, తిరుపతి, కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీరామ్‌శ్యామ్‌

నగరంలో నేడు

ఆర్టీసీలో కారుణ్య నియామక పత్రాలు అందజేత

విద్యానగర్‌(కరీంనగర్‌): ఆర్టీసీలో ఉద్యోగం చేస్తూ మరణించిన, మెడికల్‌ అన్‌ఫిట్‌ అయిన ఉద్యోగుల పిల్లలకు కారుణ్య నియామకపత్రాలను ఆదివారం సాయంత్రం కరీంనగర్‌ టూ డిపోలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ చేతుల మీదుగా అందజేయనున్నట్లు కరీంనగర్‌ రీజినల్‌ మేనేజర్‌ ఎస్‌.సుచరిత తెలిపారు. కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం రీజియన్లకు చెందిన 46 మందికి కారుణ్య నియామక పత్రాలు అందజేస్తున్నామని అన్నారు.

వేదభవనంలో గోదారంగనాథ కల్యాణం

కరీంనగర్‌కల్చరల్‌: నగర శివారులోని వేదభవనంలో త్రిదండి అహోబిలం రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఆదివారం ఉదయం 10.30 గంటలకు వికాసతరంగిణి ఆధ్వర్యంలో గోదారంనాథ కల్యాణం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు కె.గౌతమ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటలకు తీర్థగోష్టి ఉంటుందని, కల్యాణం అనంతరం తీర్థప్రసాద వితరణ, అన్నదానం జరుగుతుందని అన్నారు. వికాసతరంగిణి, జెట్‌ బాధ్యులు భక్తులు పాల్గొనాలని కోరారు.

ఉదయ సాహితీ ఆవిర్భావ దినోత్సవం

కరీంనగర్‌కల్చరల్‌: నగరంలోని ముకరాంపురలో గల వాగేశ్వరీ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఉదయ సాహితీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు ఎర్రం రాజిరెడ్డి, రేళ్ల సంజీవ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి కవితల పోటీల విజేతలకు బహుమతులను ప్రధానం ఉంటుందన్నారు. ముఖ్య అతిథిగా డాక్టర్‌ ఎడవెల్లి విజేందర్‌ రెడ్డి, అతిథులుగా దాస్యం లక్ష్మయ్య, దాస్యం సేనాధిపతి, నంది శ్రీనివాస్, వైరాగ్యం ప్రభాకర్, వకుళ వాసు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. కవులు, రచయితలు పాల్గొనాలని కోరారు.

'అనగనగా మా బడి పిల్లలు' పుస్తకం ఆవిష్కరణ

కరీంనగర్‌కల్చరల్‌: తెలుగు ఉపాధ్యాయుడు మాడుగుల రాములు సంపాదకునిగా విద్యార్థులు రచించిన 'అనగనగా మాబడి పిల్లలు' కథల పుస్తకాన్ని ఆదివారం నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఆవిష్కరించనున్నారు. ఉపాధ్యాయులు, కుటుంబసభ్యులు, స్నేహితులు చెప్పిన నీతి కథలను 84 మంది చిన్నారులు తమ సొంత మాటల్లో రాశారు. ఈ పుస్తకావిష్కరణకు మంత్రి పొన్నం ప్రభాకర్, జెడ్పీ చైర్‌పర్సన్‌ కె.విజయ, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, మేడిపల్లి సత్యం, కలెక్టర్‌ పమేలా సత్పతి హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పవర్‌కట్‌ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్‌ అభివృద్ధి పనులు చేపడుతున్నందున ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 11కేవీ సాయికృష్ణ ఫీడర్‌ పరిధిలోని తెలంగాణచౌక్‌ నుంచి మున్సిపల్‌ ఆఫీసు వరకు, పోలీస్‌ హెడ్‌ క్వార్టర్స్, వన్‌టౌన్‌ పోలీస్‌స్టేషన్, బస్టాండ్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్‌–2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్‌ తెలిపారు. విద్యుత్‌ వినియోగదారులు సహకరించాలని కోరారు.



క్వార్టర్ ఫైనల్లో శ్రీజ పరాజయం

వరల్డ్ టేబుల్ టెన్నిస్ కంటెండర్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో భారత క్రీడాకారిణుల పోరాటం ముగిసింది. బరిలో మిగిలిన జాతీయ మాజీ చాంపియన్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ క్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగింది. గోవాలో శనివారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో శ్రీజ 5–11, 11–7, 6–11, 4–11తో చెంగ్ ఐ చింగ్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయింది. శ్రీజకు 2,500 డాలర్ల (రూ. 2 లక్షలు) ప్రైజ్‌మనీ, 105 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



నేడు అమెరికాతో యువ భారత్ 'ఢీ'

అండర్–19 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో ఉదయ్ సహారణ్ నాయకత్వంలోని టీమిండియా నేడు గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో అమెరికా జట్టుతో తలపడనుంది. తొలి రెండు లీగ్ మ్యాచ్‌ల్లో బంగ్లాదేశ్, ఐర్లాండ్‌పై గెలిచి 'సూపర్ సిక్స్' బెర్త్‌ను ఖరారు చేసుకున్న భారత్ ఈ మ్యాచ్‌లోనూ గెలిచి లీగ్ దశను అజేయంగా ముగించాలని పట్టుదలతో ఉంది. మధ్యాహ్నం గం. 1:30 నుంచి జరిగే ఈ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్ చానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.


పోప్

పోప్ సెంచరీ తాలింపు...

శతకంతో చెలరేగిన ఒలీ పోప్ ● రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 316/6
ప్రస్తుతం 126 పరుగులు ముందంజలో ● తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 436 ఆలౌట్

తొలి టెస్టు మూడో రోజు ఆట మొదలైనప్పుడు భారత్ 175 పరుగుల ఆధిక్యంలో ఉంది. టీమ్ ఆలౌట్ అయ్యే సమయానికి ఆ ఆధిక్యం 190 పరుగులకు చేరింది. ముందుగా ఈ లోటును పూడ్చుకునే ప్రయత్నంలో బరిలోకి దిగిన ఇంగ్లండ్ శనివారం ఆట ముగిసేసరికి 126 పరుగులు ముందంజలో నిలిచింది. ప్రతికూల పరిస్థితుల్లోనూ బ్యాటర్ల పోరాటం జట్టును ఇక్కడి వరకు తీసుకొచ్చింది. ముఖ్యంగా ఒలీ పోప్ అద్భుత బ్యాటింగ్‌తో చిరస్మరణీయ ప్రదర్శన చేశాడు. ఈ ఇన్నింగ్స్‌కు ముందు భారత గడ్డపై 9 ఇన్నింగ్స్‌లలో కలిపి 154 పరుగులే చేసిన పోప్ ఈ ఇన్నింగ్స్‌లోనే దాదాపు అన్నే పరుగులు సాధించడం విశేషం. అతని స్వీప్, రివర్స్ స్వీప్ షాట్లకు భారత స్పిన్నర్ల వద్ద జవాబు లేకపోయింది. ఆధిక్యం మరీ ఎక్కువ కాదు కాబట్టి ఈ మ్యాచ్ ఇంకా టీమిండియా చేతుల్లోనే ఉంది. అయితే మారిపోతున్న పిచ్‌పై నాలుగో ఇన్నింగ్స్ సవాల్‌ను రోహిత్ బృందం ఎంత సమర్థంగా ఎదుర్కొంటుందన్నది ఆసక్తికరం.



సాక్షి, హైదరాబాద్: భారత్‌తో జరుగుతున్న తొలి టెస్టులో మూడో రోజు ఇంగ్లండ్ మెరుగైన ప్రదర్శన కనబర్చింది. ఓటమి ఖాయమనిపించే స్థితి నుంచి కోలుకొని ఇంకా పోరాడుతోంది. శనివారం ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 77 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 316 పరుగులు చేసింది. ఒలీ పోప్ (208 బంతుల్లో 148 బ్యాటింగ్; 17 ఫోర్లు) అజేయ సెంచరీతో చెలరేగాడు. ప్రస్తుతం ఇంగ్లండ్ 126 పరుగులు ముందంజలో ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 421/7తో ఆట కొనసాగించిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 121 ఓవర్లలో 436 పరుగులకు ఆలౌటైంది. రవీంద్ర జడేజా (180 బంతుల్లో 87; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీ అవకాశాన్ని కోల్పోయాడు.

మరో 15 పరుగులు జోడించి...

మూడో రోజు భారత్ తొలి ఇన్నింగ్స్ ముగిసేందుకు 11 ఓవర్లు సరిపోయాయి. ఒకే స్కోరు వద్ద జట్టు చివరి 3 వికెట్లు కోల్పోయింది. రూట్ వరుస బంతుల్లో జడేజా, బుమ్రా (0)లను అవుట్ చేయగా... తర్వాతి ఓవర్లో అక్షర్ పటేల్ (100 బంతుల్లో 44; 7 ఫోర్లు, 1 సిక్స్)ను రేహన్ బౌల్డ్ చేశాడు.

రాణించిన డకెట్...

తొలి ఇన్నింగ్స్‌లాగే రెండో ఇన్నింగ్స్‌లోనూ ఇంగ్లండ్ శుభారంభం చేసింది. క్రాలీ (33 బంతుల్లో 31; 4 ఫోర్లు, 1 సిక్స్), డకెట్ కలిసి చకచకా పరుగులు జోడించారు. అశ్విన్ చక్కటి బంతితో క్రాలీని అవుట్ చేసి ఈ భాగస్వామ్యాన్ని విడదీసినా... డకెట్, పోప్ జోరుగా ఆడటంతో తొలి సెషన్ ముగిసేసరికి జట్టు 6 రన్‌రేట్‌తో 15 ఓవర్లలోనే 89 పరుగులు చేసింది. అయితే లంచ్ తర్వాత భారత బౌలర్లు ఒక్కసారిగా చెలరేగిపోయారు. బుమ్రా బౌలింగ్‌లో డకెట్ ఎల్బీ అయ్యే అవకాశం ఉన్నా... భారత్ రివ్యూ తీసుకోకపోవడంతో అతను బతికిపోయాడు. రీప్లేలో బంతి స్టంప్స్‌ను తాకేదని తేలడంతో బుమ్రా తీవ్రంగా నిరాశ చెందాడు. అయితే తన తర్వాతి ఓవర్లో అద్భుత బంతితో డకెట్‌ను బౌల్డ్ చేసిన భారత పేసర్ భావోద్వేగం ప్రదర్శించాడు. జట్టు టాప్ బ్యాటర్ రూట్ (6 బంతుల్లో 2)ను కూడా తన తర్వాతి ఓవర్లోనే బుమ్రా అవుట్ చేశాడు. జడేజా బంతిని ఆడకుండా వదిలేసి బెయిర్‌స్టో (24 బంతుల్లో 10; 1 ఫోర్) బౌల్డ్ కాగా... బెన్ స్టోక్స్ (33 బంతుల్లో 6)కు వరుసగా మూడు ఓవర్లు మెయిడిన్ వేసి ఒత్తిడి పెంచిన అశ్విన్ అదే జోరులో చక్కటి బంతితో అతని ఆట కట్టించాడు. మరోవైపు పోప్ మాత్రం చక్కటి షాట్లతో పరుగులు రాబడుతూ 54 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

భారీ భాగస్వామ్యం...

స్టోక్స్ ఐదో వికెట్‌గా వెనుదిరిగినప్పుడు ఇంగ్లండ్ స్కోరు 163/5. ఆ జట్టు మరో 27 పరుగులు వెనుకబడి ఉంది. ఈ దశలో భారత్ మిగిలిన వికెట్లను టపటపా పడగొట్టి మ్యాచ్‌ను ముగిస్తుందని అనిపించింది. అయితే మరో 30 ఓవర్ల పాటు పోప్, బెన్ ఫోక్స్ (81 బంతుల్లో 34; 2 ఫోర్లు) కలిసి భారత బౌలర్లను ఆడుకున్నారు. చక్కటి సమన్వయంతో బ్యాటింగ్ చేస్తూ పరుగులు రాబట్టారు. ఆరంభంలో కుదురుకునేందుకు కొంత సమయం తీసుకున్న తర్వాత ధాటిగా ఆడారు. భారత బౌలర్లలోనూ ఎవరూ వీరిని ఇబ్బంది పెట్టలేకపోయారు. దాంతో ముందుగా తొలి ఇన్నింగ్స్ లోటును పూడ్చుకున్న ఇంగ్లండ్... ఆ తర్వాత ఆధిపత్యాన్ని పెంచుకుంటూ పోయింది. ఈ క్రమంలో పోప్ 154 బంతుల్లో తన కెరీర్‌లో ఐదో టెస్టు సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆరో వికెట్‌కు పోప్‌తో 112 పరుగులు జత చేసిన ఫోక్స్‌ను అక్షర్ బౌల్డ్ చేయడంతో భారత్‌కు ఎట్టకేలకు ఊరట లభించింది. అయితే రేహన్ (31 బంతుల్లో 16 బ్యాటింగ్; 2 ఫోర్లు) కలిసి పోప్ మరో వికెట్ పడకుండా మూడో రోజును జాగ్రత్తగా ముగించాడు. చివరి సెషన్‌లో ఇంగ్లండ్ 35 ఓవర్లలో ఒకే వికెట్ కోల్పోయి 144 పరుగులు సాధించింది. 110 పరుగుల వద్ద పోప్ ఇచ్చిన క్యాచ్‌ను అక్షర్ వదిలేయడం కూడా జట్టుకు కలిసొచ్చింది.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 246 ఆలౌట్; భారత్ తొలి ఇన్నింగ్స్: 436 ఆలౌట్; ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలీ (సి) రోహిత్ (బి) అశ్విన్ 31; డకెట్ (బి) బుమ్రా 47; పోప్ (బ్యాటింగ్) 148; రూట్ (ఎల్బీ) (బి) బుమ్రా 2; బెయిర్‌స్టో (బి) జడేజా 10; స్టోక్స్ (బి) అశ్విన్ 6; ఫోక్స్ (బి) అక్షర్ 34; రేహన్ (బ్యాటింగ్) 16; ఎక్స్‌ట్రాలు 22; **మొత్తం (77 ఓవర్లలో 6 వికెట్లకు) 316. వికెట్ల పతనం:** 1–45, 2–113, 3–117, 4–140, 5–163, 6–275. **బౌలింగ్:** బుమ్రా 12–3–29–2, అశ్విన్ 21–3–93–2, అక్షర్ 15–2–69–1, జడేజా 26–1–101–1, సిరాజ్ 3–0–8–0.

సుదీర్ఘ నిరీక్షణ ముగిసింది. ఎట్టకేలకు భారత టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న 'గ్రాండ్‌స్లామ్' పురుషుల డబుల్స్ టైటిల్ స్వప్నం సాకారమైంది. 61వ ప్రయత్నంలో బోపన్న ఈ ఘనత సాధించాడు. గత ఐదేళ్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల డబుల్స్ విభాగంలో తొలి రౌండ్‌లోనే ఓడిపోయిన బోపన్న... ఆస్ట్రేలియాకు చెందిన మాథ్యూ ఎబ్డెన్‌తో కలిసి ఈసారి చాంపియన్‌గా అవతరించాడు. పురుషుల టెన్నిస్ చరిత్రలో గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గిన అతి పెద్ద వయస్కుడిగా బోపన్న (43 ఏళ్ల 329 రోజులు) ప్రపంచ రికార్డు సృష్టించాడు. నెదర్లాండ్స్ ప్లేయర్ జీన్ జూలియన్ రోజర్ (40 ఏళ్ల 9 నెలలు : 2022లో ఫ్రెంచ్ ఓపెన్ డబుల్స్ టైటిల్) పేరిట ఉన్న ఈ రికార్డును బోపన్న బద్దలు కొట్టాడు. ఓవరాల్‌గా ఈ రికార్డు మార్టినా నవ్రతిలోవా (46 ఏళ్ల 261 రోజులు : 2003లో యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్) పేరిట ఉంది.


విన్నర్స్ ట్రోఫీతో బోపన్న, ఎబ్డెన్

'గ్రాండ్'సలామ్ బోపన్న...

● 61వ ప్రయత్నంలో సాకారమైన గ్రాండ్‌స్లామ్ డబుల్స్ టైటిల్ స్వప్నం
● 43 ఏళ్ల వయసులో ఆస్ట్రేలియన్ ఓపెన్ డబుల్స్ టైటిల్ సొంతం
● టెన్నిస్ చరిత్రలో గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిచిన పెద్ద వయస్కుడిగా రికార్డు

మెల్‌బోర్న్: గత 17 ఏళ్లుగా రోహన్ బోపన్న చేస్తున్న అలుపెరుగని పోరాటానికి ప్రతిఫలం లభించింది. టెన్నిస్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా)తో కలిసి బోపన్న పురుషుల డబుల్స్ టైటిల్‌ను దక్కించుకున్నాడు. శనివారం జరిగిన ఫైనల్లో రెండో సీడ్ బోపన్న–ఎబ్డెన్ ద్వయం 7–6 (7/0), 7–5తో సిమోన్ బొలెలీ–ఆంద్రియా వవాసోరి (ఇటలీ) జోడీపై గెలిచింది. గంటా 39 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న జంట ఎనిమిది ఏస్‌లు సంధించింది. నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తొలి సెట్‌లో రెండు జోడీలు తమ సర్వీస్‌లను నిలబెట్టుకోవడంతో టైబ్రేక్ అనివార్యమైంది. టైబ్రేక్‌లో బోపన్న–ఎబ్డెన్ పూర్తి ఆధిపత్యం చలాయించారు. రెండో సెట్‌లోని 11వ గేమ్‌లో ఇటలీ జంట సర్వీస్‌ను బ్రేక్ చేసి 12వ గేమ్‌లో బోపన్న ద్వయం తమ సర్వీస్‌ను కాపాడుకొని విజయాన్ని ఖాయం చేసుకుంది. విజేతగా నిలిచిన బోపన్న–ఎబ్డెన్ జంటకు 7,30,000 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 3 కోట్ల 98 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

2003లో ప్రొఫెషనల్‌గా మారిన బోపన్న 2008లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో బరిలోకి దిగాడు. నాటి నుంచి ఇప్పటివరకు 61 గ్రాండ్‌స్లామ్ టోర్నీలు ఆడిన బోపన్నకు పురుషుల డబుల్స్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ అందని ద్రాక్షలా మారింది. ఎట్టకేలకు 61వ ప్రయత్నంలో ఈ ఏడాది బోపన్న కల నెరవేరింది. పురుషుల డబుల్స్‌లో అతని ఖాతాలో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ చేరింది. 2017లో బోపన్న కెనడా అమ్మాయి గాబ్రియేలా దబ్రౌస్కీతో కలిసి ఫ్రెంచ్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో టైటిల్ సాధించాడు. పురుషుల డబుల్స్‌లో బోపన్న 2013లో పాక్ ప్లేయర్ ఐజామ్ ఖురేషితో యూఎస్ ఓపెన్‌లో... ఎబ్డెన్‌తో కలిసి 2023 యూఎస్ ఓపెన్‌లో ఫైనల్‌కు చేరాడు. అయితే ఈ రెండుసార్లూ బోపన్న జోడీ ఓడిపోయి రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకుంది. అయితే మూడో ప్రయత్నంలో బోపన్న విజయవంతమయ్యాడు. 'నా జీవితంలో అత్యంత మధురక్షణాలవి. రెండేళ్ల క్రితం వరుసగా ఐదు నెలలపాటు ఒక్క మ్యాచ్‌లోనూ గెలవలేకపోయాను. దాంతో వీడ్కోలు పలికే సమయం వచ్చేసిందని భావించాను. అయితే నా నిరంతరశ్రమ, గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలవాలనే బలీయమైన కాంక్ష నన్ను ఆటలో కొనసాగేలా చేసింది' అని బోపన్న వ్యాఖ్యానించాడు. లియాండర్ పేస్, మహేశ్ భూపతి తర్వాత పురుషుల డబుల్స్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గిన మూడో భారతీయ ప్లేయర్‌గా బోపన్న నిలిచాడు. సోమవారం ఏటీపీ పురుషుల డబుల్స్ ర్యాంకింగ్స్‌లో బోపన్న తొలిసారి వరల్డ్ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకోనున్నారు. ఈ ఘనత సాధించనున్న అతి పెద్ద వయస్కుడిగా బోపన్న రికార్డు సృష్టించనున్నాడు.

సబలెంకా... మళ్లీ చాంపియన్

ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ నిలబెట్టుకున్న బెలారస్ స్టార్
ఏకపక్షంగా జరిగిన ఫైనల్లో చైనా ప్లేయర్ జెంగ్ కిన్‌వెన్‌పై విజయం

మెల్‌బోర్న్: బెలారస్ టెన్నిస్ స్టార్, డిఫెండింగ్ చాంపియన్ సబలెంకా ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను నిలబెట్టుకుంది. వరుసగా రెండో ఏడాదీ మహిళల సింగిల్స్‌లో ఆమె విజేతగా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్లో రెండోసీడ్ సబలెంకా 76 నిమిషాల్లో 6–3, 6–2తో చైనాకు చెందిన 12వ సీడ్ జెంగ్ కిన్‌వెన్‌పై గెలిచింది. విజేత సబలెంకాకు 31,50,000 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 17 కోట్ల 21 లక్షలు), రన్నరప్ జెంగ్ కిన్‌వెన్‌కు 17,25,000 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 9 కోట్ల 42 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

తొలిసెట్‌లో రెండో గేమ్‌లోనే ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసిన సబలెంకకు ఈ సెట్ గెలిచేందుకు ఎంతోసేపు పట్టలేదు. రెండో సెట్లోనూ రెండు బ్రేక్ పాయింట్లను సాధించిన 25 ఏళ్ల బెలారస్ స్టార్ ఈ మ్యాచ్‌లో 3 ఏస్‌లను సంధించి, 14 విన్నర్లు కొట్టింది. 14 అనవసర తప్పిదాలు చేసింది. ఒక్కసారి కూడా డబుల్‌ఫాల్ట్ చేయకుండా జాగ్రత్తగా ఆడింది. జెంగ్ 6 ఏస్‌లతో రాణించినప్పటికీ 6 డబుల్ ఫాల్ట్‌లు, 16 అనవసర తప్పిదాలతో టైటిల్‌కు దూరమైంది. గత 13 నెలల్లో ప్రతీ టోర్నీలోనూ మెరుగవుతున్న సబలెంకా జోరు ముందు ఏమాత్రం నిలువలేకపోయింది. గత సీజన్‌లో ఆరంభ గ్రాండ్‌స్లామ్ గెలిచిన బెలారస్ అమ్మాయి ఆఖరి గ్రాండ్‌స్లామ్ యూఎస్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచింది. మధ్యలో ఫ్రెంచ్, వింబుల్డన్ ఓపెన్‌లలోనూ సెమీఫైనల్ వరకు పోరాడింది. యూఎస్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్లో సబలెంకా చేతిలోనే ఓడి ఇంటిదారి పట్టిన 21 ఏళ్ల జెంగ్ కిన్‌వెన్ ఇప్పుడు ఆమె జోరుకు రన్నరప్‌తో సరిపెట్టుకోవాల్సివచ్చింది. తద్వారా మళ్లీ ఈ ఏడాదీ కొత్త సీజన్‌కు గ్రాండ్‌గా వెల్‌కమ్ చెప్పిన సబలెంకా ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అజరెంకా (2012, 2013) తర్వాత వరుస టైటిల్స్ గెలిచిన ప్లేయర్‌గా ఘనతకెక్కింది. 2000 తర్వాత సెట్ కోల్పోకుండా ఇక్కడ విజేతగా నిలిచిన ఐదో క్రీడాకారిణిగా సబలెంకా నిలిచింది.


సబలెంకా

రన్నరప్ భారత్

మస్కట్: మహిళల హాకీ ఫైవ్స్ ప్రపంచకప్ టోర్నీలో భారత జట్టు రన్నరప్‌గా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి ఇతిమరపు రజని కెప్టెన్సీలోని భారత జట్టు 2–7 గోల్స్ తేడాతో నెదర్లాండ్స్ జట్టు చేతిలో ఓడిపోయింది. భారత్ తరఫున జ్యోతి ఛత్రి (20వ ని.లో), రుతుజా (23వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ఈ టోర్నీలో తెలంగాణకు చెందిన యెండల సౌందర్య భారత జట్టుకు హెడ్ కోచ్‌గా వ్యవహరించింది.


హైదరాబాద్ భారీ విజయం

సాక్షి, హైదరాబాద్: అరుణాచల్‌ప్రదేశ్‌తో జరిగిన రంజీ ట్రోఫీ ప్లేట్ డివిజన్ మ్యాచ్‌లో హైదరాబాద్ ఇన్నింగ్స్ 187 పరుగుల తేడాతో గెలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 529/1తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన హైదరాబాద్ 59.3 ఓవర్లలో 615/4 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. తన్మయ్ అగర్వాల్ (181 బంతుల్లో 366; 34 ఫోర్లు, 26 సిక్స్‌లు) తొందరగా అవుటయ్యాడు. 443 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ఆడిన అరుణాచల్ ప్రదేశ్ 53.4 ఓవర్లలో 256 పరుగులకే కుప్పకూలింది.

ఆంధ్ర 431 ఆలౌట్

రంజీ ట్రోఫీ 'ఎలైట్' డివిజన్‌లో ఛత్తీస్‌గఢ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 431 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 277/4తో రెండో రోజు ఆట కొనసాగించిన ఆంధ్ర మరో 154 పరుగులు జతచేసింది. ఛత్తీస్‌గఢ్ ఆట ముగిసేసరికి తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లకు 118 పరుగులు చేసింది.

సినిమా


రజనీకాంత్

విజయ్‌తో కాదు... నాతో నాకే పోటీ

''నాకు, విజయ్‌కు మధ్య పోటీ లేదు. తనకు తానే పోటీ అని విజయ్ అంటుంటాడు. నేనూ అంతే. నాకు పోటీ నేనే'' అన్నది రజనీకాంత్ లేటెస్ట్ స్టేట్మెంట్. 'లాల్‌సలామ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రజనీకాంత్ ఈ విధంగా మాట్లాడారు. దీనికి ఓ కారణం ఉంది. 'జైలర్' సినిమా ఆడియో ఫంక్షన్ వేదికగా రజనీకాంత్ ఓ డేగ, కాకి కథ చెప్పారు. 'కాకులు ఎంత అరిచినా వాటి అరుపులు పట్టించుకోకుండా డేగ ఆకాశానికి ఎగురుతూనే ఉంటుంది' అంటూ తన జర్నీని ఉద్దేశించి ఆ కథ చెప్పారు రజనీ. దాంతో విజయ్‌ను ఉద్దేశించే ఆ కథ చెప్పారని కొందరు విజయ్ ఫ్యాన్స్, నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా అభ్యంతరకరమైన కామెంట్స్ చేశారు. ఈ విషయంపై తాజాగా చెన్నైలో జరిగిన 'లాల్ సలామ్' ఆడియో లాంచ్ వేదికగా రజనీకాంత్ స్పందించారు. ''జైలర్' ఫంక్షన్‌లో నేను చెప్పిన కథ తప్పుగా ప్రచారంలోకి వెళ్లింది. విజయ్‌ని ఉద్దేశించే నేను ఆ కథ చెప్పానని ప్రచారం జరగడం బాధగా అనిపించింది. 'ధర్మత్తిన్ తలైవన్' సినిమా షూటింగ్ టైమ్‌లో విజయ్ తండ్రి చంద్రశేఖర్ నాకు అతన్ని పరిచయం చేసి, విజయ్ నటనపట్ల ఆసక్తిగా ఉన్నాడని చెప్పారు. చదువు పూర్తి చేశాక ఇండస్ట్రీలోకి రావాలని విజయ్‌కి సలహా ఇచ్చాను. తన చిన్నప్పట్నుంచి చూస్తున్నాను. ప్రతిభ, క్రమశిక్షణ, కష్టంతో విజయ్ పెద్ద స్టార్‌గా ఎదిగాడు. ఇక్పై మా ఇద్దరి మధ్య పోటీ పెట్టొద్దని ఫ్యాన్స్‌ని కోరుతున్నాను'' అన్నారు. ఇక ఐశ్వర్య దర్శకత్వంలో రూపొందిన 'లాల్ సలామ్' ఫిబ్రవరి 9న రిలీజ్ కానుంది.


'భ్రమయుగం' పోస్టర్

ఆ రోజే భ్రమయుగం

మమ్ముట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న మలయాళ చిత్రం 'భ్రమయుగం'. రాహుల్ సదాశివన్ దర్శకత్వం వహిస్తున్నారు. చక్రవర్తి రామచంద్ర, ఎస్. శశికాంత్ నిర్మిస్తున్న ఈ సినిమా థియేటర్స్‌కి వచ్చే రోజు ఖరారైంది. ఫిబ్రవరి 15న ఈ చిత్రాన్ని మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ''హారర్–థ్రిల్లర్ జానర్‌లో ప్రతిష్టాత్మకంగా రూపొందుతోన్న చిత్రమిది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: షెహనాద్ జలాల్, సంగీతం: క్రిస్టో జేవియర్.


బాబీ డియోల్

రూత్‌లెస్... పవర్‌ఫుల్

రూత్‌లెస్..పవర్‌ఫుల్..అన్‌ఫర్‌గెటబుల్... ఇవన్నీ ఒకరి గురించే. అతనే ఉధిరన్. 'కంగువ' సినిమాలో బాబీ డియోల్ పాత్ర పేరు 'ఉధిరన్'. జనవరి 27 బాబీ డియోల్ బర్త్ డే. ఈ సందర్భంగా 'కంగువ' సినిమాలో ఆయన పోషిస్తున్న ఉధిరన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. సూర్య హీరోగా శివ దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ ఫ్యాంటసీ ఫిల్మ్ ఇది. ఇందులో దిశా పటానీ హీరోయిన్‌గా, ఓ కీలక పాత్రలో బాబీ డియోల్ నటిస్తున్నారు. కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న ఈ పాన్ వరల్డ్ మూవీ పదికి పైగా భాషల్లో, త్రీడీలోనూ విడుదల కానుంది. ''ఉధిరన్‌గా యునిక్ మేకోవర్‌లో కనిపిస్తారు బాబీ డియోల్. యుద్ధానికి సిద్ధం అవుతున్న ఉధిరన్‌కు ఆయన ప్రజలు మద్దతు తెలుపుతున్నట్లుగా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశాం. త్వరలోనే ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ సంగతి ఇలా ఉంచితే... బాలకృష్ణ హీరోగా బాబీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాలో బాబీ డియోల్ ఓ కీలక పాత్ర పోషిస్తున్న విషయాన్ని చిత్ర యూనిట్ శనివారం అధికారికంగా ప్రకటించింది.

హనుమాన్ నా బాధ్యత పెంచింది
– ప్రశాంత్ వర్మ


చైతన్య, వరలక్ష్మి, తేజ సజ్జా, అమృతా అయ్యర్, ప్రశాంత్ వర్మ, నిరంజన్ రెడ్డి

''హనుమాన్' సినిమా విజయానికి కారణమైన ప్రేక్షకులకు ధన్యవాదాలు. మీ అందరి రుణం 'జై హనుమాన్' సినిమాతో తీర్చుకోబోతున్నాను. 'హనుమాన్'కి వంద రెట్లు ఎక్కువగా 'జై హనుమాన్' ఉంటుంది'' అని డైరెక్టర్ ప్రశాంత్ వర్మ అన్నారు. తేజ సజ్జా, అమృతా అయ్యర్ జంటగా వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'హనుమాన్'. ప్రశాంత్ వర్మ దర్శకుడు. చైతన్య సమర్పణలో కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా జనవరి 12న విడుదలైంది. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ–''హనుమాన్'కి వచ్చిన స్పందన చూసిన తర్వాత నా కళ్లలో నీళ్లు తిరిగాయి. ఇది నాపై ఇంకా బాధ్యత పెంచింది. ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్స్‌కి వచ్చే చిత్రాలను బాధ్యతగా తీస్తాను'' అన్నారు. ''మా చిత్రాన్ని ఆదరించిన ప్రేక్షకులకు పాదాభివందనం'' అన్నారు తేజ. ''హనుమాన్'ని హిట్ చేసిన ఆడియన్స్‌కి థ్యాంక్స్'' అన్నారు నిరంజన్ రెడ్డి.

నలుగురు స్నేహితుల కథ

హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'రోటి కపడా రొమాన్స్'. విక్రమ్ రెడ్డి దర్శకత్వంలో బెక్కెం వేణుగోపాల్, సృజన్ కుమార్ బొజ్జం నిర్మించిన ఈ సినిమాని మార్చి 22న రిలీజ్ చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ– ''నలుగురు స్నేహితుల కథే 'రోటి కపడా రొమాన్స్'. ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌లో కుటుంబ ప్రేక్షకులను అలరించే భావోద్వేగాలు కూడా ఉన్నాయి'' అన్నారు.


నువేక్ష, తరుణ్

సస్పెన్స్ బహుముఖం


హర్షివ్ కార్తీక్

హర్షివ్ కార్తీక్ హీరోగా నటించి, రచించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'బహుముఖం'. 'గుడ్, బ్యాడ్ – యాక్టర్' అనేది ట్యాగ్‌లైన్. క్రిస్టల్ మౌంటైన్ ప్రొడక్షన్స్‌పై రూపొందిన ఈ చిత్రంలో స్వర్ణిమా సింగ్, మరియా మార్టినోవా హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రం నుంచి హర్షివ్ కార్తీక్ ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా హర్షివ్ కార్తీక్ మాట్లాడుతూ– ''సస్పెన్స్, డ్రామా, థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'బహుముఖం'. ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: అరవింద్ రెడ్డి, కెమెరా: ల్యూక్ ఫ్లెచర్, నేపథ్య సంగీతం: శ్రీచరణ్ పాకాల, సంగీతం: ఫణి కల్యాణ్.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

సిరిసిల్ల చేనేత సమస్యల పరిష్కారమే లక్ష్యం: తుమ్మల



సాక్షి, హైదరాబాద్: సిరిసిల్ల చేనేత కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని, చేనేత కార్మికుల నష్టాలను అధిగమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోందని వ్యవసాయ, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో చేనేత కార్మికుల సమస్యలపై సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మహేందర్ రెడ్డి, ఇతర అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. చేనేత కార్మికుల సమస్యలను మంత్రి దృష్టికి మహేందర్‌రెడ్డి తీసుకొచ్చారు. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో తుమ్మల ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఆసుపత్రుల సిబ్బంది, పోలీసుల యూనిఫామ్‌లను సిరిసిల్ల చేనేత సంస్థలకు కాంట్రాక్టు ఇస్తే కార్మికులకు ఏడాదంతా పని ఉంటుందని, కార్మికులు ఆర్థికంగా ఎదుగుతారని పేర్కొన్నారు. కార్మికులు, పరిశ్రమల మనుగడను దృష్టిలో పెట్టుకొని ఈ విషయాలను పరిగణనలోకి తీసుకొని అమలు చేసే విధంగా కృషి చేయాలని కోరారు.

ట్రాన్స్‌కో, జెన్‌కోకు కొత్త డైరెక్టర్లు

నియమించాలని ఇంధన శాఖ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సరఫరా సంస్థ (ట్రాన్స్‌కో), తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ (టీఎస్ జెన్‌కో)లో కొత్త డైరెక్టర్ల నియామకానికి చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ట్రాన్స్‌కో జేఎండీ సహా మరో నలుగురు డైరెక్టర్లు, జెన్‌కోలో ఆరుగురు డైరెక్టర్ల నియామకం నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని ఉత్తర్వుల్లో తెలిపారు. తొలుత రెండేళ్ల పదవీకాలానికి వారిని నియమించగా ఆ తర్వాత గరిష్టంగా మరో రెండేళ్లే పెంచేందుకు నిబంధనలు అనుమతిస్తున్నాయని గుర్తుచేశారు. కానీ నిబంధనలకు విరుద్ధంగా వారి పదవీకాలం పొడిగించారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నిబంధనలను అనుసరించి కొత్తగా డైరెక్టర్ల నియామకం చేపట్టాలని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీని ఆదేశించారు.

త్వరలో దరఖాస్తుల స్వీకరణ..

ప్రభుత్వ ఉత్తర్వుల నేపథ్యంలో ట్రాన్స్‌కో, జెన్‌కో డిస్కంలలో కొత్తగా డైరెక్టర్లను నియమించేందుకు ఆయా సంస్థల యాజమాన్యాలు త్వరలో అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నాయి. విద్యుత్ సంస్థలో కనీసం మూడేళ్లు చీఫ్ ఇంజనీర్/చీఫ్ జనరల్ మేనేజర్‌గా పనిచేసిన అనుభవం కలిగిన వాళ్లు డైరెక్టర్ పదవికి అర్హులు కానున్నారు. కొత్త డైరెక్టర్లు వచ్చేవరకు ప్రస్తుత డైరెక్టర్లను కొనసాగించనున్నారు. డిస్కంలలో మాత్రం ప్రస్తుత డైరెక్టర్లకు ఉద్వాసన పలికి కొత్త వారిని నియమించే వరకు సీనియర్ అధికారులను ఇన్‌చార్జి డైరెక్టర్లుగా నియమించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలి

న్యాయవాదులకు హైకోర్టు జడ్జి జస్టిస్ మాధవీదేవి పిలుపు

- రాజన్న సిరిసిల్ల జిల్లా కోర్టు సముదాయంలో రెండో ఏజేసీజే కోర్టు భవనం ప్రారంభం



సిరిసిల్ల కోర్టు ప్రాంగణంలో మొక్క నాటుతున్న జస్టిస్ మాధవీదేవి, జస్టిస్ శ్రీనివాస్‌రావు



సూర్యాపేటలో హైకోర్టు జడ్జి జస్టిస్ పుల్లా కార్తీక్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు



నల్లగొండలో ఫ్యామిలీ కోర్టు భవనాన్ని పరిశీలిస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ రాధారాణి



భద్రాచలంలో కోర్టును ప్రారంభిస్తున్న జస్టిస్ ఈవీ వేణుగోపాల్, జస్టిస్ కాజా శరత్

సిరిసిల్ల కల్చరల్/వేములవాడ: న్యాయవాద వృత్తిలో టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని, నిరంతర అధ్యయనంతోనే రాణించవచ్చని హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ టి.మాధవీదేవి పేర్కొన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కోర్టు సముదాయంలో రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి (ఏజేసీజే) కోర్టు భవనాన్ని హైకోర్టు మరో న్యాయమూర్తి జస్టిస్ జె.శ్రీనివాస్‌రావుతో కలిసి శనివారం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో న్యాయవాదులకు దిశానిర్దేశనం చేశారు. ప్రస్తుతం హైకోర్టులో అమలులో ఉన్న వర్చువల్ విధానాన్ని రానున్న రోజుల్లో అన్ని కోర్టులకూ విస్తరిస్తామన్నారు. జిల్లా కోర్టులోనూ ఈ ఫైలింగ్ విధానాన్ని ప్రవేశపెడతామన్నారు. కోర్టు సముదాయం కోసం కేటాయించిన స్థలం విషయంలో బార్ కౌన్సిల్ ప్రతిపాదనను పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. జస్టిస్ జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ కఠోరశ్రమ, నిజాయితీతో కొనసాగితే న్యాయ వృత్తిలో రాణించడం సులువేనన్నారు. సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల న్యాయమూర్తులు ఎస్.ప్రేమలత, నీలిమ, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు కాసుగంటి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం జస్టిస్ శ్రీనివాసరావు, జస్టిస్ మాధవిదేవి వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు.

భద్రాచలంలో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు

భద్రాచలం అర్బన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టును హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఈవీ వేణుగోపాల్, జస్టిస్ కాజా శరత్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భద్రాచలంలో ఇప్పటికే ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు ఉన్నప్పటికీ.. సుమారు 3,000 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి సంబంధించి సత్వర తీర్పు వెలువరించేందుకే మరో కోర్టు ఏర్పాటు చేయాల్సి వచ్చిందని చెప్పారు. భద్రాచలం బార్ అసోసియేషన్ హైకోర్టుకు ఇద్దరు న్యాయమూర్తులను అందించిందని, బార్ అభివృద్ధికి తమ సహకారం ఎల్లవేళలా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండలో ఫ్యామిలీ కోర్టు ప్రారంభం

రామగిరి(నల్లగొండ): నల్లగొండ జిల్లా కోర్టు సముదాయంలో ఫ్యామిలీ కోర్టును హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రాధారాణి శనివారం ప్రారంభించారు. అదేవిధంగా జ్యుడీషియల్ ఎంప్లాయిస్ నూతన సంవత్సర కేలెండర్‌ను ఆవిష్కరించారు. హైకోర్టు జడ్జికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు స్వాగతం పలకగా.. పలువురు జడ్జిలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి తిరుపతి, ఫ్యామిలీ కోర్టు జడ్జి దుర్గాప్రసాద్, ఐదవ అదనపు జిల్లా జడ్జి జి.వేణు పాల్గొన్నారు.

సమస్యలను హైకోర్టు దృష్టికి తీసుకెళ్తా: జస్టిస్ పుల్లా కార్తీక్

చివ్వెంల(సూర్యాపేట): సూర్యాపేట జిల్లా కోర్టులో నెలకొన్న సమస్యలను హైకోర్టు దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హైకోర్టు జడ్జి, సూర్యాపేట జిల్లా పోర్టుఫోలియో జడ్జి జస్టిస్ పుల్లా కార్తీక్ అన్నారు. ఆయన శనివారం సూర్యాపేట జిల్లాకోర్టును సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం ఇచ్చారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జస్టిస్ కార్తీక్ మాట్లాడారు. అంతకుముందు ఆయన పిల్లలమర్రి శివాలయాన్ని, అర్వపల్లిలోని యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోంగ్రాల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రూ.30 కోట్లతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి శంకుస్థాపన • ప్రతి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తామని వెల్లడి

నల్లగొండ: స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్‌ను ప్రతి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తామన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా మొదటగా నల్లగొండ జిల్లా కేంద్రంలో రూ.30 కోట్లతో భవనానికి శంకుస్థాపన చేసినట్టు రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. శనివారం ఆయన నల్లగొండ పట్టణంలో నిర్మాణపనులకు శంకుస్థాపన చేసి.. మహిళా ప్రాంగణంలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆరు నెలల్లో భవనం పూర్తి చేసి ఏడాదికి 10 వేల మంది నిరుద్యోగులకు స్వయం ఉపాధిపై శిక్షణ ఇస్తామన్నారు. పానగల్ రోడ్డులో రూ.2 కోట్లతో సీనియర్ సిటిజన్ల కోసం భవన నిర్మాణానికి, దర్వేశిపురంలో రూ.15 కోట్లతో బ్రిడ్జి వెడల్పు పనులకు, నల్లగొండ నుంచి ముశంపల్లి మీదుగా ధర్మాపురం వరకు రోడ్డు విస్తరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

నాకు పేరు వస్తుందనే...

గత బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీశైలం సొరంగ మార్గంను(ఎస్ఎల్‌బీసీ) పూర్తి చేస్తే తనకు పేరు వస్తుందనే అక్కసుతోనే పట్టించుకోలేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. తాను ఇటీవల సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి సొరంగ మార్గం పూర్తి కోసం రూ.1500 కోట్ల బడ్జెట్ పెట్టించానని, ఏఎమ్మార్పీ మెయిన్ కెనాల్ లైనింగ్ కోసం మరో రూ.510 కోట్లు, డిస్ట్రిబ్యూటరీ లైనింగ్‌ల కోసం రూ.310 కోట్లు పెట్టించానని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ పనులను మూడేళ్ల కాలంలో పూర్తి చేయిస్తానని, తాగునీటి సమస్యను గట్టెక్కించేందుకు కృషి చేస్తున్నామన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి

ఫిబ్రవరి నుంచి పంచాయతీల్లో ప్రత్యేక పాలన

బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం

మర్కూక్(గజ్వేల్), సాక్షి, హైదరాబాద్: ఫిబ్రవరి నుంచి పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగిస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం పాములపర్తి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరో నాలుగు రోజుల్లో సర్పంచుల పదవీ కాలం ముగుస్తుందని, ఫిబ్రవరి నుంచి ప్రత్యేక అధికారుల ప్రారంభమవుతుందని చెప్పారు. సర్పంచ్‌ల పదవీ కాలం పొడిగించడానికి వీలు లేదన్నారు. రిజర్వేషన్ల మార్పులు చేర్పులు ఉంటాయని, వాటి ఆధారంగా ఎన్నికలు జరిగే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

పోలీసులు మినహా మిగిలిన శాఖల ఉద్యోగులకు అవకాశం

ఫిబ్రవరి 1తో రాష్ట్రంలోని సర్పంచ్‌లు, పాలకమండళ్ల పదవీకాలం ముగుస్తుండటంతో.. పల్లెల్లో 'ప్రత్యేక అధికారుల' నియామకానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే జిల్లా కలెక్టర్లకు ఈ మేరకు ఆదేశాలు పంపించింది. ప్రత్యేక అధికారుల నియామకం కోసం పోలీస్ శాఖ పరిధిలోని అధికారులు మినహాయించి... పంచాయతీరాజ్, రెవెన్యూ, విద్య, వైద్యం, వ్యవసాయ, ఉద్యాన, ఇతర మండలస్థాయి అధికారులు, వివిధస్థాయిల ఉద్యోగుల నియామకానికి జిల్లా, మండలస్థాయిల్లో అధికారులు జాబితాలు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. దీనికి సంబంధించి జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ అధికారులు (డీపీవో)సమన్వయ బాధ్యతలను నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది.

టీఎస్సీపీసీఆర్ నియామకాలకు దరఖాస్తులు

సాక్షి హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(టీఎస్సీపీసీఆర్) చైర్మన్, ఆరుగురు సభ్యుల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం ఉపక్రమించింది. ఈ మేరకు రాష్ట్ర మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ శనివారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ పోస్టులకు క్షేత్ర స్థాయి నుంచి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఆసక్తి ఉండి అర్హతలు కలిగిన వారు ఈనెల 29వ తేదీ నుంచి ఫిబ్రవరి 12వ తేదీ వరకు ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు సమర్పించాలని స్పష్టం చేసింది. దరఖాస్తు ఫారం ఇతర వివరాల కోసం రాష్ట్ర మహిళా భివృద్ధి శిశు సంక్షేమ శాఖ వెబ్‌సైట్ https://wdcw.tg.nic.in చూడాలని తెలిపింది. ఆన్‌లైన్ పద్ధతిలో వచ్చిన దరఖాస్తులు మాత్రమే పరిగణిస్తా మని, ఇతర పద్ధతిలో వచ్చిన వాటిని పరిగణించమని స్పష్టం చేశారు. ఈ కమిషన్ పరిధిలోని ఆరు పోస్టులలో రెండు మహిళలకు కేటాయిస్తున్నట్లు కరుణ వెల్లడించారు.

డిస్కంలకు రూ.58,981 కోట్లు!

- 2024–25 బడ్జెట్‌లో కేటాయించాలి
- విద్యుత్ సబ్సిడీల కింద రూ.17,120 కోట్లు
- ప్రభుత్వ విద్యుత్ బిల్లుల బకాయిలు రూ.40,981 కోట్లు
- ప్రభుత్వానికి ఇంధన శాఖ ప్రతిపాదనలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లకు రూ.17,102 కోట్ల విద్యుత్ సబ్సిడీలతోపాటు మరో రూ.40,981 కోట్ల ప్రభుత్వ విద్యుత్ బిల్లుల బకాయిలు (హెచ్‌టీసీసీ) కలిపి మొత్తం రూ.58,684.17 కోట్లను 2024–25 బడ్జెట్‌లో కేటాయించాలని ఇంధనశాఖ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఈ మేరకు బడ్జెట్ ప్రతిపాదనలను సమర్పించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023–24లో డిస్కంలకు రూ.11,500 కోట్ల విద్యుత్ సబ్సిడీని మంజూరు చేయగా దాన్ని రూ.17,120 కోట్లకు పెంచాలని ఇంధన శాఖ కోరింది. అందులో టీఎస్ ఎస్పీడీసీఎల్‌కు రూ.3,654.51 కోట్లు, టీఎస్ఎన్పీడీసీఎల్‌కు రూ.14,048 కోట్లను కేటాయించాలని విజ్ఞప్తి చేసింది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్, గృహాలు, ఇతర కేటగిరీల వినియోగదారులకు ఇప్పటికే అందిస్తున్న రాయితీలను కొనసాగించడంతోపాటు శాసనసభ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గృహాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరాను 2024–25లో ప్రారంభించడానికి రూ.17,120 కోట్ల సబ్సిడీని ప్రభుత్వం భరించాల్సి ఉంటుందని ఇంధన శాఖ అంచనా వేసింది. ప్రతిపాదిత సబ్సిడీలో రూ. 4 వేల కోట్లు గృహాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరాకు సంబంధించినవేనని అధికార వర్గాలు తెలిపాయి. రూ.17,120 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించినా వచ్చే ఏడాది కొంత మొత్తంలో విద్యుత్ చార్జీలను పెంచకుంటే డిస్కంల నష్టాలు మరింతగా పెరిగిపోతాయని అధికారులు తెలిపారు.

సర్కారీ బకాయిలు రూ.40 వేల కోట్లు ఇవ్వండి

గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన ముగిసే నాటికి వివిధ శాఖలు, విభాగాల నుంచి డిస్కంలకు రావాల్సిన విద్యుత్ బిల్లుల బకాయిలు రూ.28,842.72 కోట్లకు పెరిగాయని పేర్కొంటూ ఇటీవల విద్యుత్‌పై ప్రవేశ పెట్టిన శ్వేతపత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెల్లడించింది. దీనికితోడు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సి న ఇతర విద్యుత్ బిల్లుల బకాయిలు కలిపి మొత్తం రూ.40,981 కోట్లను డిస్కంలకు 2024–25లో చెల్లించాలని ఇంధన శాఖ ప్రభుత్వాన్ని కోరింది. రూ.17,120 కోట్ల సబ్సిడీ, రూ.40,981 కోట్ల పెండింగ్ బిల్లులు కలిపి మొత్తం రూ.58,684.17 కోట్లను బడ్జెట్‌లో కేటాయించాలని కోరడం గమనార్హం.

పదో తరగతి పరీక్ష ఫీజు గడువు ఫిబ్రవరి 5

సాక్షి, హైదరాబాద్: మార్చిలో నిర్వహించే పదోతర గతి (ఎస్‌ఎస్‌సీ) పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లింపునకు తత్కాల్ స్కీంలో భాగంగా ఫిబ్రవరి 5వ తేదీ వరకు గడువు విధించినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫీజును రూ.1,000 ఆలస్య రుసుముతో చెల్లించేందుకు ఇదే చివరి అవకాశమని, ఆ తరువాత గడువు పొడిగించేది లేదని పేర్కొన్నారు. మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షలకు హాజర య్యేవారే ఆ తరువాత జరిగే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు అర్హత సాధిస్తారని పేర్కొన్నారు. కావున ఒకసారి ఫెయిలైన విద్యార్థులు కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. సంబంధిత ప్రధానోపాధ్యాయులు ఫీజు మొత్తాన్ని ఫిబ్రవరి 6లోగా ట్రెజరీలో జమచేయాలని, అదేరోజు నామినల్ రోల్స్‌ను కూడా డీఈవో కార్యాలయానికి పంపాలని సూచించారు.

వీసీల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

వివిధ సెట్‌లకు కన్వీనర్ల నియామకం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పది విశ్వవిద్యాలయాలకు ఉప కులపతుల (వీసీలు) నియామక ప్రక్రియ వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. మరో రెండు నెలల వ్యవధిలో ప్రస్తుత వైస్ చాన్సలర్ల పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. వచ్చేనెల 12వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవడానికి గడువు విధించింది. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం నోటిఫికేషన్ జారీ చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, డా.బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, జేఎన్‌టీయూ, జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్, ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం, వరంగల్‌లోని కాకతీయ వర్సిటీ, నల్లగొండ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం, కరీంనగర్ శాతవాహన వర్సిటీ, నిజామాబాద్ తెలంగాణ విశ్వవిద్యాలయాల వీసీ పోస్టులకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. ఈ పోస్టులకు సంబంధించిన అర్హతలు, ఇతర వివరాల కోసం www.tsche.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని బుర్రా వెంకటేశం ఒక ప్రకటనలో తెలిపారు.

కన్వీనర్ల నియామకం..

వివిధ కోర్సుల్లో ప్రవేశ పరీక్షల నిర్వహణ నిమిత్తం వివిధ సెట్లకు కన్వీనర్ల ను నియమించారు. ఎప్‌సెట్ కన్వీనర్‌గా జేఎన్టీయూహెచ్ ప్రొఫెసర్ బి.డీన్ కుమార్, పీజీఈసెట్ కన్వీనర్‌గా జేఎన్టీయూహెచ్ ప్రొఫెసర్ అరుణ కుమారి, ఐసెట్ కన్వీనర్‌గా కేయూ ప్రొఫెసర్ ఎస్.నర్సింహారావు, ఈసెట్ కన్వీనర్‌గా ఓయూ ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్, లాసెట్, పీజీ ఎల్‌సెట్ కన్వీనర్‌గా ఓయూ ప్రొఫెసర్ విజయలక్ష్మి, ఎడ్‌సెట్ కన్వీనర్‌గా ఓయూ ప్రొఫెసర్ మృణాళిని, పీఈ సెట్ కన్వీనర్‌గా ఓయూ ప్రొఫెసర్ రాజేశ్‌కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఆల్ఫా హోటల్‌కు బాంబు బెదిరింపు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని ఆల్ఫా హోటల్‌కు బాంబు బెదిరింపు రావడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. శనివారం రాత్రి 10:40 గంటలకు ఆగంతకుడు 100కు డయల్ చేసి ఆల్ఫా హోటల్లో బాంబు పెట్టామని బెదిరించాడు. దీంతో వెంటనే మార్కెట్ పోలీసులతోపాటు సీసీఎస్ ఏసీపీ శివమారుతి ఆధ్వర్యంలో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ అక్కడికి చేరుకుని హోటల్లో తనిఖీలు చేసింది. హోటల్లోని కస్టమర్లను, సిబ్బందిని బయటకు పంపి గాలింపు చేపట్టారు. ఎక్కడా ఎలాంటి అనుమానాస్పద వస్తువులు గానీ పేలుడు పదార్థాలు గానీ కనిపించకపోవడంతో పోలీసులు, స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సాహితీ సుగంధం!

విభిన్నం, వైవిధ్యం, హైదరాబాద్ సాహిత్యోత్సవం

- జ్ఞానాన్వేషణకు స్ఫూర్తినిచ్చే ఫుడ్ ఫర్ థాట్
- వైవిధ్యభరితమైన చిత్రకళా ప్రదర్శనలు



పుస్తకాలను పరిశీలిస్తున్న సందర్శకులు

సాక్షి, హైదరాబాద్: విభిన్న అంశాలపై సమావేశాలు, సదస్సులు.. ఇష్టాగోష్టులు, వైవిధ్యభరితమైన సాంస్కృతిక, చిత్రకళా ప్రదర్శనలు.. స్ఫూర్తినిచ్చే అద్భుతమైన కార్యక్రమాలతో హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ శనివారం రెండోరోజు కన్నుల పండువగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారుల ప్రదర్శనలు సందర్శకులను కట్టిపడేశాయి. ప్రత్యేక ప్రద్శనలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి వచ్చిన చిత్రకళాకారులు అద్భుతమైన చిత్రాలను ప్రదర్శించారు. పిల్లలు, యువతీ యువకుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాలకు కూడా అనూహ్యమైన స్పందన లభించింది. వివిధ రంగాలకు చెందిన రచయితలు, ప్రముఖులు, మేధావుల పుస్తకాలను ఈ సందర్భంగా ప్రదర్శనకు ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న హైదరాబాద్ లిటరరీ ఫెస్టి వల్ 14వ ఎడిషన్ ఈసారి హైటెక్ సిటీలోని సత్వ నాలెడ్జ్ సెంటర్‌లో నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఒడియా భాష పై, నార్వే సాహిత్యంపై ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఈ రెండు భాషలకు చెందిన సాహిత్యం, సాంస్కృతిక అంశాలు, కళలపై ప్రత్యేకంగా దృష్టి సారించి కార్యక్రమాలను రూపొందించారు.

ఆలోచింపజేస్తున్న 'ఫుడ్ ఫర్ థాట్'

- 'జ్ఞానం కోసం అన్వేషణ' అనే లక్ష్యంతో 8 ఏళ్లుగా పని చేస్తున్న 'ఫుడ్ ఫర్ థాట్' సంస్థ హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో ఏర్పాటు చేసిన ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. నవలలు, కామిక్స్, జనరల్ నాలెడ్జ్, సమకాలీన అంశాలు, కథలు తదితర అంశాలు, విభిన్న భాషల్లో వచ్చిన సాహిత్యాన్ని పిల్లలకు అందజేసే లక్ష్యంతో ఫుడ్ ఫర్ థాట్ సంస్థ దేశవ్యాప్తంగా 600కు పైగా గ్రంథాలయాలను నిర్వహిస్తోంది. ఈ గ్రంథాలయాల్లో 70 శాతం ఇంగ్లిష్ లిటరేచర్ ఉంటే మరో 30 శాతం స్థానిక భాషల సాహిత్యం ఉంటుంది. విద్యార్థుల్లో పుస్తకపఠనం పట్ల అభిరుచిని, ఆసక్తిని పెంచేందుకు ఈ సంస్థను ఏర్పాటు చేసినట్లు ఫుడ్‌ఫర్ థాట్ వ్యవస్థాపకులు షఫాలీరావు తెలిపారు. ఇప్పటి వరకు 25000 మందికి పైగా పిల్లలకు వివిధ అంశాలపైన సాహిత్యాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు.
- 'పిల్లల్లో సృజనాత్మకతను పెంచాల్సిన అవసరం ఉంది. పట్టణ ప్రాంతాల్లో చదువుకుంటున్న వాళ్లకు పుస్తకాలు, లైబ్రరీలు అందుబాటులో ఉన్నాయి. కానీ వారిలో పఠనం పట్ల ఆసక్తి కొరవడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకోవాలనే తపన ఉంది. కానీ ఆ పిల్లలకు పుస్తకాలు అందుబాటులో లేవు. దీన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాలకు చెందిన పిల్లలకు ఎక్కువగా అందుబాటులో ఉండేవిధంగా లైబ్రరీలను ఏర్పాటు చేశాం. హైదరాబాద్‌లో కూడా సాధారణ బస్తీల్లో నివసించే చిన్నారుల పుస్తకాల అవసరాన్ని తీర్చేందుకు లైబ్రరీలను ఏర్పాటు చేశాం' అని ఆమె చెప్పారు. ఫిబ్రవరి 10వ తేదీన అర్బన్ రీడింగ్ డెకథ్లాన్ పేరిట బిర్లా ఆడిటోరియంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రీడింగ్ ఛాంపియన్‌లకు బహుమతులను అందజేయనున్నారు.

భళా.. చిత్రకళా..

హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన చిత్రకారులు వేసిన బొమ్మలు, కళాకృతులతో ప్రత్యేక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన కూడా సందర్శకులను ఆకట్టుకుంటోంది. కేరళ, బెంగళూరు, కోల్‌కతా, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన ఆర్టిస్టుల చిత్రాలను ఇక్కడ ఏర్పాటు చేశారు. గొంగడిపై హ్యాండ్ ఎంబ్రాయిడరీ, రాజశేఖర్ అనే ఆర్టిస్ట్ వేసిన జాలరుల జీవన చిత్రం, కేరళకు చెందిన మీర వేసిన ఆఫ్‌సెట్ పెయింటింగ్స్ సందర్శకులను ఆలోచింపజేస్తున్నాయి. మరోవైపు చిన్నారుల కోసం ప్రత్యేకంగా చిత్రకళా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. యువతీ యువకులు తమ సృజనాత్మకతను సమున్నతంగా ఆవిష్కరించేందుకు ప్రత్యేక శిబిరాన్ని కూడా ఏర్పాటు చేశారు.

నక్షత్ర మేఘం.. వెలుగు పూల పరదా



నిశిరాత్రి చీకటి.. కొండల మీదుగా అర్ధ చంద్రాకారంలో పరుచుకున్న నక్షత్రాల మేఘం, ఆ దిగువన మిలమిల మెరుస్తున్న పూల మొక్కలతో దృశ్యం సుమనోహరంగా ఉంది కదూ. మార్సియో కబ్రాల్ అనే ఫొటోగ్రాఫర్ బ్రెజిల్‌లోని 'ఛాపదా దాస్ వీడెరోస్' నేషనల్ పార్క్‌లో ఈ ఫొటోను క్లిక్‌మనిపించారు. పైన ఆకాశంలో పాలపుంత గెలాక్సీ పరుచుకుని ఉండగా.. కింద పార్క్‌లో ఏర్పాటు చేసిన లైట్ల కాంతిని 'పెపలాంథస్' మొక్కల పూలు ప్రతిఫలిస్తుండగా.. ఈ అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. ఈ చిత్రం 'ది నేచర్ ఫొటోగ్రఫీ కాంటెస్ట్'లో ప్లాంట్ లైఫ్ విభాగం కింద బెస్ట్ ఫొటోగా ఎంపికైంది.

- సాక్షి సెంట్రల్ డెస్క్

అక్కడో రీతి... ఇక్కడో తీరు

▶ మొదటి పేజీ తరువాయి

అవకాశాలను ఎంచుకుంటున్నారు. ఈ కారణంగా దేశవ్యాప్తంగా ఉండే ఇంజనీరింగ్ సీట్లలో 54 శాతం దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉంటున్నాయి. దేశవ్యాప్తంగా 12,47,667 బీటెక్ సీట్లు అందుబాటులో ఉంటే, వీటిల్లో 6,74,697 సీట్లు దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉన్నాయి. ఎంసీఏలో 70,065 సీట్లు ఉంటే, 30,812 (44 శాతం) దక్షిణాదిలో ఉన్నాయి. ఎంబీఏ, పీజీడీఎం వంటి మేనేజ్‌మెంట్ కోర్సులకు సంబంధించి దేశవ్యాప్తంగా 3,39,405 సీట్లు ఉంటే, దక్షిణాదిన 1,57,632 సీట్లున్నాయి. బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ సీట్లు దక్షిణాదిలోనే పెరగడానికి ఇదే కారణమని ఏఐసీటీఈ భావిస్తోంది. 2015–16లో దక్షిణాది రాష్ట్రాల్లో 48.77 బీటెక్ సీట్లు ఉంటే, ఆరేళ్లలో అవి 5.3 శాతం మాత్రమే పెరిగాయని మండలి గుర్తించింది.

దక్షిణాది రాష్ట్రాల్లో బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ కాలేజీలు.. సీట్లు

రాష్ట్రం	కాలేజీల సంఖ్య	సీట్ల సంఖ్య
తమిళనాడు	489	2,48,552
ఆంధ్రప్రదేశ్	280	1,48,952
తెలంగాణ	189	1,10,808
కర్ణాటక	195	1,08,812
కేరళ	152	50,493
పుదుచ్చేరి	15	7,080
మొత్తం	1320	6,74,697

స్కిల్... పాలన నైపుణ్యంపై దృష్టి

అంతర్జాతీయ స్థాయిలో వస్తున్న పాలనాపరమైన మార్పులు, ప్రైవేటు రంగంలో వస్తున్న సరికొత్త డిమాండ్‌కు అనుగుణంగా ఉత్తరాది రాష్ట్రాల్లో పాఠ్యాంశాలు రూపొందించాలని ఏఐసీటీఈ, యూజీసీ భావిస్తోంది. ఇక దక్షిణాది రాష్ట్రాల్లో ఇంజనీరింగ్ విద్యలో నైపుణ్యం పెంచడంపై దృష్టి పెట్టాలని గుర్తించింది. పారిశ్రామిక భాగస్వామ్యంతో ఇంజనీరింగ్ విద్యను ముందుకు తీసుకెళ్ళే ఆలోచనలపై ఫోకస్ చేయాలని భావిస్తోంది. ఈ మొత్తం వ్యవహారంపై త్వరలో విధివిధానాలు వెల్లడించే వీలుందని అధికార వర్గాలు తెలిపాయి.

తప్పుడు సమాచారం అతిపెద్ద ముప్పుగా పరిణమిస్తున్నది ఎక్కడంటే..

ఈ కింది దేశాలకు పొంచి ఉన్న 34 రకాల ముప్పుల్లో 'తప్పుడు సమాచారం' ర్యాంకు ఇలా..



గమనిక: 2023 సెప్టెంబర్ 4 నుంచి అక్టోబర్ 9 మధ్య విద్య, వాణిజ్య రంగాలు, ప్రభుత్వాలు, అంతర్జాతీయ, పౌర సమాజానికి చెందిన 1,490 మంది నిపుణుల అభిప్రాయాల ఆధారంగా సేకరణ.

ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాది భారత్ సహా వివిధ దేశాలు సార్వత్రిక ఎన్నికలకు సిద్ధమవుతున్న వేళ తప్పుడు సమాచార వ్యాప్తి అనేది ప్రజలు ఎదుర్కోబోయే ముప్పుల్లో ప్రధానమైనది కానుందని వరల్డ్ ఎకనామిక్ ఫోరం చేపట్టిన తాజా అధ్యయనం తేల్చింది. ఈ జాబితాలో భారత్ తొలిస్థానంలో ఉందని పేర్కొంది. వివిధ రంగాలకు చెందిన నిపుణులతో జరిపిన ఈ సర్వేను 2024 గ్లోబల్ రిస్క్ రిపోర్ట్ పేరిట డబ్ల్యూఈఎఫ్ విడుదల చేసింది. ఆర్థిక, పర్యావరణ, రాజకీయ, సామాజిక, సాంకేతికత వంటి 34 అంశాలను ప్రాతిపదికగా తీసుకొని కేటాయించిన ర్యాంకుల ప్రకారం రాబోయే రెండేళ్లలో కొన్ని దేశాలకు ఈ తప్పుడు సమాచార వ్యాప్తి సమస్యాత్మకం కావచ్చని అంచనా వేసింది. ఎన్నికల వేళ వ్యాప్తి చెందే తప్పుడు సమాచారం ఎన్నికైన ప్రభుత్వాల అస్థిరతకు దారితీయొచ్చని... రాజకీయ అనిశ్చితి, విధ్వంసం, ఉగ్రవాదానికి కారణం కావొచ్చని.. ఈ పరిణామం దీర్ఘకాలిక ప్రజాస్వామిక ప్రక్రియకు విఘాతం కలిగించవచ్చని ఈ అధ్యయనంలో పాల్గొన్న నిపుణులు అభిప్రాయపడ్డారు.

'మూసీ'ని మార్చేస్తాం

- త్వరలోనే మూసీ రివర్‌ఫ్రంట్ కోసం ఈఓఐలకు ఆహ్వానం
- హైటెక్స్‌లో బీఏఐ 31వ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి, ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: మూసీనదిని పునరుజ్జీవింపచేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(బీఏఐ) 31వ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై బీఏఐ సావనీర్‌ను విడుదల చేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ త్వరలోనే మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి ఆసక్తి వ్యక్తీకరణ (ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్)ను ఆహ్వానిస్తామన్నారు. 55 కిలోమీటర్ల పొడవైన మూసీనది వెంట కనెక్టింగ్ కారిడార్లు, మెట్రో, ఆట, వినోద కేంద్రాలు, హోటళ్ల ఏర్పాటుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్టు చెప్పారు. మూసీ అభివృద్ధికి లండన్‌లోని థేమ్స్ నది నుంచి గుజరాత్‌లోని సబర్మతి నది వరకు నదీపరీవాహక ప్రాంత రాష్ట్రాలను ప్రత్యక్షంగా పర్యవేక్షించి ఎలాంటి ప్రణాళికలు రూపొందించాలనేదిపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రాభివృద్ధిలో కాంట్రాక్టర్లు, బిల్డర్లు భాగస్వాములేనని, రాష్ట్రంలోని మౌలిక వసతులే ఆ రాష్ట్ర అభివృద్ధికి కొలమానమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కాంట్రాక్టర్లు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయం చేశారని గుర్తు చేశారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధిలో కాంట్రాక్టర్లు భాగస్వాములేనని, వారి సమస్యలను పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటామన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్, నిర్మాణ రంగంలో 20 ఏళ్లుగా ఉన్న ఈపీసీ కాంట్రాక్టర్ల బిల్లుల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతామని చెప్పారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఓఆర్‌ఆర్, ఆర్‌ఆర్‌ఆర్ మధ్య ప్రతి 5 కిలోమీటర్లకు ఒక క్లస్టర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ప్రతి క్లస్టర్ వద్ద పాఠశాలలు, ఆస్పత్రులు, సౌరవిద్యుత్ ప్లాంట్లు, సైకిల్ ట్రాక్, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సంకల్పించామని, అందుకు తగ్గ ప్రణాళిక ప్రభుత్వం రూపొందిస్తుందని చెప్పారు.

20 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్

- విద్యార్థుల కోసం కొడంగల్‌లో నిర్మించాలని సీఎం ఆదేశం
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు అన్ని వసతులతో 20 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ పైలెట్ ప్రాజెక్టును కొడంగల్‌లో నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ విషయాన్ని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ వెల్లడించారు. స్కాలర్‌షిప్‌లు, మెస్ చార్జీలు, విద్యార్థుల కోసం వంట చేసే వాళ్ల బిల్లుల బకాయిలు లేకుండా గ్రీన్‌చానెల్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారని ఆయన తెలిపారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ శాఖలపై జరిగిన సమీక్షా సమావేశం అనంతరం మీడియాతో షబ్బీర్ అలీ మాట్లాడారు. సమీకృత పాఠశాలల కోసం భూములను గుర్తించాలని ప్రభుత్వం ఇప్పటికే కలెక్టర్లను ఆదేశించిందన్నారు. వీటికి నిధుల సేకరణపై, నిర్మాణాల డిజైన్ ఎలా ఉండాలనే దానిపై అధికారులతో చర్చించారని చెప్పారు. సోమవారం మళ్లీ సమావేశమై తుది నిర్ణయం తీసుంటామని షబ్బీర్ వెల్లడించారు.

రోగాలకు 'గూగుల్ చికిత్స' వద్దు

కిడ్నీ సమస్యలపై అందరూ అప్రమత్తంగా ఉండాలి

కేంద్ర ఆరోగ్య బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

క్రిటికల్ కేర్ నెఫ్రాలజీపై అంతర్జాతీయ సదస్సులో గవర్నర్ తమిళిసై



మాదాపూర్‌లోని యశోద ఆస్పత్రిలో అంతర్జాతీయ క్రిటికల్ కేర్ నెఫ్రాలజీ సదస్సును ప్రారంభించిన గవర్నర్ తమిళిసై తదితరులు

మాదాపూర్: కిడ్నీ సమస్యలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ రాష్ట గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. మాదాపూర్‌లోని యశోద హాస్పిటల్‌లో అత్యాధునిక క్రిటికల్ కేర్ నెఫ్రాలజీపై శనివారం అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సును ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ, రోజురోజుకీ జీవన విధానంలో మార్పులు రావడం వల్లనే అనారోగ్య సమస్యలు ఎక్కువగా పెరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ మెరుగైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని కోరారు. గ్రామాలలో చాలా మందికి కిడ్నీ సమస్యలపై అవగాహన లేకపోవడంతో, సంబంధంలేని డాక్టర్ల వద్దకు వెళ్లి మోతాదుకు మించిన మందులను వాడుతుండటంతో కిడ్నీ సమస్యలు తీవ్రమవుతున్నాయని తెలిపారు. చాలా మంది గూగుల్ సెర్చ్ చేసి స్వయంగా మందులు వాడటంతో అవి పెద్ద సమస్యలుగా మారుతున్నాయన్నారు. డాక్టర్ల సలహా మేరకు మాత్రమే మందులను వాడాలని, సంబంధించిన డాక్టర్ వద్ద మాత్రమే చికిత్స పొందాలని గవర్నర్ కోరారు. కేంద్ర ప్రభుత్వం రూ.5 లక్షల రూపాయల ఆరోగ్య బీమాను అందిస్తోందని, ప్రతి ఒక్కరూ దానిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. కిడ్నీలను పరీక్షించేందుకు గతంలో సరైన పరికరాలు ఉండేవి కాదని, ప్రస్తుతం అత్యాధునిక యంత్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇలాంటి సదస్సులను నిర్వహించడం వల్ల రోగులకు వ్యాధులపై అవగాహనతో పాటు మెరుగైన చికిత్సను అందించవచ్చని చెప్పారు. యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి మాట్లాడుతూ, ఏకేఐ నిర్ధారణ సీరం క్రియాటినిన్ పెరుగుదలపై ఆధారపడి ఉంటుందన్నారు. ప్రపంచంలో దాదాపు 850 మిలియన్ ప్రజలు ఏదో ఒక మూత్రపిండాల వ్యాధితో సతమతమవుతున్నారని తెలిపారు. కిడ్నీ వ్యాధులు, ఆరోగ్యంపై అవగాహన కల్పించడానికి, క్రిటికల్ కేర్ నెఫ్రాలజీ వ్యాధులపై చర్చించడానికి సదస్సులో అంతర్జాతీయ వైద్య నిపుణులు పాల్గొననున్నట్టు తెలిపారు. ఈ సదస్సులో వేయి మందికిపైగా వైద్య నిపుణులు పాల్గొన్నారు.

బినామీలుగా సంబంధంలేని వ్యక్తులు!

పట్టుబడకుండా తెలివిగా వ్యవహరించిన శివ బాలకృష్ణ

- కోర్టులో ఏసీబీ దాఖలు చేసిన రిమాండ్ రిపోర్టులో వెల్లడి
- డాక్యుమెంట్లలో ఉన్న ప్రకారం రూ.4.9 కోట్ల విలువైన స్థిరాస్తులు గుర్తించాం
- మార్కెట్లో వీటి విలువ అంతకు పది రెట్లు ఎక్కువే..
- అక్రమాలు, అవినీతిలో అధికారులు, రాజకీయ నాయకుల సహకారం
- శివ బాలకృష్ణను తమ కస్టడీకి అప్పగించాలని కోర్టుకు విజ్ఞప్తి



శివ బాలకృష్ణ (ఫైల్)

సాక్షి, హైదరాబాద్: భూవినియోగ మార్పు, భవన అనుమతుల్లో అక్రమాలతో భారీగా ఆర్జించిన హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్, రెరా కార్యదర్శి శివబాలకృష్ణ.. చాలా తెలివిగా తనకు బంధుత్వం, దగ్గరి సంబంధమేదీ లేని వ్యక్తులను బినామీలుగా పెట్టుకుని వందల కోట్ల రూపాయల ఆస్తులు కొనుగోలు చేసినట్టు ఏసీబీ అధికారులు చెప్తున్నారు. తెలిసినవారైతే అనుమానం వస్తుందని భావించి ఇలా వ్యవహరించారని.. అధికారులు, రాజకీయ నేతల సహకారంతో వందల కోట్ల విలువ చేసే భూములను ఆర్జించారని అంటున్నారు. శివబాలకృష్ణపై ఆదాయానికి మించి ఆస్తుల కేసులో కోర్టులో దాఖలు చేసిన 45పేజీల రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలను వెల్లడించారు.

సహకరించిన అధికారుల పాత్రపైనా విచారణ

శివ బాలకృష్ణ ఇంటితోపాటు పీర్జాదిగూడలో రమాదేవి, జూబ్లీహిల్స్ ప్రమోద్‌కుమార్, మాదాపూర్‌లో సందీప్‌రెడ్డి, బాచుపల్లిలో సత్యనారాయణమూర్తి ఇళ్లు, ఇతర కార్యాలయాలు కలిపి మొత్తం 18 చోట్ల సోదాలు చేశామని.. భారీగా స్థిర, చరాస్తుల డాక్యుమెంట్లను గుర్తించామని రిమాండ్ రిపోర్టులో అధికారులు వివరించారు. ''బాలకృష్ణ ఇంట్లో స్వాధీనం చేసుకున్న 50 స్థిర, చరాస్తుల డాక్యుమెంట్లను పరిశీలించాం. పట్టణాల్లో విల్లాలు, ఇళ్లతోపాటు నాగర్‌కర్నూల్‌లో 12.13 ఎకరాలు, అబ్దుల్లాపూర్, భువనగిరి, చేవెళ్ల, యాదగిరిగుట్ట, సిద్దిపేట తదితర ప్రాంతాల్లో భూములు ఉన్నట్టు గుర్తించాం. స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్ల మేరకు స్థిరాస్తుల విలువ రూ.4.9 కోట్లుగా ఉంది. బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ అంతకు 10 రెట్లు ఎక్కువగా ఉంటుంది. అలాగే రూ.83,80,000 నగదు, నాలుగు కార్లు, రూ.8.26 కోట్ల విలువైన బంగారం, వెండితోపాటు పలు వస్తువులు సీజ్ చేశాం. 155 డాక్యుమెంట్లు, 4 బ్యాంక్ పాస్‌బుక్‌లు, ఖరీదైన వాచీలు, సెల్‌ఫోన్లు, లాకర్ పత్రాలు, ఎల్‌ఐసీ బాండ్లను స్వాధీనం చేసుకున్నాం. వీటిలో బినామీలను విచారించాల్సి ఉంది. అలాగే ఈ ఉదంతంలో ఇతర అధికారుల పాత్రపైనా దర్యాప్తు జరపాల్సి ఉంది..'' అని అధికారులు పేర్కొన్నారు.

రాజకీయ నాయకులూ సహకరించారు

లేఔట్ల అనుమతుల కోసం శివబాలకృష్ణ పెద్ద ఎత్తున లంచాలు డిమాండ్ చేసేవారని.. రెరా సెక్రటరీ హోదాలోనూ పలు అవకతవకలకు పాల్పడ్డారని ఏసీబీ అధికారులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. బాలకృష్ణ హయాంలో అనుమతులు ఇచ్చిన వాటిపై దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. అక్రమాలకు తనవారు అవసరమని భావించిన బాలకృష్ణ బంధువులను ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నియమించుకున్నారని.. కొందరు రాజకీయ నాయకులు కూడా సహకరించారని పేర్కొన్నారు. సోదాల్లో పట్టుబడిన ఆస్తులు, వస్తువులకు సంబంధించిన వివరాలపై ఎంత అడిగినా.. బాలకృష్ణ, ఆయన కుటుంబ సభ్యులు సహకరించలేదన్నారు. అన్ని వివరాలు బయటపడాలంటే ఇప్పటికే అరెస్టయి చంచల్‌గూడ జైలులో ఉన్న బాలకృష్ణను తమ కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరారు.

డ్రైవర్ పేరిట రూ.20 కోట్ల ఆస్తులు

బాలకృష్ణ డ్రైవర్ పేరిట నగర శివార్లలో రూ.20 కోట్లకుపైగా (మార్కెట్ రేట్ల ప్రకారం) విలువైన భూములు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారానికి సంబంధించి పలు జిల్లాల రిజిస్ట్రేషన్ కార్యాలయాలు, ఉద్యోగులు, బ్యాంకు లాకర్ల నుంచి ఆధారాలు సేకరిస్తున్నారు. ఆ ఆధారాలను బట్టి ఈ కేసుతో సంబంధమన్న వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. బినామీల్లో ఒకరు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్నట్టు గుర్తించి వివరాలు సేకరిస్తున్నట్టు తెలిసింది. హెచ్‌ఎండీఏ పరిధిలో ఏ పని జరగాలన్నా తొలుత ఆయన బినామీలను సంప్రదించాకే అధికారుల వద్దకు వెళ్లేలా బాలకృష్ణ ప్రత్యేకంగా ఓ యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకున్నట్టు కూడా విచారణలో తేలిందని ఏసీబీ వర్గాలు చెప్తున్నాయి.



కామారెడ్డిలో ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి ఇంటిని కూల్చేస్తున్న జేసీబీ

రోడ్డు విస్తరణ కోసం ఇంటిని కూల్చేసిన ఎమ్మెల్యే

వాగ్దానం నిలబెట్టుకున్న కాటిపల్లి

కామారెడ్డి టౌన్: అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ, ప్రస్తుత సీఎంలను ఓడించి జెయింట్ కిల్లర్‌గా పేరు తెచ్చుకున్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి మళ్లీ సంచలనంగా మారారు. కామారెడ్డి పట్టణాభివృద్ధిలో భాగంగా రోడ్ల విస్తరణ కోసం ఎమ్మెల్యే తన సొంత ఇంటినే త్యాగం చేసి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. తాతల కాలం నాటి ఆ ఇంట్లోనే నివసించే ఆయన అందులోనే పుట్టి పెరిగారు. అడ్లూర్ రోడ్‌లో గల తన ఇంటి ముందు ఆర్ అండ్‌బీ, మున్సిపల్ అధికారులతో చర్చించిన అనంతరం జేసీబీలతో కూల్చివేయించారు. సుమారు వెయ్యిగజాల ఆ ఇంటిస్థలాన్ని మున్సిపల్ అధికారులకు అప్పగించారు. పట్టణ అభివృద్ధి, రోడ్ల విస్తరణకు ప్రజలు సహకరించాలని, ఎవరూ ఆందోళన చెందవద్దని, ఇబ్బందులు పెట్టాలనే ఉద్దేశం లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ముందుగా తన ఇంటిని కూల్చేసి అభివృద్ధికి సహకరించానని, ఇలాగే ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం త్వరలోనే రోడ్లన్నీ విస్తరించనున్నట్లు తెలిపారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.